సత్యం, సమర్థత, విశ్వసనీయత

WWW.SAKSHYAM.COM

# సాక్ష్యం

తెలుగు దినపత్రిక

సంపుటి: 17 | సంచిక: 167

పేజీలు: 08 | వెల: రూ.2:00

హైదరాబాద్ | ఆదివారం 14 జూన్ 2026

Published from Hyderabad, Vijayawada.


## ఫ్రాన్స్‌లో భేటీ కానున్న మోదీ, ట్రంప్

- జూన్ 17న ఫ్రాన్స్‌లో జీ7 సదస్సు
- ఫ్రాన్స్ వేదికగా ద్వైపాక్షిక చర్చలకు చాన్స్!
- వాణిజ్యం, చమురుపై కీలక చర్చలు!!
- విదేశీ పర్యటనకు బయల్దేరిన మోడీ



న్యూఢిల్లీ ,జూన్13(సాక్ష్యం): అమెరికా ప్రభుత్వ ఉన్నతాధికారి ఒకరి ప్రకారం, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ జూన్ 17న ఫ్రాన్స్‌లో జరిగే జీ7 సదస్సు సందర్భంగా ద్వైపాక్షిక సమావేశం నిర్వహించనున్నారు. వ్యూహాత్మక సహకారం, ఇటీవలి దౌత్యపరమైన ఘర్షణల మిశ్రమ పరిస్థితులను ఎదుర్కొంటున్న భారత్–అమెరికా సంబంధాలలో

మిగతా 5 లో..



## అసోంలో కుప్పకూలిన విమానం

### ఐదురుగు వైమానిక సిబ్బంది మృతి!?

గౌహతి,జూన్13(సాక్ష్యం): అస్సాంలోని జోర్హాట్ వైమానిక స్థావరంలో విమాన ప్రమాదం చోటుచేసుకుంది. భారత వైమానిక దళానికి చెందిన ఏఎన్-32 రవాణా విమానం ఎయిర్‌బేస్ లోపల ల్యాండ్ అవుతుండగా, మంటలు చెలరేగడంతో కూలిపోయింది. ఈ ఘటనలో వాయుసేనకు చెందిన ఐదుగురు సిబ్బంది ప్రాణాలు

మిగతా 2 లో..




## తదుపరి ఆర్మీచీఫ్‌గా జనరల్ ధీరజ్ సేథ్

### ఉత్తర్వులు జారీ చేసిన కేంద్రప్రభుత్వం

న్యూఢిల్లీ,జూన్13(సాక్ష్యం): ప్రస్తుతం వైస్ చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్‌గాబాధ్యతలు నిర్వహిస్తున్న లెఫ్టినెంట్ జనరల్ ధీరజ్ సేథ్ ను తదుపరి చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్‌గా నియమిస్తూ భారత ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రస్తుత ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది ఈ ఏడాది జూన్ 30న పదవీ విరమణ

మిగతా 2 లో..



## 15న తెరుచుకోనున్న పాఠశాలలు

### స్కూలు బస్సుల ఫిట్‌నెస్‌పై సర్వత్రా ఆందోళన
### వాహనాల ఫిట్‌నెస్‌పై రవాణాశాఖ మార్గదర్శకాలు జారీ

హైదరాబాద్,జూన్13(సాక్ష్యం): ఈ నెల 15 నుంచి స్కూళ్లు తెరుచుకోనున్నాయి. కొత్త విద్యాసంవత్సరం మరికొద్ది రోజుల్లో ప్రారంభం కాబోతోంది. జూన్ 12 నుంచే ప్రారంభం కావాల్సిన స్కూళ్లు ఎండల కారణంతో 15 నుంచి తెరచుకోనున్నాయి.

మిగతా 2 లో..



పాకిస్తాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ప్రకారం, 24 గంటల్లో ఫైనల్ డీల్ ఫైనలైజ్ అయ్యే అవకాశం ఉంది. ట్రంప్, ఇరాన్ పాలకుల ఎలక్ట్రానిక్ సంతకాల తర్వాత వచ్చే వారం టెక్నికల్ టాక్స్ ఉండొచ్చని తెలుస్తోంది. ముందు ఈ సంతకాల ద్వారా.. యుద్ధానికి ముగింపు పలికి.. ఆ తర్వాత చర్చల ద్వారా సమస్యల్ని పరిష్కరిస్తారని తెలుస్తోంది. అయితే దీన్ని మనం పూర్తిగా నమ్మలేం. ఎందుకంటే ట్రంప్ ఎప్పుడు, ఎలా ప్రవర్తిస్తారో, ఏం మాట్లాడతారో క్లారిటీ ఉండదు. రోజుకో రకంగా ఆయన మాట మార్చేస్తూ ఉంటారు. అప్పుడే దాడులు అంటారు, అంతలోనే యుద్ధం ముగిసింది అంటారు.. అందువల్ల ప్రజలు నమ్మలేకపోతున్నారు.

# ఈసారైనా ముగింపు పలికేనా?

- పశ్చిమాసియాలో శాంతి దిశగా కీలక అడుగులు
- 24 గంటల్లోనే అమెరికా- ఇరాన్ శాంతి ఒప్పందం
- డీల్‌పై ఎలక్ట్రానిక్ విధానంలో ఇరువురి సంతకాలు
- పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ కీలక ప్రకటన
- నేడు శాంతి ఒప్పందంపై సంతకాలు
- ఇక అందరికీ అందుబాటులో హర్ముజ్
- ఇరాన్‌తో కలిసి పనిచేయడానికి సిద్ధం
- అణ్వాయుధాలపై కఠిన నిబంధనలు
- డొనాల్డ్ ట్రంప్ నుండి కీలక సంకేతాలు
- విఫలమైతే సైనిక చర్యలని హెచ్చరిక

న్యూఢిల్లీ ,జూన్13(సాక్ష్యం): దాదాపు 3 నెలలకుపైగా పశ్చిమాసియాలో తీవ్ర ఉద్రిక్తతలు నెలకొనగా ఎట్టకేలకు దీనికి ఎండ్ కార్డ్ పడేలా కనిపిస్తోంది. అమెరికా– ఇరాన్ మధ్య శాంతి ఒప్పందం మరో 24 గంటల్లో ఖరారయ్యే అవకాశం ఉందని పాకిస్థాన్ ప్రధాన మంత్రి షెహబాజ్ షరీఫ్ తాజాగా ప్రకటన చేయడం చర్చనీయాంశంగా మారింది. అమెరికా ఇరాన్ మధ్య చర్చలు దాదాపు తుది దశకు చేరుకున్నాయని, ఒప్పందం ఖరారైన వెంటనే డీల్‌పై ఎలక్ట్రానిక్ విధానంలో సంతకాలు జరిగేలా పాకిస్థాన్ ఏర్పాట్లు చేస్తున్నట్లు షరీఫ్ తెలిపారు. దీనికి సంబంధించి ఆయన సోషల్ మీడియా ప్లాట్‌ఫాం ఎక్స్‌లో శనివారం ఓ పోస్ట్ చేశారు. “శాంతి ఒప్పందానికి మేం ఎప్పుడూ ఇంత దగ్గరగా రాలేదు. మరో 24 గంటల్లోనే ఒప్పందం ఖరారయ్యే అవకాశం ఉంది. తర్వాత ఎలక్ట్రానిక్ సంతకాలు, వచ్చే వారమే

మిగతా 2 లో..



## ఎప్పటికీ అణ్వాయుధాలు తయారు చేయం


- అణ్వాయుధాలపై అమెరికాకు ఇరాన్ హామీ!!
- అమెరికా దాడిలోనే భారతీయులు మృతి
- నిబంధనలు పాటిస్తేనే ఒప్పందంపై సంతకం
- ట్రంప్ ఆరోపణలను ఖండించిన ఇరాన్

న్యూఢిల్లీ ,జూన్13(సాక్ష్యం): అమెరికా–ఇరాన్ మధ్య చర్చల్లో కీలక పురోగతి సాధించినట్లు ట్రంప్ ప్రభుత్వానికి చెందిన ఓ సీనియర్ అధికారి వెల్లడించారు. ప్రతిపాదిత ఒప్పందం ప్రకారం అణ్వాయుధాలను ఎప్పటికీ అభివృద్ధి, కొనుగోలు చేయకూడదని ఇరాన్ అంగీకరించిందని తెలిపారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అత్యంత ప్రాధాన్యంగా భావించిన అంశాల్లో ఇదొకటని పేర్కొన్నారు. ఈ హామీ కేవలం మాటలకే పరిమితం కాకుండా,

మిగతా 2 లో..

## రక్షణ సన్నద్ధత మరింత బలోపేతం

- డీఆర్‌డీఓ క్షిపణి పరీక్షలు విజయవంతం
- వరుసగా మూడు క్షిపణుల ప్రయోగాలు
- 'నావల్ యాంటీ-షిప్ మిస్సైల్' పరీక్ష




హైదరాబాద్,జూన్13(సాక్ష్యం): దేశ వ్యూహాత్మక రక్షణ సన్నద్ధతను మరింత బలోపేతం చేస్తూ భారత రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ శనివారం ఒకేసారి పలు అధునాతన సాంకేతిక పరిజ్ఞానాలను విజయవంతంగా పరీక్షించింది. ఆకాశమార్గం, సముద్ర మార్గాల ద్వారా దేశానికి పొంచి ఉన్న అనేక రకాల క్షిపణి ముప్పులను తిప్పికొట్టే సామర్థ్యాన్ని ఈ పరీక్షల ద్వారా భారత్ నిరూపించుకుంది. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఈ చారిత్రాత్మక ప్రదర్శనకు సంబంధించిన ఫోటోలను సామాజిక మాధ్యమం 'ఎక్స్'వేదికగా పంచుకుంటూ, డీఆర్‌డీఓ వరుసగా మూడు క్షిపణి పరీక్షలను విజయవంతంగా నిర్వహించిందని అధికారికంగా ప్రకటించారు. రక్షణ మంత్రి తెలిపిన వివరాల ప్రకారం.. ఈ ప్రయోగాల

మిగతా 2 లో..

## తెలంగాణ ఆర్థిక వ్యవస్థకు గుండెకాయ సింగరేణి

- కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడి
- డిపెండెంట్ కార్మికులకు నియామక పత్రాలు




మంచిర్యాల,జూన్13(సాక్ష్యం): మంచిర్యాల జిల్లా కేంద్రంలో సింగరేణి డిపెండెంట్ కార్మికుల నియామక పత్రాల పంపిణీ కార్యక్రమం కోలాహలంగా జరిగింది. సింగరేణి సంస్థలో కారుణ్య నియామకాల కింద ఎంపికైన 335 మంది డిపెండెంట్ కార్మికులకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ముఖ్య అతిథులుగా హాజరై నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. సింగరేణి సంస్థ తెలంగాణ ఆర్థిక వ్యవస్థకు గుండెకాయ లాంటిదని, కార్మికుల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. కారుణ్య నియామకాల ప్రక్రియను వేగవంతం చేసి, బాధిత కుటుంబాల్లో వెలుగులు నింపడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని చెప్పారు. ఉద్యోగాలు సాధించిన యువత

మిగతా 5 లో..

## తృణమూల్ పార్టీలో కొనసాగుతున్న సంక్షోభం

- సీనియర్ ఎంపీ సుదీప్ బందోపాధ్యాయ్ షాక్
- టీఎంసీ తిరుగుబాటు ఎంపీల గ్రూపులో చేరిక
- యూటర్న్ తీసుకున్న మరో ఎంపి కళ్యాణ్ బెనర్జీ
- అభిషేక్ బెనర్జీ తన కొడుకు లాంటి వాడంటూ కితాబు




న్యూఢిల్లీ ,జూన్13(సాక్ష్యం): తృణమూల్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీలో తలెత్తిన సంక్షోభం కొనసాగుతోంది. మరోవైపు అంతర్గత వ్యవహారాలు క్షణక్షణానికి మారుతూ ఉత్కంఠ రేపుతున్నాయి. పార్టీ అధ్యక్షురాలు మమతా బెనర్జీకి తాజాగా ఆ పార్టీ సీనియర్ ఎంపీ సుదీప్ బందోపాధ్యాయ్ షాక్ ఇచ్చారు. టీఎంసీ తిరుగుబాటు ఎంపీల గ్రూపులో శనివారంనాడు చేరారు.

మిగతా 5 లో..

## హైదరాబాద్‌లో భారీ వర్షం

- పలు ప్రాంతాల్లో రహదారులు జలమయం
- భారీ వర్షాలకు జంటనగరాల్లో ముగ్గురు మృతి
- విద్యుత్ షాక్‌కు గురై తండ్రి, కూతురు మృతి
- ఇంటిపై చెట్టు కూలడంతో మహిళ మరణం
- పలు జిల్లాల్లో తడిసి ముద్దయిన ధాన్యం
- నేడు హైదరాబాద్‌కి నైరుతీ రుతుపవనాలు
- నేడు, రేపు భారీ వర్షాలు పడే అవకాశం
- అధికారులను అప్రమత్తం చేసిన సీఎం రేవంత్
- అధికారులు సమన్వయంతో వెళ్లాలని ఆదేశం





హైదరాబాద్,జూన్13(సాక్ష్యం): హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, అమీర్‌పేట, యూసుఫ్‌గూడ, సనత్ నగర్, ఫిలింనగర్, పంజాగుట్ట, ఎర్రగడ్డ, బోరబండ, మహేశ్వరం, తుక్కుగూడ, పహాడీషరీఫ్, కూకట్‌పల్లి, కేపీహెచ్‌బీ, బాచుపల్లి, హైదర్ నగర్, ప్రగతినగర్, మూసాపేట్ ప్రాంతాల్లో వర్షం పడుతోంది. శంషాబాద్‌లో కురిసిన భారీ వర్షానికి ప్రధాన రహదారి జలమయమై చెరువును తలపిస్తోంది. రోడ్డంతా నీటితో నిండిపోవడంతో రాకపోకలకు వాహనదారులు

మిగతా 5 లో..

## కోవర్ట్‌ల సంగతి తేలుస్తాం..

- సిఎం స్వయంగా పర్యవేక్షిస్తున్నారు
- బీజేపీ కుట్రలకు మీనాక్షి బలి
- ఎలాంటి కేసు లేకున్నా నామినేషన్ తిరస్కరణ
- టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ విమర్శ

హైదరాబాద్,జూన్13(సాక్ష్యం): మధ్యప్రదేశ్ రాజ్యసభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్ తిరస్కరణ తెలంగాణ కాంగ్రెస్‌లో తీవ్ర చర్చకు దారితీసింది. మీనాక్షిపై ఒక



కేసు ఉన్నట్టు తెలంగాణ కాంగ్రెస్ నేతే లీక్ ఇచ్చాడని బీజేపీ నేత ఒకరు వెల్లడించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో, ఈ వ్యవహారంపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ అంశాన్ని కాంగ్రెస్ అధిష్ఠానం, రాష్ట్ర నాయకత్వం

మిగతా 2 లో..

# సంపాదకీయం

## ఎల్‌నినో కార్యాచరణ ఏదీ?

ఎల్‌నినో హెచ్చరికల నేపథ్యంలో పాలకులు అప్రమత్తం కావాల్సి ఉంది. ముఖ్యంగా సాగు, తాగునీరుతో పాటు, వ్యవసాయ విధానంపై ప్రణాళికలు ఇప్పటికే సిద్ధం కావాల్సి ఉండగా అంలాంటిదేమీ కనిపించడం లేదు. ఇప్పుడు దీని ప్రభావంతో భారతదేశానికి కరువు కాలం కమ్ముకొస్తుంది. దీనిపై ప్రజలను రైతులను అప్రమత్తం చేయడంతో పాటు, కార్యాచరణకు సిద్ధం కావాల్సి ఉంది. నైరుతి రుతు పవనాల రాకతో వర్షాలు పడతాయి.. వ్యవసాయం బాగుంటుందని ఆశిస్తున్న రైతులకు ఇది అశనిపాతం లాంటిదే. ఎల్ నినో వచ్చేసిందని.. ఈ రుతు పవనాల సమయంలో అది మరింత బలపడుతుందని భాతర వాతావరణ శాఖ అధికారికంగా ప్రకటించింది. ఇదే సమయంలో ఎల్ నినో ప్రారంభం అయినట్లు జపాన్ వాతావరణ సంస్థ జూన్ 11వ తేదీన అధికారికంగా ప్రకటించటం విశేషం. పసిఫిక్ సముద్రం ఉపరితల ఉష్ణోగ్రతలు పెరగటాన్ని ఎల్ నినో అంటారు. సముద్ర ఉపరితల జలాల ఉష్ణోగ్రత సహజంగా 3.4 డిగ్రీలుగా ఉ ంటుంది. ఇప్పుడు అది పాయింట్ 5 శాతం పెరిగింది. అంటే సముద్రం నీరు ఉ ండాల్సిన వేడి కంటే అధిక వేడిగా ఉన్నాయి. దీన్ని ఎల్‌నినో అంటారు. జూన్ నుంచి ఆగస్ట్ మధ్య కాలంలో ఎల్‌నినో మరింత బలపడుతుందని వాతావరణ శాఖ వెల్లడించింది. జూలై మధ్య నుంచి తూర్పు పసిఫిక్ అంతటా విస్తరిస్తుందని.. ఇదంతా రుతు పవనాల కాలంలోనే జరుగుతుందని వాతావరణ శాఖ నివేదిక స్పష్టం చేస్తుంది. సహజంగా నైరుతి రుతు పవనాల సీజన్ లో చల్లటి వాతావరణంతోపాటు నికరంగా వర్షాలు పడతాయి. ఎల్‌నినో ప్రభావంతో సముద్రం నీరు వేడెక్కటం వల్ల సముద్రం నుంచి భూమిపైకి వేడి గాలులు వీస్తాయి. భూమిపై ఎక్కువగా పొడి వాతావరణం ఉంటుంది. ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. వర్షపాతం తక్కువగా ఉంటుంది. దీంతో కరువు వస్తుంది. దీనికితోడు అక్కడక్కడ కుండపోత వర్షాలు ఉంటాయి. క్లౌడ్ బరస్టులు ఉంటాయి. దీని వల్ల విపత్తులు వచ్చే ప్రమాదం ఉంది. వర్షాలు తక్కువగా ఉండటం వల్ల నీళ్ల కొరత ఏర్పడుతుంది. మంచి నీళ్లకు.. సాగునీటికి ఇబ్బందులు తలెత్తుతాయి. వ్యవసాయానికి అవసరం అయిన నీళ్లు లేక పంటలు పండవు. ఆదాయం లేక రైతులు, రైతు కూలీలకు ఇబ్బంది వస్తుంది. ఎల్‌నినో అధికారంగా ప్రారంభం అయిన భారత వాతావరణ శాఖ ప్రకటనతో ప్రభుత్వాలు, ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. రైతులు పంటలు సాగు చేసే విషయంలో అప్రమత్తంగా ఉండాలి. అన్నింటికి మించి పంటలకు సంబంధించి ఆరుతడి పంటలకు రైతులను ప్రోత్సాహించాలి. సాగునీటి లభ్యత తక్కువగా ఉంటుంది కాబట్టి, వరి లాంటి పంటలకు రైతులు దూరంగా ఉండాలి. మనకున్న వనరులను దృష్టిలో పెట్టుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పటికైనా కార్యాచరణ సిద్ధం చేయాలి. ఎల్‌నినోకు కారణం ఓ రకంగా చెప్పాలంటే పర్యావరణ విధ్వంసమే. మన చేజేతులా పర్యావరణ విధ్వంసానికి పాల్పడిన పాపానికి విపరీత వాతావరణ పరిస్థితులు ఎదుర్కోబోతున్నాం. వాతావరణ మార్పు, పర్యావరణ వ్యవస్థ నష్టం, భూమి ఎడారీకరణ వంటి తీవ్రమైన పరిణామాలతో మానవ-ప్రేరిత పర్యావరణ నష్టం పెరుగుతుంది. పర్యావరణాన్ని పరిరక్షించడం, భూమి మరియు ప్రకృతిని వాటి సహజ స్థితికి పునరుద్ధరించడం ఇప్పుడు అంరి తక్షణ కర్తవ్యం కావాలి. భూమిని రక్షించడానికి, పునరుద్ధరించడానికి యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలి. పర్యావరణ విధ్వంసం నిరంతరంగా సాగడంవ వల్ల మన భూమి భవిష్యత్తు ప్రమాదంలో పడింది. ఎడారీకరణ, భూమి క్షీణత, కరువు అనేది మన కాలంలోని అత్యంత ముఖ్యమైన పర్యావరణ సవాళ్లలో ఒకటి. ఇటీవలే జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవం జరుపుకున్నాం. అయినా మనలో మార్పు కానరావడం లేదు. చెరువులను మింగేస్తున్నాం. ప్లాస్టిక్ భూతాన్ని భూమిపైకి వదిలేస్తున్నాం. మన పర్యావరణాన్ని రక్షించడానికి ప్రపంచవ్యాప్త అవగాహన, కార్యాచరణను ప్రోత్సహించడానికి మాటలతో సరిపెడుతున్నాం. ప్రపంచ పర్యావరణ దినోత్సవం పర్యావరణంపై దృష్టి సారించి, ఏటా చర్యలు తీసుకుని ఉ ంటే ఇలాంటి ఎల్‌నినో ప్రభఆవాలు వచ్చే వచ్చేవి కావు. ఇప్పటికైనా మనమంతా భూమి పునరుద్ధరణ, ఎడారీకరణ, కరువును తట్టుకునే శక్తి, పద్ధతులపై దృష్టి సారించాలి. మన భవిష్యత్తు, మన తరం, భూమి పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వాలు ఆ వైపు కార్యాచరణను రూపొందించి కచ్చితంగా అమలు చేయాలి. పర్యావరణ శాస్త్రవేత్తలు, ప్రేమికులు, సైన్సు సంస్థలు ఎల్‌నినో దుష్ఫలితాలపై విస్తృతంగా ప్రచారంనిర్వహించాలి. ప్రజలకు అవగాహన కల్పించాలి. ముఖ్యంగా యువతను ఈ కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేయాలి. ద ఈ నిని ప్రజా ఉద్యమంగా దిశా నిర్దేశం చేయాలి. అన్ని పర్యావరణ పరిరక్షణ సంస్థలు, వ్యక్తులు ఒక ఉద్యమంలా ఐక్యంగా పనిచేయడం ద్వారా ధరిత్రిని కాపాడుకోవాలి. ఈ క్రమంలో తక్షణంగా ప్రస్తుత విపత్తును తట్టుకునే కార్యాచరణకు రంగం సిద్దం చేయాలి. కేంద్రం తక్షణమే రాష్ట్రాలతో సంప్రతింపులు జరిపి వ్యవసాయ స ంక్షోభ నివారణకు చర్యలు తీసుకోవాలి. తాగునీటి సమస్యపైనా చర్చించాలి.

## రక్షణ సన్నద్ధత మరింత బలోపేతం

మొదటిపేజీ తరువాయి..

సమయంలో మల్టీ-లేయర్డ్ బాలిస్టిక్ మిస్సైల్ డిఫెన్స్ వ్యవస్థ సుదూర ప్రాంతాల నుండి దూసుకొచ్చే శత్రువుల లాంగ్-రేంజ్ బాలిస్టిక్ క్షిపణి లక్ష్యాలను గాల్లోనే విజయవంతంగా అడ్డుకుని, వాటిని ముక్కలు ముక్కలు చేసింది. "సుదూర శ్రేణి బాలిస్టిక్ క్షిపణులకు వ్యతిరేకంగా మల్టీ-లేయర్డ్ డిఫెన్స్‌ను మరియు మధ్యస్థ శ్రేణి యాంటీ-షిప్ (నౌక విధ్వంసక) సామర్థ్యాన్ని ప్రదర్శించడానికి వరుసగా మూడు క్షిపణి పరీక్షలు విజయవంతంగా నిర్వహించబడ్డాయి. ఇందులో ఇంటర్‌సెప్టర్ క్షిపణులు తమ నిర్దేశిత లక్ష్యాలను ఖచ్చితత్వంతో ధ్వంసం చేశాయి. భవిష్యత్తులో దేశానికి ఎదురయ్యే క్షిపణి ముప్పులను ఎదుర్కొనేందుకు సరికొత్త అధునాతన సాంకేతికతలతో ఈ



వ్యవస్థలను రూపొందించడం జరిగింది."ఈ విజయవంతమైన ట్రయల్స్ ద్వారా.. ఖండాంతర బాలిస్టిక్ క్షిపణుల వంటి అత్యంత ప్రమాదకరమైన లాంగ్-రేంజ్ క్షిపణి ముప్పులను కూడా గాల్లోనే సమర్థవంతంగా అడ్డుకోగల అధునాతన సాంకేతికత కలిగిన ప్రపంచంలోని కొన్ని ఎంపిక చేసిన అగ్రదేశాల సరసన భారతదేశం నిలిచిందని రక్షణ మంత్రి స్పష్టం చేశారు. దేశంలోని వ్యూహాత్మక ఆస్తులను, ప్రధాన నగరాలను (జనాభా కేంద్రాలను) శత్రువుల భారీ క్షిపణి దాడుల నుండి రక్షించడానికి ఇటువంటి రక్షణ వ్యవస్థలు అత్యంత కీలకమైనవని ఆయన తెలిపారు. బాలిస్టిక్ మిస్సైల్ డిఫెన్స్ పరీక్షలతో పాటు, డీఆర్‌డీఓ శనివారం సరికొత్త నావల్ యాంటీ-షిప్ మిస్సైల్-మీడియం రేంజ్ ను కూడా తొలిసారిగా విజయవంతంగా పరీక్షించింది. సముద్రంలో మధ్యస్థ శ్రేణి దూరంలో ఉండే శత్రువుల నౌకలు లేదా యుద్ధనౌకలను లక్ష్యంగా చేసుకుని, వాటిని పూర్తిగా నాశనం చేయడంలో భారతదేశానికి ఉన్న అసాధారణ సామర్థ్యాన్ని ఈ మేడెన్ ఫ్లైట్ టెస్ట్ (తొలి ప్రయోగం) నిరూపించింది. ఈ అద్భుత విజయాలు సాధించిన డీఆర్‌డీఓ శాస్త్రవేత్తలను, భారత సాయుధ బలగాలను రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ప్రత్యేకంగా అభినందించారు.

# ఈసారైనా ముగింపు పలికేనా?



మొదటిపేజీ తరువాయి..

సాంకేతిక స్థాయి చర్చలు జరుగుతాయి" అని పాకిస్థాన్ పీఎం పేర్కొన్నారు. ఈ క్రమంలోనే చర్చల సమయంలో ఎంతో సహకరించిన అమెరికా- ఇరాన్ ప్రభుత్వాలకు షరీఫ్ కృతజ్ఞతలు తెలిపారు. మద్దతు ఇచ్చిన పశ్చిమాసియాలోని ఇతర దేశాలకు కూడా ధన్యవాదాలు చెప్పారు. దీర్ఘకాలిక శాంతి దిశగా ఈ చారిత్రక ఒప్పందం బలమైన పునాది వేస్తుందని విశ్వసిస్తున్నట్లు వెల్లడించారు. షరీఫ్ ప్రకటనకు ఒకరోజు ముందుగా ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీకూడా ఈ ఒప్పందం గురించి కీలక వ్యాఖ్యలు చేశారు. 'ఇస్లామాబాద్ అవగాహనా ఒప్పందం ఇంతకుముందెన్నడూ లేనంత దగ్గరలో ఉంది. తుది ఒప్పందం పూర్తయ్యే వరకు మీడియా ఊహాగానాలన్నింటికీ దూరంగా ఉండాలి' అని చెప్పారు. అరాగ్చీ పోస్ట్‌ను యూఎస్ ప్రెసిడెంట్ డొనాల్డ్ ట్రంప్ కూడా తన సోషల్ మీడియా ఖాతాలో పోస్ట్ చేయడం విశేషం.అయితే ఇక్కడ ఒప్పందం తుది దశకు చేరుకుంటుందన్న తరుణంలోనే ఇరాన్‌పై ట్రంప్ మరోసారి విమర్శలు గుప్పించారు. ఇరాన్ మీడియా కథనాల్ని తీవ్రంగా తప్పుబట్టారు.

ఇరాన్ మీడియా ప్రకటనలకు, చర్చల్లో అంగీకరించిన అంశాలకు సంబంధం లేదని వ్యాఖ్యానించారు. ఒప్పందం విషయంలో ఇరాన్ ఏ మాత్రం నిజాయతీగా వ్యవహరించడం లేదన్నారు. వారితో వ్యవహరించడం చాలా కష్టం అని, వెంటనే తమ వైఖరి మార్చుకోవాల్సిన అవసరం ఉందని ట్రంప్ హెచ్చరించారు. ఒప్పందంలోని విషయాల్ని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ వెల్లడించారు. ఇరాన్ ఓడరేవులపై అమెరికా విధించిన దిగ్బంధనాన్ని ఎత్తి వేయడం సహా హర్మూజ్ జలసంధి నిర్వహణలో పలు కీలక మార్పులు వంటివి ప్రతిపాదిత ఒప్పందంలో ఉ న్నట్లు తెలిపారు. ఇదే సమయంలో ఇరాన్ వద్ద ఉన్నటువంటి యురేనియం అంశాన్ని కూడా చర్చల్లో పరిష్కరించే ప్రయత్నాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ప్రాథమిక అవగాహనా ఒప్పందంలో కొన్ని నిబంధనలపై వారాలుగా నిలిచిపోయిన చర్చల అనంతరం ఇటీవల ఇరాన్, అమెరికా తాము ఒప్పందానికి చేరువవుతున్నట్లు సంకేతాలు ఇచ్చాయి. కానీ అన్ని అంశాలపై పూర్తి స్థాయిలో ఇరు వర్గాల అంగీకారం కుదిరే వరకు ఒప్పందం ఖరారైందని చెప్పలేమని ఇరాన్ స్పష్టం చేసింది. ఇటు ఒప్పందానికి చేరువైనట్లు ప్రకటనలు వస్తుండగా మరోవైపు హర్మూజ్ జలసంధిలో శనివారం వాణిజ్య నౌకల్ని లక్ష్యంగా చేసుకున్న పలు ఇరాన్ డ్రోన్లను అమెరికా కూల్చివేసినట్లుగా ప్రకటించడం ఆందోళనలు రేకెత్తిస్తోంది.

కాగా .. పాకిస్థాన్ ప్రధాన మంత్రి షెహబాజ్ షరీఫ్ ప్రకటించిన కొన్ని గంటల్లోనే దీనిపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఆదివారం ఈ శాంతి ఒప్పందంపై సంతకాలు జరగనున్నట్లు ట్రంప్ పేర్కొన్నారు. ఈ సంతకాలు పూర్తయ్యార హర్మూజ్ అందరికీ అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. దీంతో మూడు నెలలుగా పశ్చిమాసియాలో కొనసాగుతన్న ఉద్రిక్తతలు తగ్గుముఖం పట్టే అవకాశాలు ఉన్నాయి. తన సోషల్ మీడియా వేదికలో చేసిన పోస్టులో ట్రంప్, భవిష్యత్తులో ఇరాన్‌తో పాటు మొత్తం మధ్యప్రాచ్య ప్రాంతంతో సానుకూల సంబంధాలు కొనసాగించేందుకు అమెరికా ఆసక్తిగా ఎదురుచూస్తోందని తెలిపారు. "ఇరాన్‌తో, అలాగే యావత్ మధ్యప్రాచ్యంతో కలిసి పనిచేయడానికి మేము సిద్ధంగా ఉన్నాం. ఈ ప్రక్రియ వేగంగా, సజావుగా పూర్తవుతుందని ఆశిస్తున్నాం" అని ట్రంప్ పేర్కొన్నారు.ప్రతిపాదిత ఒప్పందం ద్వారా ఇరాన్ అణ్వాయుధాలను అభివృద్ధి చేయడం లేదా ఇతర మార్గాల్లో సొంతం చేసుకోవడం పూర్తిగా నిరోధించబడుతుందని ట్రంప్ స్పష్టం చేశారు. ఈ ఒప్పందం "అణ్వాయుధ రహిత భద్రతా గోడ"గా పనిచేస్తుందని ఆయన వ్యాఖ్యానించారు. "ఇకపై ఇరాన్‌కు అణ్వాయుధాలు అవసరం ఉండదు. వాటిని కొనుగోలు చేయడం, అభివృద్ధి చేయడం లేదా మరే ఇతర మార్గంలో పొందడం కూడా సాధ్యం కాదు" అని ట్రంప్ అన్నారు. ఇరాన్ అణు కార్యక్రమానికి సంబంధించిన భూగర్భ సదుపాయాలను కూడా ఈ ఒప్పందం పరిధిలోకి తీసుకువస్తామని ట్రంప్ తెలిపారు. శాంతి చర్చలు విఫలమైతే అమెరికా వద్ద "చివరి ప్రత్యామ్నాయం" కూడా సిద్ధంగా ఉందని హెచ్చరించారు. అయితే ఆ ప్రత్యామ్నాయం ఏమిటన్న విషయాన్ని ఆయన వెల్లడించలేదు.

## కోవర్టల సంగతి తేలుస్తాం..

మొదటిపేజీ తరువాయి..

అత్యంత సీరియస్‌గా తీసుకున్నట్లు వెల్లడించారు. నామినేషన్ తిరస్కరణకు దారితీసిన పరిస్థితులు ఏమిటి, ఎక్కడ పొరపాటు జరిగింది, దీనికి బాధ్యులు ఎవరు అనే విషయాలపై ఇప్పటికే అంతర్గత విచారణ ప్రారంభమైనట్లు తెలిపారు. ఈ వ్యవహారాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా పర్యవేక్షిస్తున్నారని, ఎక్కడ లోపం జరిగిందో, ఎవరి పాత్ర ఉందో సమగ్రంగా సమీక్షిస్తున్నారని చెప్పారు. కాంగ్రెస్‌లో ఉండి ప్రత్యర్థి పార్టీలకు లాభం చేకూర్చే కోవర్టలను త్వరలోనే గుర్తిస్తామని మహేశ్ గౌడ్ హెచ్చరించారు. "లీక్ వీరులు ఎవరో, గ్రీక్ వీరులు ఎవరో త్వరలో అందరికీ తెలుస్తుంది" అని అన్నారు. నామినేషన్ వ్యవహారంలో బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని పార్టీ నాయకత్వం సంకేతాలు ఇచ్చింది. అంతర్గత విచారణ వేగం పుంజుకోవడంతో లీకుల వెనుక ఉన్న అసలు వ్యక్తులు త్వరలోనే బయటపడే అవకాశముందని కాంగ్రెస్ వర్గాలు భావిస్తున్నాయి. మీనాక్షి నటరాజన్ విషయంలో బీజేపీ తీరు చూస్తుంటే ప్రజాస్వామ్య దేశంలో ఉన్నామా? లేక నియంత దేశంలో ఉన్నామా? అనే అనుమానం కలుగుతోందని టీపీసీసీ చీఫ్, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్ వ్యాఖ్యానించారు. శనివారం మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో ఆయన మాట్లాడుతూ.. మీనాక్షి నటరాజన్‌పై కేసు ఏమీ లేదని.. నోటీసు మాత్రమే ఉందని స్పష్టం చేశారు.



రాజ్యసభలో బలం పెంచుకోవాలని బిజెపి కుట్రకు పూనుకున్నదని ఆరోపించారు. గాంధేయవాది, నిజాయతీకి నిలువుటద్దం మీనాక్షి నటరాజన్ అని పీసీసీ చీఫ్ స్పష్టం చేశారు. ప్రధానమంత్రి ఆఫీసు కల్పించుకుని కేసును తప్పుదోవ పట్టించిందని ఆరోపించారు. ఈ విషయంలో ఉరి వేసినా తప్పులేదన్నారు. ప్రధాని నియంతలా వ్యవహరించడం శోచనీయమన్నారు. సుప్రీంకోర్టులో కూడా న్యాయం జరగలేదన్నారు. బీజేపీ ఫాసిస్టు విధానాలు స్పష్టంగా కనిపిస్తున్నాయని వ్యాఖ్యానించారు. మీనాక్షి తనకు సోదరి లాంటివారన్నారు. 24 గంటల్లో ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా స్పందించకపోవడం విచారకరమని తెలిపారు.మీనాక్షిని బలి చేశారని.. ఆమె విషయంలో కొంతమంది బీజేపీ నేతలు సానుభూతి తెలిపినట్లు తెలిసిందని మహేశ్ అన్నారు. బీజేపీ నేతలు దిగజారి ప్రవర్తిస్తున్నారని విమర్శలు గుప్పించారు. లీకు వీరులు.. గ్రీకు వీరులు ఉంటే సీఎం సమగ్రంగా విచారిస్తున్నారని తెలిపారు. ప్రజాస్వామ్య విలువలను తుంగలో తొక్కి తమపై బురద జల్లుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయాల్లో విభేదాలు సహజమని... అంత మాత్రాన కుట్రకు పాల్పడరన్నారు. ఓటు చోరీ చేసి.. ఇప్పుడు సీటు చోరీ చేశారంటూ వ్యాఖ్యానించారు. ప్రధాని ఇంతలా దిగజారి ప్రవర్తించడం బాధాకరమని మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.

## ఎప్పటికీ అణ్వాయుధాలు తయారు చేయం

మొదటిపేజీ తరువాయి..

కఠిన తనిఖీలు, నిరంతర పర్యవేక్షణ, ధ్రువీకరణ వ్యవస్థలతో అమలవుతుందని ఆయన స్పష్టం చేశారు. ఇరాన్ తన బాధ్యతలను నిజంగా నిర్వర్తిస్తోందని నిర్ధరణ అయిన తర్వాత మాత్రమే ఒప్పందం కింద ప్రయోజనాలు అందుతాయని వివరించారు. ప్రతిపాదిత ఒప్పందంలో భాగంగా బాగా శుద్ధి చేసిన అణు పదార్థాలను పూర్తిగా తొలగించేందుకు ఇరాన్ అంగీకరించినట్లు అమెరికా అధికారి తెలిపారు. అలాగే అణ్వాయుధాల తయారీకి దోహదపడే అణు కేంద్రాలను నిర్వీర్యం చేసే అంశంపై కూడా చర్చలు కొనసాగుతున్నాయని వెల్లడించారు. అయితే ఈ ప్రక్రియకు సంబంధించిన సాంకేతిక అంశాలపై ఇంకా తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉందని చెప్పారు. అయినప్పటికీ, ఇరాన్ భవిష్యత్తులో అణ్వాయుధాలను అభివృద్ధి చేయకుండా నిరోధించే దిశగా ఇది అత్యంత కీలకమైన



తొలి అడుగుగా అభివర్ణించారు. ఒప్పందాన్ని అత్యంత జాగ్రత్తగా రూపొందించామని అమెరికా అధికారి తెలిపారు. ఇరాన్ తన వాగ్దానాలను నెరవేర్చకుండానే ఎలాంటి ప్రయోజనాలు పొందకుండా వ్యవస్థను రూపొందించామని పేర్కొన్నారు. అమెరికా ప్రయోజనాలు, భద్రతా లక్ష్యాలు నెరవేరిన తర్వాత మాత్రమే ఇరాన్‌కు ఆర్థిక రాయితీలు, ఆంక్షల సడలింపులు అమలులోకి వస్తాయని స్పష్టం చేశారు. ఇరాన్ తన బాధ్యతలను అమలు చేసిన మేరకే ప్రయోజనాలు పొందేలా ఒప్పందం నిర్మాణం ఉందన్నారు.

మరోవైపు హర్మూజ్ జలసంధిలో భారతీయ వాణిజ్య నౌకపై దాడి విషయమై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలను ఇండియాలోని ఇరాన్ రాయబార కార్యాలయం తీవ్రంగా ఖండించింది. ట్రంప్ చేసిన ఆరోపణలు నిరాధారమైనవి మాత్రమే కాదని, అమెరికా దళాలు చేసిన తప్పులను కప్పిపుచ్చుకోవడానికి ఆడుతున్న నాకటంగా అభివర్ణించింది. భారతీయ నావికులు ప్రయాణిస్తున్న వాణిజ్య నౌకపై అమెరికా సైన్యమే దాడులు చేసిందని ఎంబసీ పేర్కొంది. ఈ దాడుల నుంచి ప్రపంచ దేశాల దృష్టిని మళ్లించడానికే వాషింగ్టన్ ఇరాన్‌పై బురదజల్లే ప్రయత్నం చేస్తోందని ఇరాన్ రాయబార కార్యాలయం పేర్కొంది. భారత్‌లోని ఇరాన్ ఇస్లామిక్ రిపబ్లిక్ రాయబార కార్యాలయం శనివారం అధికారికంగా ఒక సుదీర్ఘ ప్రకటనను విడుదల చేసింది. గడిచిన వారం రోజులుగా అమెరికా దళాలు అంతర్జాతీయ సముద్ర చట్టాలను తుంగలో తొక్కి, మూడు భారతీయ నౌకలను లక్ష్యంగా చేసుకుని దాడులు నిర్వహించాయని ఇరాన్ వెల్లడించింది. ఈ దాడుల్లో ముగ్గురు భారతీయ నావికులు మరణించారని, ఇందుకు అమెరికా పూర్తి బాధ్యత వహించాలని డిమాండ్ చేసింది. అమెరికా చర్యలు అత్యంత క్రూరమైనవిగా ఇరాన్ అభివర్ణించింది. అలాగే, అమెరికా- ఇరాన్ దేశాల మధ్య కుదరబోయే ప్రాథమిక అవగాహన ఒప్పందంపై ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ స్పందించారు. ఈ ఒప్పందంలో అణు కార్యక్రమం, ఇరాన్‌పై ఆంక్షల తొలగింపు, హర్మ్యూజ్ జలసంధి హోదాతో సహా పలు కీలక అంశాలు ఉంటాయని చెప్పారు. ఈ ఒప్పందం రెండు దశల్లో ఉంటుందని, మొదటి దశలో అణు అంశాలపై ఎటువంటి చర్చలు జరగలేదని, వాటిని రెండో దశకు వాయిదా వేసినట్లు పేర్కొన్నారు. ఈ అవగాహన ఒప్పందంలోని నిబంధనలను నెరవేర్చకపోతే, తుది ఒప్పందంపై సంతకాలు చేయబోమని ఆయన స్పష్టం చేశారు. ఈ ఒప్పందంలో మొదటగా ప్రస్తావించిన అంశం ఏమిటంటే అమెరికా విధిస్తున్న నౌకాదళ దిగ్బంధనాన్ని ఎత్తివేయడం అని అరాగ్చీ స్పష్టం చేశారు. అలాగే, హర్మ్యూజ్ గుండా వెళ్లే నౌకల నుంచి టోల్ వసూలుపై కూడా అరాగ్చీ స్పందించారు. అంతర్జాతీయ చట్టాల ప్రకారం, హర్మ్యూజ్ జలసంధి గుండా వెళ్లే నౌకల నుంచి టోల్ వసూలు చేయడం సాధ్యం కాదని, కానీ సేవా రుసుములను వసూలు చేయడం జరుగుతుందన్నారు. అలాగే ఇరాన్‌కు నష్టపరిహారం చెల్లించే ప్రణాళిక కూడా ఒప్పందంలో ఉందన్నారు. హర్మ్యూజ్ జలసంధి భవిష్యత్తు గతంలోలా ఉండబోదన్నారు. దీని నిర్వహణపై ఇరాన్, ఒమన్ దేశాలు త్వరలోనే ఒక ఉమ్మడి ప్రకటనను విడుదల చేస్తాయని ఆయన సూచించారు. అమెరికా దాడులపై ఇరాన్ విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి ఇస్మాయిల్ బఘాయి స్పందించారు. ఈ దాడుల్లో ప్రాణాలు కోల్పోయిన భారతీయ పౌరుల కుటుంబాలకు ఇరాన్ ప్రభుత్వం తరఫున ఆయన తీవ్ర సానుభూతిని, సంతాపాన్ని ప్రకటించారు. అమెరికా చర్యలను ఆయన స్టేట్ పైరసీగా అభివర్ణించారు.

## 15న తెరుచుకోనున్న పాఠశాలలు

మొదటిపేజీ తరువాయి..

ప్రైవేట్ స్కూళ్ల బస్సుల భద్రతపై తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఫిట్‌నెస్ లేకుండా బస్సులు తిప్పితే ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశాలున్నాయని వాపోతున్నారు. దీంతో విద్యాసంస్థల వాహనాలకు ఫిట్‌నెస్ తప్పనిసరి అని రవాణా శాఖ జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ చంద్రశేఖర్ గౌడ్ పేరొన్నారు. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు. ఫిట్‌నెస్ లేని, విద్యార్థులను లెక్కకుమించి ఎక్కించుకుని నడుపుతున్న వాహనాలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వెహికల్స్‌కు పర్మిట్, ఇన్సూరెన్స్, కాలుష్య నియంత్రణ సర్టిఫికెట్ తప్పనిసరి అని తెలిపారు. డ్రైవర్లు లైసెన్స్ లేకుండా, ఓవర్ లోడ్‌తో వాహనాలు నడిపితే వెంటనే సీజ్ చేస్తామని హెచ్చరించారు. రాష్ట్రవ్యాప్తంగా 25,987 విద్యా సంస్థల బస్సులు ఉండగా 22,158 బస్సులు ఫిట్ నెస్ సర్టిఫికెట్ పొందాయని, మిగిలిన 3,829 బస్సులు వెంటనే ఫిట్‌నెస్ సర్టిఫికెట్ పొందాలని చంద్రశేఖర్ గౌడ్ సూచించారు. ప్రైవేట్ స్కూళ్లు, కళాశాల యాజమాన్యాలు ఫీజులపై ఉన్న శ్రద్ధ, బస్సుల ఫిట్‌నెస్‌పై కూడా ఉండాలని పేర్కొంటున్నారు. ఏ చిన్న పొరపాటు జరిగినా ప్రమాదానికి దారి తీసే అవకాశముందని వాపోతున్నారు. స్కూల్ బస్సుకు పాఠశాల పేరు, ఫోన్ నెంబర్, చిరునామా, బస్సు ఎడమ వైపు పూర్తిగా కనిపించేలా ఉ ండాలి. వాహనాలు తప్పనిసరిగా పూర్తి కండీషన్‌లో ఉ ండాలని అధికారులు పేర్కొన్నారు. బస్సు, వ్యాన్‌కు రెండు వైపులా మిర్రర్స్ ఉండాలని, డ్రైవర్ వయస్సు 60ఏళ్లకు మించరాదని పేర్కొంటున్నారు. తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలని, డ్రైవర్లు మూడు నెలలకోసారి షుగర్, బీపీ, గుండె పరీక్షలు చేయించుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. అలాగే, ప్రతీ బస్సుకు ఒక అటెండర్ ఉ ండా లని, బస్సులో అగ్నిప్రమాద నివారణ పరికరాలు అందుబాటులో ఉండాలని పేర్కొన్నారు. ఎమర్జెన్సీ ఫస్ట్ ఎయిడ్ కిట్, అగ్నిమాపక యంత్రం తప్పనిసరిగా వెల్లడిస్తున్నారు. విద్యార్థులను తీసుకొచ్చే వాహనాలు నిలిపేందుకు పార్కింగ్ సదుపాయం ఏర్పాటు చేయాలి. పాఠశాల ఉన్న ప్రాంతంలో రహదారిపై స్కూల్ జోన్ సైన్ బోర్డులు, రహదారి పై ప్రత్యేక రంగులు వేయించాలి. విద్యార్థులున్నారనే సంకేతాన్ని వాహనాల డ్రైవర్లు దూరం నుంచే గుర్తించేలా పిల్లల ఛాయాచిత్రాలతో బోర్డులు ఏర్పాటు చేయాలి. తరగతుల ప్రారంభం, ముగింపు సమయాల్లో రహదారిపై గేటు వద్ద రద్దీ సమస్య లేకుండా చూడాలి. పిల్లలు, వారి తల్లిదండ్రులు రోడ్డు దాటేలా జీబ్రా క్రాసింగ్‌లు ఏర్పాటు చేయాలన్నారు. స్కూల్ బస్సులపై స్పెషల్ డ్రైవ్ నిర్వ హిస్తాం అని తెలిపారు. ఫిట్‌నెస్ లేకుండా తిరిగే స్కూల్ బస్సుల యాజమా న్యాలపై కఠినచర్యలు తీసుకుంటాం. ప్రైవేటు పాఠశాలల బస్సులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలి. భద్రతా ప్రమాణాలు పాటి స్తూ పాఠశాలల బస్సులు నడపాలి. అనుభవం ఉన్న డ్రైవర్లను విధుల్లోకి తీసుకోవాలి. తల్లిదండ్రులు కూడా బస్సుల స్థితిపై ఫీడ్‌బ్యాక్ తీసుకొని పాఠశాలల యాజమాన్యాలకు రీమార్కులు తెలియజేయాలి. ప్రమాదా లు జరుగకుండా పాఠశాల యాజమాన్యాలు, డ్రైవర్లు, తల్లిదండ్రు లు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

## తదుపరి ఆర్మీచీఫ్‌గా జనరల్ ధీరజ్ సేథ్

మొదటిపేజీ తరువాయి..

చేయబోతున్నారు. ధీరజ్ సేథ్ జూన్ 30 మధ్యాహ్నం నుంచి ఆర్మీ చీఫ్‌గా బాధ్యతలు స్వీకరిస్తారు. ఆయన పదవీకాలం 2028 ఆగస్టు 31 వరకు కొనసాగనుంది. నేషనల్ డిఫెన్స్ అకాడమీ, ఖడక్వాస్లా పూర్వ విద్యార్థి అయిన ధీరజ్ సేథ్ 1986లో భారత సైన్యంలో చేరారు. దాదాపు నాలుగు దశాబ్దాల పాటు సైన్యంలో వివిధ హోదాల్లో పని చేశారు. ధీరజ్ సేథ్ దక్షిణ కమాండ్, దక్షిణ పశ్చిమ కమాండ్‌లకు సారథ్యం వహించడంతో పాటు, ఆర్మీ ప్రధాన కార్యాలయం లోనూ కీలక పదవులు చేపట్టారు. సైన్యంలో విశిష్ట సేవలకు గుర్తింపుగా ఆయనకు పరమ్ విశిష్ట సేవా మెడల్ , ఉ త్తమ్ యుద్ధ సేవా మెడల్, అతి విశిష్ట సేవా మెడల్ వంటి ప్రతిష్ఠాత్మక పురస్కారాలు లభించాయి.

## అసోంలో కుప్పకూలిన విమానం

మొదటిపేజీ తరువాయి..

కోల్పోయారని ఐఏఎఫ్ అధికారులు వెల్లడించారు. తీవ్రంగా గాయపడిన కో-పైలట్‌కు ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. ప్రమాదానికి గల కారణాలను తెలుసుకునేందుకు అత్యున్నత స్థాయి దర్యాప్తునకు ఆదేశించినట్లు అధికారులు పేర్కొన్నారు. ఏఎన్-32 జెట్ దృఢమైన, రెండు ఇంజన్లు గల టర్బోప్రాప్ సైనిక రవాణా విమానం. తీవ్రమైన వాతావరణ పరిస్థితులను తట్టుకునేలా దీనిని రూపొందించారు. ఇది ఎత్తైన ప్రదేశాలలోని ఎయిర్‌ఫీల్డ్‌లలో, వేడి ఉష్ణమండల వాతావరణాల్లోనూ సమర్థంగా పనిచేస్తుంది. 7.5 టన్నుల సరకును, 50 మంది ప్రయాణికులను, 42 మంది పారాట్రూపర్‌లను రవాణా చేయగలదు. ప్రకృతి విపత్తుల సమయంలో మారుమూల ప్రాంతాలలో సామగ్రిని జారవిడవడానికి ఈ విమానాన్ని విస్తృతంగా ఉపయోగిస్తారు.



# మద్యంలో వేల కోట్ల కుంభకోణం

## అడ్డంగా దొరికిన జగన్ అండ్ కో
## అభివృద్ధిని అడ్డుకుంటూ డైవర్షన్ పాలిటిక్స్
## తీవ్రంగా విమర్శలు గుప్పించిన మంత్రి కొల్లు రవీంద్ర

అమరావతి,జూన్13: మద్యంలో రూ.వేల కోట్ల కుంభకోణం చేసి జగన్ అండ్ కో అడ్డంగా దొరికిందని ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర ధ్వజమెత్తారు. గొడ్డలి పోటు, వెన్నుపోట్లకు జగన్ బ్రాండ్ అంబాసిడర్ అని వ్యాఖ్యానించారు. పార్టీ కార్యాలయంలో సృష్టిస్తున్నారు. రాష్ట్రంలో గొడ్డలి పార్టీ శాశ్వతంగా కనుమరుగు కానుందని వ్యాఖ్యానించారు. మద్య నిషేధ హామీని తుంగలో తొక్కి, కల్తీ మద్యంతో 30 వేల మంది ప్రాణాలను గొడ్డలి పార్టీ బలితీసుకుందని ధ్వజమెత్తారు. శనివారం అమరావతి వేదికగా కొల్లు రవీంద్ర



ఆయన మాట్లాడుతూ.. 'జగన్ లాంటి వారు ఆంధ్రప్రదేశ్‌లో ఉండకూడదనే 11 సీట్లు ఇచ్చి కూర్చోబెట్టారు. సెంటు స్థలం పేరుతోనూ వేల కోట్ల స్కామ్ చేశారు. కులాలు, మతాల మధ్య చిచ్చుపెట్టాలని గొడ్డలి పార్టీ కుట్ర చేస్తోంది. వాటిని దీటుగా ఎదుర్కొంటాం. గొడ్డలి పార్టీని ప్రజలు భూస్థాపితం చేసే రోజు దగ్గరలోనే ఉంది. కూటమి రెండేళ్ల పాలనలో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేశాం అని అన్నారు. గత ప్రభుత్వంలో కల్తీ మద్యం కేసు తాడేపల్లి ప్యాలెస్ గేటును తాకిందని మంత్రి ఆరోపించారు. గొడ్డలి పార్టీ నుంచి రోజుకో కుంభకోణం వెలుగులోకి వస్తోంది. చిత్తూరు నుంచి శ్రీకాకుళం వరకు ఆ పార్టీ నాయకులు అరాచకాలు మీడియాతో మాట్లాడారు. బాబాయి హంతకులను కాపాడుతూ, న్యాయం కోరిన సొంత చెల్లికే జగన్ వెన్నుపోటు పొడిచారని ఆగ్రహించారు. విద్యుత్ ఛార్జీలను 9 సార్లు పెంచి, ప్రజలపై రూ.32 వేల కోట్ల మోయలేని భారం మోపారని దుయ్యబట్టారు. మెగా డీఎస్సీ, జాబ్ క్యాలెండర్ హామీలను అటకెక్కించి ఐదేళ్లలో 4,100 మంది నిరుద్యోగుల ఆత్మహత్యలకు కారణమయ్యారని విమర్శించారు. జీఓ నంబర్ - 117 తీసుకువచ్చి బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల ప్రభుత్వ స్కూళ్లను మూసివేసి, 12 లక్షల మంది భవితను అంధకారం చేశారని దుయ్యబట్టారు. బీసీల స్థానిక సంస్థల రిజర్వేషన్లను 34శాతం నుంచి 24శాతానికి కుదించి వెనుకబడిన వర్గాలకు తీవ్ర అన్యాయం చేసిన ఘనత జగన్‌దేనని ఎద్దేవా చేశారు. పోలవరం ప్రాజెక్టును నిర్లక్ష్యం చేసి రాష్ట్ర ప్రయోజనాలను దెబ్బతీశారని ఆగ్రహించారు. 2024 ఎన్నికల్లో 94 శాతం స్థానాలతో కూటమికి చరిత్రాత్మక విజయం అందించి.. జగన్ అరాచక పాలనకు ఏపీ ప్రజలు స్వస్తి పలికారని ప్రస్తావించారు. గత ఐదేళ్ల విధ్వంసాన్ని తుడిచేస్తూ.. రెండేళ్ల కూటమి పాలనలో రాష్ట్రంలో అద్భుతమైన సంక్షేమం, ప్రగతి పథంలో ప్రయాణిస్తోందని చెప్పుకొచ్చారు. కూటమి ప్రభుత్వ సానుకూల విధానాల వల్ల, రెండేళ్లలో దేశానికి వచ్చిన మొత్తం విదేశీ పెట్టుబడుల్లో 25 శాతం ఏపీకే దక్కాయని వివరించారు. రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా 65 లక్షల మందికి పెన్షన్లు ఇస్తున్నామని తెలిపారు. రెండేళ్లలో తమ ప్రభుత్వంలో రూ. 65 వేల కోట్లని నేరుగా పేదలకు పంపిణీ చేశామని వెల్లడించారు.కూటమి ప్రభుత్వ తొలి సంతకంతో మెగా డీఎస్సీ ్గ÷లుపై ఆమోదం పొందిన తర్వాత.. 16,430 ఉపాధ్యాయ, 6,000 కానిస్టేబుల్ పోస్టుల భర్తీ చేశామని మంత్రి కొల్లు రవీంద్ర స్పష్టం చేశారు. మెగా డీఎస్సీపై గొడ్డలి పార్టీ కుట్రలు చేస్తోందని ధ్వజమెత్తారు. ఉచిత బస్సు ప్రయాణ పథకం (స్త్రీ శక్తి) ద్వారా ఇప్పటివరకు 71 కోట్ల మంది మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించామని వెల్లడించారు. దీపం-2 పథకం కింద 3 ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ.. ఇప్పటివరకు 4.26 కోట్ల సిలిండర్లను విజయవంతంగా అందజేశామని అన్నారు. 24 నెలల స్వల్ప వ్యవధిలోనే రూ. 23 లక్షల కోట్ల పెట్టుబడులు ఆకర్షించామని వివరించారు. 21 లక్షల ఉద్యోగాల కల్పనకు పక్కా ప్రణాళిక చేస్తున్నామని తెలిపారు. జగన్ హయాంలో 85శాతం హామీలను తుంగలో తొక్కితే.. కూటమి ప్రభుత్వం రెండేళ్లలోనే 90శాతం సూపర్ సిక్స్ హామీలను నెరవేర్చిందని ఉద్ఘాటించారు. కులాలు, మతాల మధ్య చిచ్చుపెట్టాలని చూస్తున్నారని ధ్వజమెత్తారు. ఏపీ అభివృద్ధిని గొడ్డలి పార్టీ అడ్డుకుంటోందని ధ్వజమెత్తారు. గొడ్డలిపార్టీ దొంగనాటకాలు ఆడుతూ మరొకసారి ప్రజలను మోసం చేయాలని చూస్తోందని మంత్రి కొల్లు రవీంద్ర తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

## ఆర్‌జికెలో ప్రవేశాలకు ఎంపిక

**తాత్కాలిక జాబితా విడుదల చేసిన లోకేశ్**

అమరావతి,జూన్13: ఆంధ్రప్రదేశ్‌లోని రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్ ఆరు సంవత్సరాల ఇంటిగ్రేటెడ్ బీటెక్ కోర్సు 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించిన తాత్కాలిక ఎంపిక జాబితాను ఏపీ విద్యాశాఖ విడుదల చేసింది. ఈ మేరకు ఆన్‌లైన్‌లో ఎంపిక ఫలితాలను విద్య, ఐటీశాఖల మంత్రి నారా లోకేశ్ ఎక్స్ వేదికగా విడుదల చేశారు. నూజివీడు, ఆర్కే వ్యాలీ, ఒంగోలు, శ్రీకాకుళం క్యాంపస్‌లలో ప్రవేశాల కోసం ఎంపిక ప్రక్రియ పూర్తి చేశారు. మొత్తం 44,104 దరఖాస్తులు అందగా, వాటిలో 4,040 మంది విద్యార్థులను తాత్కాలికంగా ఎంపిక చేశారు. ఎంపికైన వారిలో 96.7 శాతం మంది ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులే ఉండటం విశేషం. గ్రామీణ ప్రతిభకు పెద్దపీట వేస్తూ ప్రవేశాలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. విద్యార్థుల ఎంపిక లేఖలు అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు. అలాగే విద్యార్థుల సహాయం కోసం వాట్సాప్ హెల్ప్‌డెస్క్ నంబర్ - 9552300009ను కూడా అందుబాటులోకి తీసుకొచ్చారు. విద్యా రంగంలో సమాన అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పని చేస్తోందని, గ్రామీణ విద్యార్థుల సాధికారతకు ఈ ప్రవేశాలు దోహదపడతాయని ఏపీ విద్యాశాఖ అధికారులు తెలిపింది.

## 21న నగరంలో అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు

విజయవాడ,జూన్13: ఈ నెల 21వ తేదీన ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహించనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమానికి గౌరవ రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు ముఖ్య అతిథిగా హాజరు కానున్నారని, యోగా దినోత్సవ వేడుకలు విజయవంతం అయ్యేలా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. ఈ నెల 21న ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహించనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమం ఏర్పాట్లపై శనివారం జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ, నగర పోలీసు కమిషనర్ ఎం. రాజశేఖర్ బాబు, విజయవాడ మున్సిపల్ కమిషనర్ హెచ్.ఎం. ధ్యానచంద్ర, జాయింట్ కలెక్టర్ ఎస్. ఇలక్కియా తదితరులతో కలిసి స్టేడియాన్ని పరిశీలించి వివిధ శాఖల అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ఈ నెల 21వ తేదీన నిర్వహించే అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు శ్రీ నారా చంద్రబాబు నాయుడు ముఖ్య అతిథిగా హాజరు కానున్నారని తెలిపారు. ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో సుమారు 5,000 మంది యోగా సాధకులు, విద్యార్థులు, ప్రజలు యోగా ఆసనాల్లో పాల్గొనేందుకు రానున్నరన్నారు. ఇందుకు అనుగుణంగా అన్ని ఏర్పాట్లు చేయాలని సంబంధిత శాఖల అధికారులకు సూచించారు. కార్యక్రమంలో పాల్గొనేవారికి తాగునీరు, వైద్య సదుపాయాలు, పారిశుద్ధ్యం, విద్యుత్, ట్రాఫిక్ నియంత్రణ, భద్రతా చర్యలు తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. మున్సిపల్, పోలీసు మరియు ఇతర ప్రభుత్వ శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో ఏర్పాట్లను పర్యవేక్షించాలని ఆదేశించారు. వాతావరణ పరిస్థితులు అనుకూలించక వర్షం కురిసే అవకాశం ఉంటే కార్యక్రమాన్ని అంబేద్కర్ కళావేదికలో నిర్వహించేలా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు కూడా సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ఇందుకోసం అక్కడ కూడా అవసరమైన అన్ని సౌకర్యాలను ముందస్తుగా ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమానికి హాజరయ్యే ప్రజలు, విద్యార్థులు, యోగా సాధకులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమం నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లను జిల్లా స్థాయి అధికారులు సమన్వయంతో పూర్తి చేసి, ప్రాంగణాన్ని సిద్ధం చేసేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డా. జి. లక్ష్మీశ తెలిపారు. ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం పరిశీలనలో జిల్లా కలెక్టర్ వెంట వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## కంటి చూపును కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత

**శుక్లాల సమస్యకు శస్త్రచికిత్సే శాశ్వత పరిష్కారం.**
**ఉచిత కంటి వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి**
**జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ.**

విజయవాడ,జూన్13: ప్రజలు కంటి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, శుక్లాల కారణంగా చూపు మందగించిన వారు ఆలస్యం చేయకుండా శస్త్రచికిత్స చేయించుకోవాలని జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ సూచించారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సహకారంతో శంకర నేత్రాలయ వైద్యులు డా. మాధవ్, డా. అపర్ణల ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఉచిత కంటి ఆపరేషన్ శిబిరానికి సంబంధించిన పోస్టర్‌ను శనివారం జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ కలెక్టరేట్‌లోని చాంబర్‌లో విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మనిషికి ప్రకృతి ప్రసాదించిన అత్యంత విలువైన వరాల్లో కనుచూపు ఒకటని అన్నారు. కంటి చూపు ద్వారా మనం ప్రపంచాన్ని దర్శించగలుగుతామని, విద్యాభ్యాసం, ఉపాధి, దైనందిన కార్యకలాపాలు, సామాజిక జీవనం సజావుగా సాగేందుకు చూపు ఎంతో అవసరమని పేర్కొన్నారు. కంటి ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయడం వల్ల వ్యక్తిగతంగా, కుటుంబపరంగా అనేక ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందన్నారు. వయస్సు పెరుగుతున్న కొద్దీ చాలామందిలో శుక్లాలు ఏర్పడడం సహజమని తెలిపారు. శుక్లాలు వచ్చినప్పుడు వస్తువులు మసకగా కనిపించడం, చదవడంలో ఇబ్బంది కలగడం, వెలుతురు పట్ల అసౌకర్యం, రాత్రివేళల్లో సరిగా కనిపించకపోవడం, రంగులను స్పష్టంగా గుర్తించలేక పోవడం వంటి సమస్యలు తలెత్తుతాయని వివరించారు. ఈ సమస్యను నిర్లక్ష్యం చేస్తే చూపు మరింత తగ్గిపోయి సాధారణ జీవనం కూడా కష్టతరమయ్యే పరిస్థితి ఏర్పడుతుందని హెచ్చరించారు. శుక్లాలకు ప్రస్తుతం అత్యంత సురక్షితమైన, సమర్థవంతమైన చికిత్స శస్త్రచికిత్సేనని కలెక్టర్ తెలిపారు. శస్త్రచికిత్స ద్వారా మసకబారిన కంటి లెన్స్‌ను తొలగించి, దాని స్థానంలో కృత్రిమ లెన్స్‌ను అమర్చడం వల్ల చూపు గణనీయంగా మెరుగుపడుతుందని చెప్పారు.

## మహిళ ఆర్థికంగా బలపడితేనే కుటుంబం బలపడుతుంది

**మహిళల సాధికారతకు ఆర్థిక స్వావలంబననే బలమైన పునాది.**
**ఆర్థిక స్వాతంత్ర్యం మహిళలకు ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుంది**
**జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ**

విజయవాడ,జూన్13: మహిళలు ఆర్థికంగా బలపడితే కుటుంబం బలపడుతుందని కుటుంబం బలపడితేనే సామాజం అభివృద్ధి చెందుతుందని ఆర్థిక స్వాతంత్ర్యం÷-ర మహిళలలో ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుందని జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ అన్నారు. గొల్లపూడిలోని రైజ్ సెంటర్‌లో మహిళలకు సోలార్ డ్రైయింగ్ పౌడర్ ప్రాసెసింగ్‌పై నిర్వహించిన అవగాహన కార్యక్రమాన్ని శనివారం జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మహిళా సాధికారతకు నైపుణ్యాభివృద్ధి, స్వయం ఉపాధి అవకాశాలు అత్యంత కీలకమని పేర్కొన్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో సహజ సిద్ధమైన ఆహార ఉత్పత్తులకు పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని సోలార్ డ్రైయింగ్ సాంకేతికత ద్వారా విలువ ఆధారిత ఉత్పత్తులను తయారు చేసి మంచి ఆదాయం పొందే అవకాశం ఉందన్నారు. వ్యవసాయ, ఉద్యాన పంటలతో పాటు వివిధ రకాల పండ్లు, కూరగాయలను సోలార్ డ్రైయింగ్ ద్వారా నిల్వ చేసి పౌడర్ రూపంలో ప్రాసెస్ చేయడం ద్వారా అదనపు ఆదాయం సమకూరుతుందని తెలిపారు. మహిళలు ఈ శిక్షణలను సద్వినియోగం చేసుకుని స్వయం ఉపాధి రంగంలో ముందుకు రావాలని సూచించారు. ప్రభుత్వం మహిళల ఆర్థికాభివృద్ధికి అనేక పథకాలను అమలు చేస్తోందని, స్వయం సహాయక సంఘాల సభ్యులు అందుబాటులో ఉన్న అవకాశాలను వినియోగించు కోవాలని కలెక్టర్ పేర్కొన్నారు. రైజ్ సెంటర్ ద్వారా అందిస్తున్న శిక్షణలు మహిళలలో వ్యాపార నైపుణ్యాలను పెంపొందించి ఉపాధి అవకాశాలను విస్తృతం చేస్తాయని తెలిపారు. కార్యక్రమంలో నిపుణులు సోలార్ డ్రైయింగ్ పక్రియ, ఉత్పత్తుల తయారీ, నాణ్యత ప్రమాణాలు, మార్కెటింగ్ అవకాశాలపై మహిళలకు వివరించారు. శిక్షణలో పాల్గొన్న మహిళలు పలు సందేహాలను నివృత్తి చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎన్.వి. నాంచారరావు, అగ్రో ఎంటర్‌ప్రైజెస్ ప్రతినిధి పవన్‌కుమార్, స్వయం సహాయక సంఘాల ప్రతినిధులు, రైజ్ సెంటర్ ప్రతినిధులు, మహిళలు పాల్గొన్నారు.

## మద్యపాన నిషేధం పేరుతో దోపిడీ

అమరావతి,జూన్13: మద్యపాన నిషేధం చేస్తామని మద్యాన్ని పూర్తిగా ఆదాయ వనరుగా మార్చుకున్నారని గత వైసీపీ ప్రభుత్వంపై సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. మద్యం కుంభకోణంలో రూ.3500 కోట్లు దోచుకొని డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని ఆరోపించారు. మద్యం కుంభకోణంలో అంతిమ లబ్దిదారుడు గొడ్డలి పార్టీ నాయకుడు జగనే అని వ్యాఖ్యానించారు. కల్తీ మద్యం తయారు చేసి 30 వేల మంది మహిళల పుస్తెలు తెంచారని దుయ్యబట్టారు. చిన్నాన్నను చంపిన వ్యక్తికి ప్రజల ప్రాణాలు ఒక లెక్క కాదన్నారు. కల్తీ మద్యం ద్వారా దోచుకున్న సొమ్ముతో సినిమాలు, వ్యాపారాలు చేశారని మంత్రి తెలిపారు. వైసీపీ మాజీమంత్రి కారుమూరి నాగేశ్వరరావు మద్యం రవాణా దోపిడీ చేశారని ఆరోపించారు. డొల్ల కంపెనీల ద్వారా రవాణా ఛార్జీలు పెంచి రూ.400 కోట్లు దోచుకున్నారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వంలో సురక్ష యాప్ ద్వారా నాణ్యమైన మద్యం అందుబాటులోకి తీసుకొచ్చామని తెలిపారు. ప్రజలు గొడ్డలి పార్టీని తిరస్కరించిన విషయాన్ని గొడ్డలి పార్టీ నాయకులు గుర్తు చేసుకోవాలని అన్నారు. కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్‌తో సూపర్ హిట్ కొట్టిందన్నారు. మద్యం కుంభకోణంలో తాడేపల్లి గేట్‌ను ఈడీ టచ్ చేసిందన్నారు. రాష్ట్రంలో శాశ్వతంగా గొడ్డలి పార్టీని ప్రజలు మూసి వేశారని డోలా బాల వీరాంజనేయ స్వామి వ్యాఖ్యానించారు.

## కొండవీటి వాగు.. పాల వాగులపై 69 వంతెనల నిర్మాణం

### వర్షాకాలం దృష్ట్యా శరవేగంగా పనుల నిర్మాణం పూర్తికి చర్యలు
### నిర్మాణాలను పూరిశీలించిన మంత్రి నారాయణ
### జగన్ విమర్శలను మరోమారు తిప్పికొట్టిన మంత్రి

అమరావతి,జూన్13: అమరావతిలో కొండవీటి వాగు.. పాల వాగులపై నిర్మిస్తున్న వంతెన నిర్మాణ పనులను రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి నారాయణ పరిశీలించారు. అమరావతిలో మంత్రి శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడారు. అమరావతిలో 69 వంతెనల నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని మంత్రి నారాయణ తెలిపారు. వర్షాకాలం దృష్ట్యా నీటి ప్రవాహానికి ఆటంకాలు తొలగించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వంతెనల వద్ద మట్టి, తాత్కాలిక కట్టలు తొలగించాలని అధికారులకు సూచించారు. కొండవీటి వాగు, పాలవాగు, గ్రావిటీ కాలువల పనులపై ప్రత్యేకంగా దృష్టిసారించాలని దిశానిర్దేశం చేశారు. ఎల్పీఎస్ లేఅవుట్లలో మరో 26 వంతెనలు నిర్మాణంలో ఉన్నాయని పేర్కొన్నారు. ఈ వివరాలు తెలుసుకున్న తర్వాత అయినా ప్రతిపక్ష నేత అమరావతి నిర్మాణాలపై అసత్య ప్రచారాలు మానుకోవాలని హితవు పలికారు. రాజధాని అమరావతి పరిధిలోని కొండవీటి వాగు, పాలవాగులపై మొత్తం 69 బ్రిడ్జిల నిర్మాణం జరుగుతోందని మంత్రి నారాయణ తెలిపారు. ఈ రెండు వాగులపై జరుగుతున్న వంతెనల పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని అమరావతిలో ఎక్కడా నీటి నిల్వలు లేకుండా అవసరమైన ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఈ రెండు వాగులపై మొత్తం 69 బ్రిడ్జిల నిర్మాణం జరుగుతోందని, వర్షపు నీరు సాఫీగా సాగిపోయేలా



అవసరమైతే జేసీబీలతో వెంటనే చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వచ్చే ఏడాది నాటికి ఎక్కువశాతం వంతెనల పనులు పూర్తి కానున్నాయని మంత్రి నారాయణ వివరించారు. ఏపీ రాజధాని అమరావతి నిర్మాణాలపై వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి మంత్రి నారాయణ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. అమరావతి హ్యాపీనెస్ట్ గృహాల నిర్మాణ వ్యయం కేంద్ర ప్రాజెక్టుల కంటే తక్కువని స్పష్టం చేశారు. హ్యాపీనెస్ట్ గృహాల నిర్మాణ వ్యయం చదరపు అడుగుకు రూ.3,393 మాత్రమే ఖర్చు అవుతోందని వివరించారు. కేంద్ర నివాస సముదాయాల వ్యయం చదరపు అడుగుకు రూ.3,945 ఖర్చు చేస్తున్నట్లు మంత్రి నారాయణ వివరించారు. గెజిటెడ్ అధికారుల నివాసాల కోసం రూ.1003 కోట్లతో టెండర్ వేయగా చదరపు అడుగుకు రూ.3,684 మాత్రమే ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. సెంట్రల్ గవర్నమెంట్ రెసిడెన్షియల్ కాంప్లెక్స్‌కి రూ.1234 కోట్లతో టెండర్ వేయగా, చదరపు అడుగుకు రూ3,945 ఖర్చు చేస్తున్నట్లు చెప్పుకొచ్చారు. రాజధాని అభివృద్ధిలో భాగంగా సీఆర్డీఏ ఆధ్వర్యంలో వాగులపై 43 వంతెనలు, ఇంజనీరింగ్ ప్రణాళికలతో పనులు వేగవంతం చేశామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. అమరావతిలో కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణానికి కేంద్ర క్యాబినెట్ ఇప్పటికే ఆమోదం తెలిపిందన్నారు. అమరావతి భవనాల నిర్మాణ వ్యయంపై వైసిపి నేతలు చేస్తున్న ఆరోపణలను మంత్రి తీవ్రంగా ఖండించారు.
కేంద్ర ప్రభుత్వ రెసిడెన్షియల్ కాంప్లెక్స్ నిర్మాణానికి చదరపు అడుగుకు రూ. 3,945 ఖర్చు అవుతుంటే, అమరావతి హ్యాపీనెస్ట్ నిర్మాణానికి రూ. 3,393, గెజిటెడ్ అధికారుల నివాసాలకు రూ. 3,684 మాత్రమే వ్యయం అవుతోందని తెలిపారు. ఐకానిక్ భవనాలు కావడం వల్లే కొన్నింటికి కొద్దిగా ఖర్చు ఎక్కువ అవుతుందని, పార్లమెంట్ భవనానికైనా, తెలంగాణ సచివాలయం నిర్మాణానికైనా తొలిసారి పిలిచిన టెండర్లుకి.. పూర్తయ్యేనాటికి భారీగా ఖర్చయిందని.. ఖర్చు పెరగడం సహజమేనని పేర్కొన్నారు. వైసిపి నాయకులు ఇకనైనా అబద్ధపు ప్రచారాలు మానకపోతే వచ్చే ఎన్నికల్లో వారికి 11 సీట్లు కూడా రావంటూ ఘాటుగా ఎద్దేవా చేశారు.

## యోగాతో క్రమశిక్షణతో నడిపించే శక్తి

### యోగా ద్వారా ఆరోగ్యవంతమైన సామాజ నిర్మాణం
### యోగాసనాలతో ఆరోగ్యాన్ని సంరక్షించుకోండి.
### జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ.

విజయవాడ,జూన్13: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న యోగాంధ్ర కార్యక్రమం ద్వారా ఆరోగ్యవంతమైన సామాజ నిర్మాణమే లక్ష్యమని ప్రతి ఒక్కరూ రోజు యోగాసనాలను ఆచరించి ఆరోగ్యంగా ఉండాలని, జీవితంలో యోగాన్ని ఒక భాగంగా మార్చుకోవాల్సిన అవసరం ఉందని జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ అన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం భవానిపురంలోని బెరం పార్కు నందు నిర్వహించిన యోగా శిక్షణ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ, ఆయుష్ కమిషనర్ గోపాలకృష్ణ, నగర మున్సిపల్ కమిషనర్ హెచఎం ధ్యానచంద్ర, జాయింట్ కలెక్టర్ ఎస్. ఇలక్కియా పాల్గొన్ని యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా యోగాంధ్ర ఒక ఉద్యమంలా రూపుదిద్దుకుని ప్రజల్లో ఆరోగ్య చైతన్యాన్ని కలిగిస్తోందన్నారు. ఆరోగ్యవంతమైన, సంతోషక నిర్వహించి ప్రజలను భాగస్వాములను చేయడం జరిగిందన్నారు.
ఆయుష్ శాఖ నిపుణులు రూపొందించిన కామన్ యోగా ప్రోటోకాల్‌లోని ఆసనాలు సులభంగా ప్రతి ఒక్కరూ చేయగలవని కలెక్టర్ తెలిపారు. చిన్నారుల నుంచి వృద్ధుల వరకు అన్ని వయస్సుల వారు యోగా చేయవచ్చని చెప్పారు. రోజుకు కేవలం 40 నుంచి 45 నిమిషాల సమయం కేటాయించి యోగా చేస్తే శారీరక దృఢత్వం, మానసిక ప్రశాంతత, ఆరోగ్యకర జీవనశైలి సాధ్యమవుతుం దన్నారు. ప్రస్తుతం పెరుగుతున్న ఊబకాయం, హార్మోన్ల అసమతుల్యత, మానసిక ఒత్తిడి, మూడ్ స్వింగ్స్ వంటి జీవనశైలి వ్యాధులను నివారించడంలో యోగా కీలక పాత్ర పోషిస్తుందని చెప్పారు. ఆరోగ్యకరమైన ఆలోచనలు, పనిలో సామర్థ్య వృద్ధి, జీవితంలో సమతుల్యత కోసం ప్రతి ఒక్కరూ ప్రతిరోజూ యోగా చేయాలని జిల్లా కలెక్టర్ జి. లక్ష్మీశ పిలుపునిచ్చారు. యోగాంధ్ర



రమైన ఆంధ్రప్రదేశ్ నిర్మాణమే ఈ కార్యక్రమ ప్రధాన లక్ష్యమన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తూ యోగాంధ్ర కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందన్నారు. యోగా ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు ప్రజల్లో సానుకూల దృక్పథం పెంపొందుతుందన్నారు. గత ఏడాది మాదిరిగానే ఈసారి కూడా ఎన్టీఆర్ జిల్లాలో యోగాంధ్ర కార్యక్రమాలను విస్తృత స్థాయిలో నిర్వహిస్తున్నామన్నారు. ప్రత్యేక యోగా కార్యక్రమాల నిర్వహణతో పాటు విద్య సంస్థలు ప్రభుత్వ కార్యాలయాలలో యోగా కార్యక్రమాలు కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు సహకరిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు, స్వచ్ఛంద సంస్థలు, శిక్షకులు, విద్యాసంస్థలు, పౌర సమాజ ప్రతినిధులు, ప్రజలందరికీ కలెక్టర్ ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో డిఎంఅండ్‌హెచ్‌వో డా. జె. ఇందుమతి, జిల్లా ఆయుష్ అధికారి డా. వై రత్న ప్రియదర్శిని, నగర పాలక సంస్థ అడిషనల్ కమిషనర్ చంద్రశేఖర్, జిల్లా పర్యాటక అధికారి ఎ.శిల్ప, డిఆర్‌డిఏ పిడి ఏన్‌వి నాంచారరావు, జిల్లా యువజన సంక్షేమ అధికారి డా. కె. రమేష్, వివిధ శాఖల చెందిన అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## సూపర్ సిక్స్ హామీల అమలు వరకు వైఎస్సార్‌సీపీ పోరాటం కొనసాగుతుంది: వరుదు కల్యాణి



సాక్ష్యం , విశాఖపట్నం
కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనను "రెండేళ్ల నమ్మకం"గా కాకుండా "రెండేళ్ల వెన్నుపోటు, సంక్షోభం"గా అభివర్ణించాలని వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి అన్నారు. శనివారం విశాఖపట్నంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎన్నికల సమయంలో మహిళలకు నెలకు రూ.1,500 చొప్పున అందిస్తామని ప్రకటించిన "ఆడబిడ్డ నిధి" పథకాన్ని కూటమి ప్రభుత్వం రెండేళ్లు గడిచినా అమలు చేయలేదని విమర్శించారు. రాష్ట్రంలోని రెండు కోట్ల మంది మహిళలను ప్రభుత్వం మోసం చేసిందన్నారు. జగన్ ప్రభుత్వ హయాంలో "చేయూత" ద్వారా మహిళల ఖాతాల్లో క్రమం తప్పకుండా నిధులు జమ చేశారని గుర్తుచేశారు.
"తల్లికి వందనం", "అన్నదాత సుఖీభవ", నిరుద్యోగ భృతి, 20 లక్షల ఉద్యోగాల హామీలను కూడా ప్రభుత్వం విస్మరించిందని ఆరోపించారు. సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ పేరుతో ప్రజలను మభ్యపెట్టారని, మూడో బడ్జెట్‌లో కూడా ఆడబిడ్డ నిధికి కేటాయింపులు లేకపోవడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమన్నారు. జగన్ కంటే ఎక్కువ సంక్షేమ పథకాలు అమలు చేస్తామని చెప్పిన కూటమి నేతలు మహిళలను, రైతులను, నిరుద్యోగ యువతను తీవ్రంగా నిరాశ పరిచారని పేర్కొన్నారు. సూపర్ సిక్స్ హామీలను పూర్తిగా అమలు చేసే వరకు వైఎస్సార్‌సీపీ పోరాటం కొనసాగుతుందని వరుదు కల్యాణి స్పష్టం చేశారు.

## వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్స్ అరేనాలో ఇంగ్లీష్ పత్రికల పఠనంపై ప్రత్యేక శిక్షణ




సాక్ష్యం , విశాఖపట్నం
వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్స్ అరేనాలో ఇంగ్లీష్ వార్తాపత్రికల పఠనంపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ వర్క్‌షాప్‌కు సీనియర్ ఐఆర్ఎస్ అధికారి రవికిరణ్ ఎదరా ముఖ్య మెంటర్‌గా హాజరయ్యారు. హైస్కూల్ విద్యార్థులు తమ తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో కలిసి పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ప్రతిరోజూ వార్తాపత్రిక చదవడం మల్టీవిటమిన్ మాత్ర తీసుకున్నట్లేనని, అది అనేక ప్రయోజనాలను అందిస్తుందని రవికిరణ్ పేర్కొన్నారు. ఇంగ్లీష్ భాషా ప్రావీణ్యాన్ని పెంపొందించడంతో పాటు సమకాలీన అంశాలపై అవగాహన కల్పించడం ద్వారా యువతలో సామాజిక బాధ్యతాభావం పెంపొందుతుందని తెలిపారు. ఇది వికసిత్ భారత్ లక్ష్య సాధనకు దోహదపడే మెట్లలో ఒకటని చెప్పారు.
ఇంగ్లీష్ సహా ఏ భాషను నేర్చుకోవాలన్నా మాతృభాష బలమైన పునాదిగా ఉంటుందని ఆయన వివరించారు. వ్యాకరణంపై మాత్రమే ఆధారపడకుండా పుస్తకాలు, వార్తాపత్రికలు, డాక్యుమెంటరీల ద్వారా మంచి ఇంగ్లీష్‌ను చదవడం, వినడం అలవాటు చేసుకోవాలని సూచించారు. ఆధునిక కృత్రిమ మేధ (ఏఐ) నమూనాలను ఉదాహరణగా ప్రస్తావిస్తూ, మానవ మెదడు కూడా వ్యాకరణ నియమాల కంటే వాక్యాల్లోని నమూనాలను గుర్తించడం ద్వారా సహజంగా నేర్చుకుంటుందని వివరించారు. కార్యక్రమంలో విద్యార్థులు నమూనా వార్తా కథనాలను చదివి, అందులోని క్లిష్ట పదాల అర్థాలు, వాడుకపై చర్చల్లో చురుకుగా పాల్గొన్నారు. బాల వికాస్ ఫౌండేషన్ గౌరవ కార్యదర్శి ప్రకాశ్ రావు, వీఎంఆర్‌డీఏ సీఏఓ హరిప్రసాద్ మాట్లాడుతూ వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ ఎం.వి. ప్రణవ్ గోపాల్, మెట్రోపాలిటన్ కమిషనర్ ఎన్. తేజ్ భరత్ ఐఏఎస్ మార్గదర్శకత్వంలో రానున్న నెలల్లో కూడా పిల్లల ప్రయోజనార్థం వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్స్ అరేనాలో ఇలాంటి కార్యక్రమాలను మరిన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు.

## టీపీబీఓలుగా పదోన్నతులు కల్పించాలి.. సోమవారం రాష్ట్రవ్యాప్త నిరసనలకు పిలుపు

సాక్ష్యం , విశాఖపట్నం
వార్డు ప్లానింగ్ అండ్ రెగ్యులేషన్ సెక్రటరీలు (గ్రేడ్-2)కు టౌన్ ప్లానింగ్ బిల్డింగ్ ఆఫీసర్లు (టీపీబీఓలు)గా పదోన్నతులు కల్పించి, తగిన సాంకేతిక వేతన శ్రేణి అమలు చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా ప్లానింగ్ సెక్రటరీలు నిరసన కార్యక్రమాలు చేపట్టానున్నరారు . ఈ మేరకు సోమవారం



సీడీఎంఏ, డీటీసీపీ, సీఆర్డీఏ అధికారులకు తమ నిరసనను తెలియజేయనున్నట్లు రాష్ట్ర అధ్యక్షుడు జె. వెంకటేష్ తెలిపారు. ఈ క్రమం లో జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ విభాగంలో పనిచేస్తున్న ప్లానింగ్ సెక్రటరీస్ టెక్నికల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు జె. వెంకటేష్, ప్రధాన కార్యదర్శి కె. శ్రీనివాసరావు, ట్రెజరర్ ఆర్. ధనంజయ్‌తో పాటు సభ్యులు చీఫ్ సిటీ ప్లానర్ ఏ. ప్రభాకర్ రావు, ఆర్‌డీడ ◌టీపీ అధికారులకు వినతిపత్రం సమర్పించారు.
డిప్లొమా ఇన్ సివిల్ ఇంజినీరింగ్ అర్హతతో టౌన్ ప్లానింగ్, భవన అనుమతులు, క్షేత్రస్థాయి తనిఖీలు తదితర కీలక సాంకేతిక బాధ్యతలు నిర్వహిస్తున్నప్పటికీ, గత రెండేళ్లుగా టీపీబీఓలుగా ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వర్తిస్తున్న తమకు తగిన గుర్తింపు, పదోన్నతి అవకాశాలు కల్పించలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. సీడీఎంఏ ప్రతిపాదించిన గ్రేడ్-1 అప్‌గ్రేడేషన్, రూ.23,780 ప్రాథమిక వేతనం తమ అర్హతలు, విధులకు అనుగుణంగా లేవని, అదే విద్యార్హతలు కలిగిన ఇతర సాంకేతిక కేడర్లతో పోలిస్తే తమకు అన్యాయం జరుగుతోందని పేర్కొన్నారు. ప్రత్యేక సాంకేతిక పోస్టులు సృష్టించి టీపీబీఓలుగా పదోన్నతులు కల్పించడంతో పాటు, గత రెండేళ్లుగా ఇన్‌చార్జిలుగా అందించిన సేవలను భవిష్యత్ సర్వీస్ రూల్స్, పదోన్నతి విధానాల్లో పరిగణనలోకి తీసుకోవాలని అసోసియేషన్ నాయకులు ప్రభుత్వాన్ని కోరారు.

## శ్రీశైలం అమ్మవారికి భారీ విరాళం

### కోటి విలువ చేసే బంగారు, వెండి ఆభరణాలు అప్పగింత

నంద్యాల,జూన్13 : ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీశైలం శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి అమ్మవార్లకు భక్తులు భారీ విరాళాన్ని అందజేశారు. కోటి రూపాయలు విలువచేసే బంగారు, వెండి వస్తువులను మల్లన్న స్వామికి దాతలు సమర్పించారు. కాకినాడ జిల్లా పెద్దాపురానికి చెందిన శ్రీ లలితా ఎంటర్ ప్రైజెస్ మేనేజింగ్ డైరెక్టర్ మట్టే శ్రీనివాస్ దంపతులు వెండి వస్తువులు, బంగారు అభరణాలను స్వామిఅమ్మవార్లకు సమర్పించినట్లు ఈఓ శ్రీనివాసరావు వెల్లడించారు. బంగారు నామాలు, చంద్రవంక కలిగిన వెండి జటాజూటం, పలు వెండి పూజావస్తువులు, బంగారు రుద్రాక్షమాల, మంగళసూత్రాలను సమర్పించారని ఈఓ తెలిపారు. వెండి వస్తువుల బరువు 42 కేజీల 516 గ్రాములు ఉండగా, బంగారు అభరణాల బరువు 73 గ్రాముల 500 మిల్లీ గ్రాములుగా ఉందని వెల్లడించారు. ప్రస్తుతం మార్కెట్‌లో వీటి విలువ సుమారు కోటి రూపాయల వరకు ఉంటుందని చెప్పారు. బంగారు ఆభరణాలు, వెండి వస్తువులను దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యులు ఆలా అనిల్ కుమార్ ఆధ్వర్యంలో దేవస్థానానికి దాతలు అందజేశారు.

## బీచ్ షాక్స్ నిర్ణయాన్ని రద్దు చేయాలి : ఐద్వా నిరసన

సాక్ష్యం , విశాఖపట్నం
విశాఖ సముద్ర తీరంలో మద్యం విక్రయాలకు అనుమతించే ప్రభుత్వ "బీచ్ షాక్స్" నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ఆధ్వర్యంలో శనివారం ఆర్కే బీచ్‌లోని కాళీమాత




ఆలయం వద్ద నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బి. ప్రభావతి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆర్.ఎన్. మాధవి, వై. సత్యవతి, జిల్లా ఉపాధ్యక్షురాలు బి. పద్మ మాట్లాడుతూ గోవా కల్చర్ పేరుతో బీచ్‌లలో మద్యం విక్రయాలకు అనుమతించడం దుర్మార్గమైన చర్య అని విమర్శించారు. ప్రభుత్వ ఖజానా నింపుకోవడం, మద్యం సిండికేట్లకు లబ్ధి చేకూర్చడానికే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆరోపించారు. కుటుంబాలు, మహిళలు, పిల్లలు ప్రశాంతత కోసం వచ్చే విశాఖ బీచ్‌లో మద్యం అందుబాటులోకి వస్తే మహిళల భద్రతకు ముప్పు ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. మద్యం, మత్తు పదార్థాల కారణంగా గృహ హింస, ఆర్థిక సమస్యలు పెరిగి కుటుంబాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని పేర్కొన్నారు. గంజాయి, డ్రగ్స్ సంస్కృతికి తోడు ఈ నిర్ణయం యువత భవిష్యత్తుపై ప్రతికూల ప్రభావం చూపుతుందని, సముద్ర తీరం ప్లాస్టిక్ వ్యర్థాలు, మద్యం సీసాలతో కలుషితమై పర్యావరణానికి హాని కలుగుతుందని హెచ్చరించారు. ప్రభుత్వం బీచ్ షాక్స్ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని, బీచ్ పరిసరాల్లో మద్యం అమ్మకాలను నిషేధించాలని, అక్రమ మద్యం విక్రయాలు, బెల్ట్ షాపులు, గంజాయి, డ్రగ్స్ రవాణాపై కఠిన చర్యలు తీసుకోవాలని ఐద్వా డిమాండ్ చేసింది. మహిళలు, యువత భద్రతను పటిష్టం చేస్తూ పర్యావరణ పరిరక్షణకు చర్యలు చేపట్టాలని కోరింది. ప్రభుత్వం నిర్ణయాన్ని వెనక్కి తీసుకునే వరకు మహిళలు, యువతను ఏకం చేసి పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని ఐద్వా నేతలు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా నాయకులు డి. కొండమ్మ, ఆర్. వరలక్ష్మి , సీహెచ్. సుమిత్ర, బి. రమణి, వి. ప్రభావతి, కె. కుమారి, డి. రమణమ్మ, మౌనిక, అరుణ, బి. సత్యవతి, మంగవేణి, దేవి, జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు బీఎల్ నారాయణ, కృష్ణ మెటర్నిటీ హాస్పిటల్ సిబ్బంది, పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

## స్టీల్ ప్లాంట్ కార్మికుల మరణాలు రాజకీయ హత్యలే: ఐఎఫ్‌టీయూ

సాక్ష్యం , విశాఖపట్నం.
విశాఖ స్టీల్ ప్లాంట్‌లో చోటుచేసుకున్న కార్మికుల మరణాలు సాధారణ పారిశ్రామిక ప్రమాదాలు కాదని, కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల ప్రైవేటీకరణ విధానాలు, భద్రతా ప్రమాణాల నిర్లక్ష్యం కారణంగా జరిగిన రాజకీయ హత్యలుగా పరిగణించాలని ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్ (ఐఎఫ్‌టీయూ) నాయకులు పేర్కొన్నారు. శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఐఎఫ్‌టీయూ జాతీయ ఉపాధ్యక్షుడు పి. ప్రసాద్ మాట్లాడుతూ, పరిశ్రమ నిర్వహణలో కీలకమైన మాన్, మిషన్, మెటీరియల్, మేనేజ్‌మెంట్ వ్యవస్థలను ప్రభుత్వాలు నిర్వీర్యం చేశాయని ఆరోపించారు. నిపుణులైన కార్మికులను తగ్గించడం, యంత్రాల నిర్వహణను నిర్లక్ష్యం చేయడం, నాసిరకం ముడి పదార్థాల వినియోగం, కార్పొరేట్ ప్రయోజనాలకు అనుగుణంగా యాజమాన్య వ్యవస్థ పనిచేయడం వంటి కారణాల వల్లే ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు. ప్రస్తుతం డబ్బు ఆధారిత కార్పొరేట్ శక్తుల ప్రభావంతో పారిశ్రామిక భద్రత పూర్తిగా దెబ్బతిందని విమర్శించారు.
ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, ప్రమాదాలకు బాధ్యులైన యాజమాన్యం, సంబంధిత అధికారులపై బీఎన్ఎస్ సెక్షన్లు 105, 308, 287, 120బి కింద కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.వి. రమణ మాట్లాడుతూ, 2020లో తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్లు కార్మిక భద్రతా ప్రమాణాలను బలహీనపరిచాయని, వాటిని రద్దు చేయాలని కోరారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పాత కార్మిక చట్టాలను బలోపేతం చేసి కట్టుదిట్టమైన భద్రతా చర్యలు అమలు చేయాలని సూచించారు. మృతుల కుటుంబాలకు రూ.1 కోటి పరిహారం, క్షతగాత్రులకు రూ.50 లక్షల పరిహారం, బాధిత



కుటుంబంలోని ఒకరికి శాశ్వత ఉద్యోగం కల్పించాలని ఐఎఫ్‌టీయూ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కమిటీ సభ్యురాలు బి. గీత, శ్రీకాకుళం జిల్లా నాయకులు కృష్ణవేణి, విశాఖ జిల్లా నాయకులు సీహెచ్ వెంకట్రావు, బి. గోవిందు తదితరులు పాల్గొన్నారు.

## తిరుపతి-గుంతకల్ విభాగంలో దక్షిణ తీర రైల్వే జీఎం విస్తృత తనిఖీ

సాక్ష్యం , విశాఖపట్నం
దక్షిణ తీర రైల్వే (ఎస్‌సీఓఆర్) జనరల్ మేనేజర్ శ్రీ సందీప్ మాథూర్ శనివారం తిరుపతి రైల్వే స్టేషన్‌తో పాటు తిరుపతి-గుంతకల్ సెక్షన్‌లో విస్తృత తనిఖీ నిర్వహించారు. కొత్తగా ఏర్పడిన దక్షిణ తీర రైల్వే జోన్ ఏర్పాటుకు అనంతరం ఈ సెక్షన్‌లో ఆయన చేపట్టిన తొలి తనిఖీ ఇదే.



జోన్ పరిధిలో జరుగుతున్న మౌలిక సదుపాయాల అభివృద్ధి, ప్రయాణికుల సౌకర్యాలు, కొనసాగుతున్న ప్రాజెక్టుల పురోగతిని సమీక్షించడం ఈ పర్యటన ప్రధాన ఉద్దేశ్యం. తిరుపతి రైల్వే స్టేషన్‌లో జనరల్ మేనేజర్ స్టేషన్ పునర్వ్యవస్థీకరణ ప్రాజెక్టు పురోగతిని సమీక్షించారు. సర్క్యులేటింగ్ ఏరియా, లిఫ్టులు, ఎస్కలేటర్లు, ప్లాట్‌ఫారాలు, కాంకోర్స్‌తో పాటు ఇతర ప్రయాణికుల సౌకర్యాలు, మౌలిక సదుపాయాల పనులను పరిశీలించారు. నిర్మాణ అధికారులతో సమావేశమై, నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ పనులను నిర్ణీత గడువులో పూర్తి చేయాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పారు. గుంతకల్ డివిజన్ అధికారులు కొనసాగుతున్న ప్రాజెక్టులు, అభివృద్ధి కార్యక్రమాలు, నిర్వహణ విజయాలు, భవిష్యత్ ప్రణాళికలపై సమగ్ర ప్రజెంటేషన్ ఇచ్చారు. తనిఖీలో భాగంగా సందీప్ మాథూర్ రాయచోటి సమీపంలోని రజంపేట రైల్వే స్టేషన్‌ను సందర్శించి, సర్క్యులేటింగ్ ఏరియా, వేచివుండే మందిరం, పార్కింగ్ స్థలం తదితర ప్రయాణికుల సౌకర్యాలకు సంబంధించిన అభివృద్ధి పనులను సమీక్షించారు. అనంతరం కడప రైల్వే స్టేషన్‌లో సర్క్యులేటింగ్ ఏరియా, ప్లాట్‌ఫారాలు, ప్రయాణికుల సౌకర్యాలను పరిశీలించారు. అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద జరుగుతున్న పనుల పురోగతిపై ప్రత్యేక దృష్టి సారించి, అమలు నాణ్యతను అంచనా వేసి, అన్ని ప్రాజెక్టులను నాణ్యతతో, సకాలంలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.
జనరల్ మేనేజర్ తాడిపత్రి నుంచి గుత్తి వరకు విండో ట్రైలింగ్ తనిఖీ నిర్వహించి, పట్టాల పరిస్థితి, భద్రతా అంశాలు, కొనసాగుతున్న పనులను పరిశీలించారు. గుత్తిలో యార్డు రీమోడలింగ్ పనులను తనిఖీ చేసి, వాటిని వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం గుత్తి-గుంతకల్ మధ్య రైల్వే మౌలిక సదుపాయాలను కూడా విండో ట్రైలింగ్ ద్వారా పరిశీలించారు. ఈ తనిఖీ సందర్భంగా ప్రధాన చీఫ్ ఇంజనీర్ బి.ఎస్.కె. రాజ్‌కుమార్, ప్రధాన చీఫ్ సిగ్నల్ అండ్ టెలికాం ఇంజనీర్ ఓ.బి. సురేష్ కుమార్, ప్రధాన చీఫ్ ఆపరేషన్స్ మేనేజర్ వినీత్ కుమార్, దక్షిణ తీర రైల్వే చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ అంకుష్ గుప్తా, గుంతకల్ డివిజన్ డివిజనల్ రైల్వే మేనేజర్ చంద్రశేఖర్ గుప్తా తదితరులు జనరల్ మేనేజర్ వెంట ఉన్నారు.

## తిరుపతిలో జరిగింది వెన్నుపోటు సభే.. : బొత్స సత్యనారాయణ

సాక్ష్యం , విశాఖపట్నం
తిరుపతిలో కూటమి ప్రభుత్వం నిర్వహించిన సభ ప్రజలను ఆకట్టుకోలేకపోయిందని, అది "రెండేళ్ల నమ్మకం సభ" కాదని, "వెన్నుపోటు సభ"గా నిలిచిపోయిందని శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ విమర్శించారు. విశాఖపట్నంలోని తన క్యాంపు కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన ఆయన, ప్రభుత్వం ఎన్నికల హామీల అమలులో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. సూపర్ సిక్స్ పథకాలు సూపర్ హిట్ అయ్యాయని కూటమి నేతలు చెబుతున్నప్పటికీ, ఆడబిడ్డ నిధి, నిరుద్యోగ భృతి వంటి ప్రధాన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్నారని మండిపడ్డారు. తిరుపతి సభలోనే మహిళలకు ఇచ్చిన హామీలను విస్మరిస్తున్నట్లు కూటమి నేతలు పరోక్షంగా అంగీకరించారని, ఇది మహిళలకు మరో బహిరంగ వెన్నుపోటు అని వ్యాఖ్యానించారు. రాష్ట్రవ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమాలకు ప్రజలు స్వచ్ఛందంగా మద్దతు ఇవ్వడం, ప్రభుత్వంపై నెలకొన్న వ్యతిరేకతకు నిదర్శనమని బొత్స అన్నారు. తిరుపతి సభలో సౌండ్ మాత్రమే వినిపించిందని, ప్రజల నుంచి రీసౌండ్ రాలేదని ఎద్దేవా చేశారు. విద్యాశాఖ పనితీరు డీఎస్సీ నిర్వహణతో మరోసారి బట్టబయలైందని బొత్స విమర్శించారు. పాఠశాలలు ప్రారంభమైనప్పటికీ విద్యార్థులకు యూనిఫారాలు, పుస్తకాలు, బ్యాగులు వంటి కిట్లు అందుబాటులో లేవని పేర్కొన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఛాలెంజ్‌ల గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. డీఎస్సీ నిర్వహణలోనూ అక్రమాలు చోటుచేసుకున్నాయని ఆరోపించారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లేవని, మామిడి, పొగాకు, మిర్చి రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. ఆక్వా రంగంలోనూ రైతులు సమస్యలతో రోడ్డెక్కి "ఛలో అమరావతి" కార్యక్రమాలకు దిగడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని పేర్కొన్నారు.



విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మద్దతు ఇచ్చిందన్న బీజేపీ నేతల వ్యాఖ్యలను బొత్స ఖండించారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి హయాంలోనే ప్రైవేటీకరణను అడ్డుకున్నారని, కేంద్ర మంత్రి హెచ్.డి. కుమారస్వామి చేసిన వ్యాఖ్యలే దీనికి నిదర్శనమని పేర్కొన్నారు. గత రెండేళ్లలో స్టీల్ ప్లాంట్‌లో చోటుచేసుకున్న వరుస ప్రమాదాలపై వైఎస్సార్‌సీపీ తరఫున సీఎండీని కలిసి సమగ్ర విచారణ కోరనున్నట్లు వెల్లడించారు. కరెంటు ఛార్జీలు, పెట్రోల్, డీజిల్ ధరలను పెంచి ప్రజలపై తీవ్ర భారం మోపారని ఆరోపించారు. భారీగా అప్పులు చేసినప్పటికీ ఫీజు రీయింబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ వంటి సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. మహిళా రిజర్వేషన్‌పై హామీలు ఇచ్చిన కూటమి, రాజ్యసభ అభ్యర్థుల ఎంపికలో మహిళలకు ప్రాధాన్యం ఇవ్వలేదని బొత్స విమర్శించారు. బీచ్‌లలో మద్యం విక్రయాలను ప్రోత్సహించడం ద్వారా పర్యాటక అభివృద్ధి సాధ్యం కాదని, రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలను దెబ్బతీసే విధానాలను ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని అన్నారు. మిగిలిన మూడేళ్ల పాలనలో అయినా ప్రజలకు వెన్నుపోట్లు లేకుండా పరిపాలన సాగించాలని కూటమి ప్రభుత్వానికి బొత్స సత్యనారాయణ సూచించారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కేకే రాజు, గుడివాడ అమర్నాద్ , మొల్లి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర సంగీత నాటక అకాడమీ పురస్కారం సందర్భంగా గవర్నర్‌కు గుమ్మడి గోపాలకృష్ణ కృతజ్ఞతలు



సాక్ష్యం , విశాఖపట్నం
ప్రతిష్టాత్మక కేంద్ర సంగీత నాటక అకాడమీ పురస్కారం అందుకున్న సందర్భంగా తన సేవలను ప్రశంసిస్తూ గౌరవపూర్వకంగా ప్రస్తావించిన రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్‌కు ఆంధ్రప్రదేశ్ నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. శనివారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, పద్యనాటక రంగానికి తాను చేసిన సేవలను గుర్తించి, తెలుగు శాస్త్రీయ నాటక సంప్రదాయ పరిరక్షణకు, ప్రోత్సాహానికి అవసరమైన ప్రేరణను అందించినందుకు గవర్నర్‌కు వినమ్ర ప్రణామాలు తెలియజేశారు. కేంద్ర సంగీత నాటక అకాడమీ పురస్కారం తనకు లభించడం వ్యక్తిగత గౌరవం మాత్రమే కాకుండా, తెలుగు పద్యనాటక రంగానికి, కళాకారులకు, నాటకాభిమానులకు దక్కిన గుర్తింపుగా భావిస్తున్నానని పేర్కొన్నారు. ఈ పురస్కారం తెలుగు నాటక రంగం, సంస్కృతి, సాంప్రదాయ కళారూపాల అభివృద్ధికి మరింత అంకితభావంతో సేవలందించేందుకు తనకు కొత్త ఉత్సాహాన్ని, స్ఫూర్తిని ఇచ్చిందన్నారు. తెలుగు నాటక సంప్రదాయ వైభవాన్ని భావితరాలకు చేరవేసేందుకు, యువతలో నాటక కళపై ఆసక్తి పెంపొందించేందుకు రాష్ట్ర నాటక అకాడమీ ద్వారా మరింత కృషి కొనసాగిస్తానని గుమ్మడి గోపాలకృష్ణ తెలిపారు.

## 104 పరుగుల తేడాతో భీమవరం బుల్స్ భారీ విజయం

సాక్ష్యం , విశాఖపట్నం
ఏసీఏ-వీడీసీఏ క్రికెట్ స్టేడియంలో జరుగుతున్న ఏపీఎల్-2026 సీజన్-5లో భాగంగా శనివారం జరిగిన తొలి మ్యాచ్‌లో భీమవరం




బుల్స్ జట్టు 104 పరుగుల భారీ తేడాతో సింహాద్రి వైజాగ్ లయన్స్‌పై ఘన విజయం సాధించింది. టాస్ గెలిచిన వైజాగ్ జట్టు ఫీల్డింగ్ ఎంచుకోగా, తొలుత బ్యాటింగ్ చేసిన భీమవరం బుల్స్ నిర్ణీత 20 ఓవర్లలో 219 పరుగుల భారీ స్కోరు నమోదు చేసింది. ఓపెనర్ రేవంత్ రెడ్డి 34 బంతుల్లో 58 పరుగులు చేసి జట్టుకు శుభారంభం అందించగా, మిడిల్ ఆర్డర్ బ్యాటర్ బి. సాత్విక్ 29 బంతుల్లో 63 పరుగులు సాధించి ఎనిమిది సిక్సర్లతో మెరుపు ఇన్నింగ్స్ ఆడాడు. వైజాగ్ బౌలర్లలో విజయ్, వినయ్ చెరో రెండు వికెట్లు తీశారు.
220 పరుగుల విజయలక్ష్యంతో బరిలోకి దిగిన సింహాద్రి వైజాగ్ లయన్స్ జట్టు ఏ దశలోనూ ప్రభావం చూపలేకపోయింది. మహిప్ కుమార్ 24 బంతుల్లో 36 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలవగా, మిగిలిన బ్యాటర్లు విఫలమయ్యారు. దీంతో ఆ జట్టు 17.5 ఓవర్లలో 115 పరుగులకు ఆలౌట్ అయింది. బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో సమష్టిగా రాణించిన భీమవరం బుల్స్ జట్టు ఏకపక్ష విజయాన్ని నమోదు చేసింది. మరోవైపు, ఈ సీజన్‌లో ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ ఓటమి పాలైన సింహాద్రి వైజాగ్ లయన్స్ ఇంకా విజయ ఖాతా తెరవలేకపోయింది. మ్యాచ్‌లో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన భీమవరం బుల్స్ ఆటగాడు బి. యశ్వంత్‌కు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కింది.

## రెండేళ్లలో ఆరోగ్యశాఖలో గణనీయమైన ప్రగతి


విజయవాడ,జూన్ 13: అన్ని ప్రాంతాల్లో అభివృద్ధి, అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలను కూటమి ప్రభుత్వం అందిస్తోందని మంత్రి సత్యకుమార్ వెల్లడించారు. రెండేళ్లలో ఆరోగ్య శాఖ పరంగా చేసిన అభివృద్ధి, ప్రణాళికలను ప్రజలకు చెబుతున్నామని తెలిపారు. అన్ని వర్గాలకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. శనివారం మంత్రి మీడియాతో మాట్లాడుతూ.. నేడు ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే వారి సంఖ్య గణనీయంగా పెరిగిందన్నారు. మంచి సేవలు అందుతున్నాయని ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. ఇది తాము చెబుతున్న మాటలు కాదని.. గణాంకాలే తమ పని తీరును చెబుతున్నాయని మంత్రి సత్యకుమార్ పేర్కొన్నారు. తిరుపతిలో జరిగిన బహిరంగ సభలో ఇదే విషయాన్ని సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చెప్పారన్నారు. ఓపీ సేవల నుంచి వైద్య సేవల వరకు అన్నింటిలో సరికొత్త మార్పులు తెచ్చామని తెలిపారు. ఎవరు ఆస్పత్రికి వచ్చినా ఆ రికార్డును డిజిటల్ చేశామన్నారు. రెండేళ్లలో హెల్త్ సెక్టార్‌లో గణనీయమైన మార్పులు తెచ్చామని మంత్రి తెలిపారు. ప్రజలు ఈ సేవల ద్వారా సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని గొప్పగా చెబుతున్నామన్నారు. ఇందుకు సహకారం అందజేసిన అధికారులందరికీ ధన్యవాదాలు తెలియజేశారు. ఆరోగ్య శాఖలో కిందిస్థాయి నుంచి పై స్థాయి వరకు పని చేస్తున్న అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. నేడు ప్రజల్లో సంతృప్తికరమైన వాతావరణం నెలకొల్పామన్నారు. స్వర్ణాంధ్ర 2047 లక్ష్యంగా ఆరోగ్యాంధ్రప్రదేశ్ కీలక భూమిక పోషిస్తోందని తెలిపారు. తమకు అన్ని విధాలా సహకారం అందిస్తున్న సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు తెలియజేశారు. ఏపీలో బాధ్యతతో మెలిగే ప్రతిపక్షం లేదని.. గత ఐదేళ్ల కాలంలో జగన్ ఆరోగ్య శాఖను అనారోగ్య శాఖగా మార్చారని విమర్శించారు. అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేయడం వల్ల తాము చాలా సమర్థనీయంగా పని చేశామన్నారు. తమకు ఛాలెంజింగ్ పని అప్పగించిన జగన్‌కు కూడా ధన్యవాదాలు అని అన్నారు. ÷లిడు ఆరోగ్య శాఖలో అనేక సంస్కరణలను సీఎం చంద్రబాబు తీసుకువచ్చారని మంత్రి తెలిపారు. రియాక్టివ్, క్యూరేటివ్ స్థాయి నుంచి ప్రిడెక్టీవ్ విధానాన్ని తీసుకువచ్చినట్లు తెలిపారు. ప్రజల వద్దకే వెళ్లి 45 రకాల వైద్య పరీక్షలు ఉచితంగా చేయిస్తున్నామన్నారు. ముందుగానే వారి సమస్యలను గుర్తించి అవసరమైన మందులు అందిస్తున్నామని తెలిపారు. టెలిమెడిసిన్ ద్వారా ప్రజలకు ఉన్న సందేహాలను వైద్యుల ద్వారా సమాధానాలు ఇప్పిస్తున్నామని చెప్పారు. మీడియా కూడా తమ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించినట్లు తెలిపారు. ఎక్కడా ఎటువంటి సమస్య ఉన్నా... తమ దృష్టికి తెచ్చి పరిష్కారం అయ్యేలా చేశారన్నారు.

# హైదరాబాద్‌లో భారీ వర్షం

మొదటిపేజీ తరువాయి..

ఇబ్బందులు పడ్డారు. భారీ వర్షాలు వల్ల జరిగిన దర్ఘటనల్లో పలువురు మృతిచెందారు. సికింద్రాబాద్‌లోని అల్వాల్‌లో భారీ వర్షం కారణంగా విద్యుత్ షాక్‌కు గురై తండ్రి, కూతురు మృతి చెందారు. టెలికాం కాలనీకి చెందిన సందీప్ సాయి ఇంటి ఎదురుగా ఉన్న భారీ చెట్టు, వర్షానికి విరిగి కారుపై పడింది. వర్షం తగ్గిన తర్వాత చెట్టు కొమ్మలను తొలగించేందుకు సందీప్, ఆయన భార్య శ్వేత, కుమార్తె రితిక కారువద్దకు వెళ్లారు. చెట్టు కొమ్మల మధ్య ఉన్న విద్యుత్ తీగలను వారు గమనించకపోవడంతో అవి తగిలి ఇరువురు అక్కడికక్కడే మృతి చెందారు. శ్వేతకు కూడా షాక్ తగిలినప్పటికీ స్వల్ప గాయాలతో బయటపడ్డారు. రంగారెడ్డి జిల్లా మీర్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో భారీ ఈదురు గాలుల కారణంగా తాటి చెట్టు ఇంటిపై పడి ఓ మహిళ ప్రాణాలు కోల్పోయింది. రాఘవేంద్ర నగర్ కాలనీకి చెందిన సభావత్ లక్ష్మి ఆమె కుమారుడు వెంకట్, కోడలు లలిత రేకుల ఇంట్లో నిద్రిస్తుండగా ఈదురుగాలులకు చెట్టు ఇంటిపై పడింది. ప్రమాదంలో వెంకట్, లలిత స్వల్ప గాయాలతో బయటపడగా తీవ్రంగా గాయపడిన లక్ష్మిని స్థానికులు వెంటనే ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆమె మృతి చెందారు.నైరుతి రుతుపవనాల రాకతో హైదరాబాద్ సహా పలు జిల్లాల్లో భారీ వర్షం కురిసింది. జోరు వాన ఈదురు గాలులు కారణంగా శంషాబాద్ విమానాశ్రయంలో విమాన రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ప్రతికూల వాతావరణం వల్ల 9 విమానాలను అధికారులు దారిమళ్లించారు. రంగారెడ్డి జిల్లా చేవెళ్లలో అర్ధరాత్రి కురిసిన భారీ వర్షంతో దేవరంపల్లిలోని ఈసీ వాగు పొంగిపొర్లుతోంది. వికారాబాద్ రంగారెడ్డి జిల్లాల్లో జోరు వాన కారణంగా రైతులంతా పంట సాగుకు సిద్ధమయ్యారు.సకాలంలో వానలు పడటంతో అన్నదాతలు విత్తనాలను నాటడం ప్రారంభించారు. మెదక్ జిల్లాలో కురిసిన భారీ వర్షాల కారణంగా పలు ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తూకం వేసి నిల్వ ఉంచిన బస్తాలు తడిసి ముద్దయ్యాయి. చిన్న శంకరంపేట్ మండలం కామారంలోని కొనుగోలు కేంద్రంలో 2 లారీల ధాన్యం వర్షానికి తడిసిపోగా కొల్చారం మండలం కొంగోడు కొనుగోలు కేంద్రంలో తూకం వేసిన 3 లారీల ధాన్యం వర్షానికి తడిసింది. వడ్ల దెబ్బతింటాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నతాధికారులను అప్రమత్తం చేశారు. ముఖ్యంగా హైదరాబాద్ కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ పరిధిలో 'హై అలర్ట్' ప్రకటించాలని, ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించాలని ఆదేశించారు. వర్షాల వల్ల నగరవాసులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా యుద్ధ ప్రాతిపదికన సత్వర చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. వాతావరణ శాఖ అందించే వర్ష సూచన



వివరాల ఆధారంగా అధికారులు ముందస్తు ప్రణాళికలతో సిద్ధం కావాలని సీఎం సూచించారు. నగరంలో సాధారణంగా రోడ్లపై నీరు నిలిచే ప్రాంతాలు, లోతట్టు, సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి, అక్కడ ముందస్తుగానే అత్యవసర బృందాలను మోహరించాలని ఆదేశించారు. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో ప్రజలకు ఇబ్బంది కలగకుండా ఉండాలంటే వివిధ ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం అత్యంత కీలకమని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. పోలీస్, ట్రాఫిక్ పోలీస్, మున్సిపల్, హైడ్రా, విద్యుత్ శాఖ, వాటర్ బోర్డ్ సహా ఇతర అన్ని సంబంధిత శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో ఒకరితో ఒకరు సమన్వయం చేసుకుంటూ పనిచేయాలన్నారు. ఈ క్రమంలోనే చీఫ్ సెక్రటరీ, డీజీపీ, స్పెషల్ సీఎస్‌లతో పాటు నగరానికి చెందిన సీనియర్ అధికారులందరితో యుద్ధ ప్రాతిపదికన సమీక్షలు నిర్వహించి, తక్షణ రక్షణ చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యంగా ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూడటం, విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడంపై ప్రత్యేక దృష్టి సారించాలని స్పష్టం చేశారు.

## వరంగల్‌లో ఎస్‌బీఐ ఆధ్వర్యంలో సైబర్ ఫ్రాడ్ అవగాహన కార్యక్రమం

వరంగల్, సాక్ష్యం:
పెరుగుతున్న సైబర్ మోసాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (SBI) ఆధ్వర్యంలో ఈ రోజు సుబేదారి ఆర్ట్స్ కాలేజ్ గ్రౌండ్, వరంగల్ మరియు పబ్లిక్ గార్డెన్, హనుమకొండలో సైబర్ ఫ్రాడ్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రజలకు సురక్షితమైన డిజిటల్ వాతావరణాన్ని కల్పించాలనే ఉద్దేశంతో ఎస్‌బీఐ గత రెండు సంవత్సరాలుగా ప్రాంతవ్యాప్తంగా ఇలాంటి సైబర్ భద్రతా అవగాహన కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శ్రీ ఘనశ్యామ్ సోలంకి, డిప్యూటీ జనరల్ మేనేజర్ (అడ్మినిస్ట్రేటివ్ ఆఫీస్, వరంగల్) మరియు శ్రీ బండి మురళీ మోహన్ కృష్ణ, రీజినల్ మేనేజర్ (వరంగల్ అర్బన్) హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి స్థానిక శాఖల నుండి 49 మంది బ్రాంచ్ మేనేజర్లు మరియు 120 మంది సిబ్బంది పాల్గొని తమ సహకారం అందించారు. కార్యక్రమంలో భాగంగా సైబర్ మోసాలకు సంబంధించిన అవగాహన వీడియోలను ప్రదర్శించారు. అలాగే సైబర్ భద్రతకు సంబంధించిన




సమాచార బ్యానర్లను ఏర్పాటు చేసి ప్రజలకు అవగాహన కల్పించారు. ఆన్‌లైన్ మోసాల రకాలు, వాటిని నివారించే మార్గాలు, డిజిటల్ బ్యాంకింగ్ సేవలను వినియోగించే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరించారు. సైబర్ మోసానికి గురైన వెంటనే మొదటి గంటలోనే 1930 సైబర్ హెల్ప్‌లైన్ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని అధికారులు ప్రజలకు సూచించారు. త్వరితగతిన ఫిర్యాదు చేయడం ద్వారా కోల్పోయిన నగదును తిరిగి పొందే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని తెలిపారు. బ్యాంక్ పాస్‌వర్డ్‌లు, ఓటీపీలు, ఏటీఎం వివరాలు, వ్యక్తిగత లేదా ఆర్థిక సమాచారాన్ని ఎవరికీ పంచుకోవద్దని ప్రజలకు సూచించారు. అనుమానాస్పద కాల్స్, మెసేజ్‌లు, లింక్‌ల పట్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమానికి ప్రజల నుండి మంచి స్పందన లభించింది. సురక్షితమైన మరియు భద్రమైన డిజిటల్ బ్యాంకింగ్ విధానాలను ప్రోత్సహించేందుకు ఎస్‌బీఐ భవిష్యత్తులో కూడా ఇలాంటి అవగాహన కార్యక్రమాలను కొనసాగిస్తుందని అధికారులు తెలిపారు.

## మహిళలను కించపర్చేలా వ్యాఖ్యలు

### షబ్బీర్ అలీకి ఏఐసీసీ షోకాజ్ నోటీస్

హైదరాబాద్,జూన్13(సాక్ష్యం): కాంగ్రెస్ పార్టీలో అంతర్గత వివాదం మళ్లీ తెరపైకి వచ్చింది. కాంగ్రెస్ సీనియర్ నేత షబ్బీర్ అలీపై ఏఐసీసీ సీరియస్‌గా స్పందించింది. మహిళలను కించపరిచేలా వ్యాఖ్యలు చేసినట్లు ఆయనపై ఆరోపణలు వచ్చిన ఆడియో క్లిప్ వైరల్ కావడంతో పార్టీ హై కమాండ్ చర్యలకు దిగింది. ఈ వైరల్ అయిన ఆడియోలో షబ్బీర్ అలీ, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ చీఫ్ బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్‌తో పాటు మహిళలపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఈ ఆడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో కాంగ్రెస్ పెద్దలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ఏఐసీసీ క్రమశిక్షణ కమిటీ షబ్బీర్ అలీకి షోకాజ్ నోటీసులు జారీ చేసింది. పార్టీ ప్రతిష్ఠకు భంగం కలిగించేలా ఆయన ఈ వ్యాఖ్యలు చేయడంపై వివరణ ఇవ్వాలని హుకుం జారీ చేసింది. పార్టీ అంతర్గత వ్యవహారాలను పబ్లిక్‌లో చర్చకు తీసుకురావడంపై కూడా ఏఐసీసీ అసంతృప్తి వ్యక్తం చేసింది. మరోవైపు.. కామారెడ్డి కాంగ్రెస్‌లో వర్గపోరు మరింత ముదురుతున్నట్లు తెలుస్తోంది. షబ్బీర్ అలీ వర్గం, చంద్రశేఖర్ రెడ్డి వర్గం మధ్య విభేదాలు తీవ్రస్థాయికి చేరుకున్నాయి. అదే సమయంలో సొంత పార్టీ నేతలపై విమర్శలు, దుష్ప్రచారం జరుగుతోందని ఆరోపిస్తూ మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తనపై తప్పుడు ప్రచారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. ఈ పరిణామాలతో కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ రాజకీయాలు మరింత వేడెక్కాయి. పార్టీ క్రమశిక్షణ చర్యలు, వర్గపోరు, పరస్పర ఆరోపణలతో స్థానిక కాంగ్రెస్‌లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

## అభిషేక్ బెనర్జీ నివాసంలో పోలీసుల తనిఖీలు

### తాళం పగులగొట్టి సోదాలు చేశారని టిఎంసి ఆరోపణ

కోల్‌కతా,జూన్13(సాక్ష్యం): తృణమూల్ కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీ నివాసంలో పోలీసులు శుక్రవారం రాత్రి తనిఖీలు చేపట్టారు. అభిషేక్ బెనర్జీ వ్యక్తిగత సహాయకుడు సుమిత్ రాయ్ కోసం గాలిస్తున్న పోలీసులు కాళీఘాట్‌లోని అభిషేక్ నివాసానికి వెళ్లి తాళం పగులగొట్టి లోనికి ప్రవేశించినట్లు టీఎంసీ వర్గాలు తెలిపాయి. సోదాల అనంతరం పోలీస్ టీమ్ అక్కడి నుంచి వెళ్లిపోయింది. విషయం తెలిసిన పార్టీ అధినేత్రి మమతా బెనర్జీ అక్కడకు చేరుకున్నారు. ఎన్నికల్లో పార్టీ టిక్కెట్లు ఆశచూపి కొందరి నుంచి సుమిత్ రాయ్ డబ్బులు వసూలు చేశారనే ఆరోపణలకు సంబంధించి కోల్‌కతా పోలీసులు ఈ సోదాలు జరిపినట్టు చెబుతున్నారు. పోలీసుల తనిఖీలపై అభిషేక్ బెనర్జీ మండిపడ్డారు. పోలీసులు వచ్చినప్పుడు తన ఇంటికి తాళం వేసి ఉందని, తాళాలు పగులగొట్టి మరీ సోదాలు జరిపారని చెప్పారు. 'నా ఇల్లు మొత్తం గాలించారు. ఆయనను (సుమిత్ రాయ్) నేను దాచిపెట్టానో లేదో దర్యాప్తు ఏజెన్సీని అడగండి' అని మీడియాతో మాట్లాడుతూ అన్నారు. దీనికి ముందు శుక్రవారంనాడు అభిషేక్ బెనర్జీకి సీఐడీ నోటీసులు ఇచ్చింది. ఎన్నికల ప్రచారంలో రెచ్చగొట్టే ప్రకటనలు చేసిన ఆరోపణలపై జూన్ 16న తమ ముందు హాజరుకావాలని ఆ నోటీసులో పేర్కొంది. నేరుగా నోటీసులు అందజేసేందుకు అభిషేక్ నివాసానికి సీఐడీ టీమ్ వెళ్లింది. అయితే ఆ సమయంలో ఆయన అక్కడ లేకపోవడంతో సుమారు రెండు గంటల వేచి చూసిన అధికారులు కార్యాలయంలోని ఉద్యోగులకు నోటీసు అందజేసి వెళ్లిపోయారు. అభిషేక్ వ్యాఖ్యలపై బాగుయాటి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు నమోదు కావడంతో సైబర్ క్రైమ్ పోలీసులు తొలుత విచారణ జరిపారు. అనంతరం కేసును సీఐడీకి అప్పగించారు.

## యూరియా యాప్‌కు వ్యతిరేకంగా ధర్నా

నిజామాబాద్,జూన్13(సాక్ష్యం): యూరియా యాప్ బంద్ చేయాలని డిమాండ్ చేస్తూ మోర్తాడ్ మండలంలోని ధర్మోరా గ్రామంలో రైతులు శనివారం ఆందోళన చేపట్టారు. ధర్మోరా గ్రామంలోని వ్యవసాయ గిడ్డంగికి తాళం వేసి, గిడ్డంగి ముందు టెంట్ వేసుకుని 2గంటల పాటు ధర్నా నిర్వహించారు. తమ గ్రామంలోని గిడ్డంగిలో యూరియా ఉన్నా యాప్ లో తమకు బుక్ కాకుండా ఇతర గ్రామాల్లోని రైతులకు బుక్ అవుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.యాప్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సంఘటన స్థలానికి చేరుకున్న వ్యవసాయ అధికారి హరీష్ గిడ్డంగి కి వేసిన తాళం తీయాలని కోరగా రైతులు అందుకు అంగీకరించలేదు. తమ గ్రామంలో ఉన్న యూరియా సంచులు తమకే ఇవ్వాలని లేదంటే గిడ్డంగి తాళాలు తీసేదే లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

## తెలంగాణ ఆర్థిక వ్యవస్థకు గుండెకాయ సింగరేణి

మొదటిపేజీ తరువాయి..

క్రమశిక్షణతో పనిచేసి సింగరేణి పురోభివృద్ధికి తోడ్పడాలని పిలుపునిచ్చారు. మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. సింగరేణిని మరింత లాభాల బాటలో నడిపించేందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వాడుకుంటూనే, స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెంచుతామని హామీ ఇచ్చారు. మంత్రి



పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ కార్మిక కుటుంబాల హక్కులను కాపాడటంలో ప్రభుత్వం ఎల్లప్పుడూ ముందుంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న (చింతపండు వితల్), స్థానిక ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, ఎమ్మెల్యేలు మకాన్ సింగ్ రాజ్ ఠాకూర్, గడ్డం వినోద్, గండ్ర సత్యనారాయణతో పాటు సింగరేణి ఉన్నతాధికారులు, కార్మిక సంఘాల నాయకులు, కార్మిక కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## గడువుకు ముందే పంజాబ్ ఎన్నికలు

### పార్టీ కార్యాకర్తలు ప్రచారంలోకి దిగండి
### నవంబర్‌లోనే ఎన్నికలు జరిగే ఛాన్స్
### ఆప్ జాతీయ కన్వీనర్ కేజ్రీవాల్ సంకేతాలు

చండీగఢ్,జూన్13(సాక్ష్యం): పంజాబ్ అసెంబ్లీ ఎన్నికలు గడువు కంటే ముందుగానే జరిగే అవకాశం ఉందని ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్, ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ సంకేతాలిచ్చారు. 2027 ఫిబ్రవరిలో ఎన్నికలు జరగాల్సి ఉండగా, 2026 నవంబర్‌లోనే ఎన్నికలు జరగవచ్చని అన్నారు. 'ఆప్' ముఖ్యమంత్రి అభ్యర్థిగా భగవంత్ మాన్ కొనసాగుతారని ప్రకటించారు. బటిండాలో శనివారంనాడు జరిగిన రోడ్‌షోలో కేజ్రీవాల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పార్టీ కార్యకర్తలు తక్షణం ఎన్నికల ప్రచారానికి సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. ముందస్తు ఎన్నికలకు కారణాలను మాత్రం ఆయన వెల్లడించలేదు. ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో పార్టీకి మద్దతుగా నిలిచిన ఓటర్లకు కేజ్రీవాల్ కృతజ్ఞతలు తెలిపారు. బర్నాలా, మోగా, బటాలా, బటిండా మున్సిపల్ కార్పొరేషన్లకు మేయర్లుగా ఆప్ కౌన్సిలర్లు ఎన్నికయ్యారని, పార్టీ పాలనపై ప్రజలకున్న నమ్మకాన్ని ఇది ప్రతిబింబిస్తోందని అన్నారు. ఆమ్ ఆద్మీ పార్టీ తరపున ముఖ్యమంత్రి అభ్యర్థిగా భగవంత్ మాన్ కొనసాగుతారని, మరోసారి మాన్ సీఎం అయ్యేందుకు పార్టీ కార్యకర్తలందరూ కృషి చేయాలని



కేజ్రీవాల్ కోరారు. గత నాలుగేళ్లుగా పంజాబ్ ప్రభుత్వం ప్రజల నమ్మకాన్ని, మద్దతును సాధించిందని అన్నారు. పార్టీల పేరు చెప్పకుండా విపక్షాలపై కేజ్రీవాల్ విమర్శలు గుప్పించారు. ఒకటి 'చిట్టా పార్టీ', మరొకటి 'ఫైటింగ్ పార్టీ', మూడో పార్టీ 'ఈడీ పార్టీ' అని అభివర్ణించారు. డ్రగ్స్ సమస్యలు, అంతర్గత పోరాటాలు, సెంట్రల్ ఏజెన్సీలతో ప్రత్యర్థులను భయపెట్టే పార్టీలుగా వారిని పోల్చారు. ప్రజాసంక్షేమ, అభివృద్ధి కోసం పని చేసే పార్టీ ఆప్ మాత్రమేనని, పంజాబ్ నేతల్లో అత్యంత నిజాయితీ కలిగిన ముఖ్యమంత్రుల్లో భగవంత్ మాన్ ఒకరని ప్రశంసించారు. గత ప్రభుత్వాలు అవినీతి, కుంభకోణాల ఆరోపణలు ఎదుర్కొన్నాయని, మాన్ హయాంలో అలాంటి ఆరోపణలు ఒక్కటి కూడా లేవని అన్నారు. ఏవైనా తప్పులు చేసి ఉంటే ఈడీ, సీబీఐ చర్య తీసుకుని ఉండేవని అన్నారు. పంజాబ్‌లో పలు సంక్షేమ పథకాలను ఆప్ అమలు చేస్తోందని, ఉచిత విద్యుత్, రూ.10 లక్షల వరకూ ఆరోగ్య బీమా ప్రజలకు అందిస్తోందని కేజ్రీవాల్ గుర్తుచేశారు. జూలై నుంచి అర్హత కలిగిన మహిళలకు ప్రతినెలా రూ.1,000 ఆర్థిక సాయం అందిస్తామని ప్రకటించారు. షెడ్యూల్డ్ కులాల మహిళలకు రూ.1,500 చొప్పున ఇస్తామని తెలిపారు. కేజ్రీవాల్ రోడ్‌షోలో పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్, ఆప్ సీనియర్ నేత మనీష్ సిసోడియా, పంజాబ్ ఆప్ అధ్యక్షుడు అమన్ అరోరా పాల్గొన్నారు.

## ఫ్రాన్స్‌లో భేటీ కానున్న మోదీ, ట్రంప్

మొదటిపేజీ తరువాయి..

అత్యంత సున్నితమైన తరుణంలో ఈ సమావేశం జరుగుతోంది. వాణిజ్యం, ఇంధన సహకారం, హెచ్-1బీ వీసా విధానాలు, ప్రాంతీయ భద్రత, పశ్చిమ ఆసియాలో మారుతున్న పరిస్థితులపై ఇరు దేశాల నాయకులు చర్చించే అవకాశం ఉంది. ఒమన్ గల్ఫ్‌లో భారతీయ నావికులను తీసుకువెళ్తున్న వాణిజ్య నౌకలపై అమెరికా సైనిక దాడుల పరంపరకు నిరసనగా భారత్ వాషింగ్టన్‌కు తీవ్ర నిరసన తెలిపిన కొద్ది రోజులకే ఈ చర్చలు జరగనున్నాయి. పలావు జెండా కలిగిన సెట్టైబెల్లో ట్యాంకర్‌పై జరిగిన దాడిలో ముగ్గురు భారతీయ నావికులు మరణించగా, భారతీయ సిబ్బంది ఉన్న మరో రెండు నౌకలు కూడా వేర్వేరు ఘటనల్లో లక్ష్యం అయ్యాయి. తమ ఆందోళనలను తెలియజేయడానికి భారత్ వారం రోజుల్లో రెండుసార్లు యూఎస్ ఛార్జ్ డి అఫైర్స్‌ను పిలిపించి, పౌర నౌకలపై దాడులను తక్షణమే నిలిపివేయాలని పిలుపునిచ్చింది. తాత్కాలిక వాణిజ్య ఒప్పందంపై రెండు దేశాలు చర్చలు కొనసాగిస్తున్నందున, వాణిజ్యం అజెండాలో ప్రధానంగా ఉండే అవకాశం ఉంది. కొన్ని ఎగుమతులపై యూఎస్ సుంకాల నుంచి ఉపశమనం కోరుతున్న భారత్, మార్కెట్ ప్రవేశం, కార్మిక సంబంధిత సమస్యలపై ఆందోళన వ్యక్తం చేసింది. అమెరికాలో పనిచేస్తున్న భారతీయ నిపుణులకు హెచ్-1బి వీసాల ప్రాముఖ్యత దృష్ట్యా, వాటిపై కూడా చర్చలు జరిగే అవకాశం ఉంది. ఇరాన్‌తో ఉద్రిక్తతలు, హార్ముజ్ జలసంధి చుట్టూ ఉన్న అంతరాయాల కారణంగా ప్రపంచ చమురు మార్కెట్లు అస్థిరంగా ఉన్నందున, ఇంధన సహకారం మరో ప్రధాన చర్చనీయాంశంగా మారవచ్చు.ఏప్రిల్ నుంచి చాలావరకు కొనసాగుతున్న కాల్పుల విరమణను పొడిగించే లక్ష్యంతో యూఎస్-ఇరాన్ చర్చలు జరుగుతున్న తరుణంలో ఈ సమావేశం జరుగుతోంది. ఆంక్షల సడలింపు, అణు సమస్యలు, హార్ముజ్ జలసంధి భవిష్యత్తుపై విభేదాలు ఉన్నప్పటికీ, ఒక విస్తృత ఒప్పందం త్వరలోనే కుదిరే అవకాశం ఉందని వాషింగ్టన్, ఇరాన్ రెండూ సంకేతాలు ఇచ్చాయి. భారతదేశానికి, గల్ఫ్ గుండా వెళ్లే నౌకా మార్గాల భద్రత ఒక అత్యవసర ఆందోళనగా మారింది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న నౌకాదళాలలో 3 లక్షలకు పైగా భారతీయ నావికులు పనిచేస్తున్నారు. ఈ ప్రాంతంలో ఉద్రిక్తతలు మరింత పెరగకుండా నిరోధించడానికి చర్చలు, దౌత్యం అవసరమని న్యూఢిల్లీ పదేపదే నొక్కి చెప్పింది. ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ ఆహ్వానం మేరకు ప్రధానమంత్రి మోదీ జూన్ 15 నుండి 17 వరకు ఫ్రాన్స్‌లోని ఎవియాన్-లెస్-బైన్స్‌లో జరిగే జీ7 శిఖరాగ్ర సమావేశానికి హాజరవుతున్నారు. గ్లోబల్ సౌత్‌లో భారతదేశం ఒక ప్రముఖ గొంతుకగా తనను తాను నిలబెట్టుకుంటున్న తరుణంలో, ఈ శిఖరాగ్ర సమావేశంలో ఆయన వరుసగా ఏడవసారి పాల్గొంటున్నారు.

భారత ప్రధాని నరేంద్ర మోదీ విదేశీ పర్యటనకు బయల్దేరారు. ఫ్రాన్స్, స్లోవేకియాలలో మోదీ పర్యటిస్తారు. ఈ సందర్భంగా ఆయా దేశాలతో ద్వైపాక్షిక, వాణిజ్య, వ్యాపార సంబంధాలపై చర్చలు జరపడంతోపాటు ఫ్రాన్స్‌లో జరిగే జీ7 దేశాల సదస్సులో కడా పాల్గొంటారు. ఈ సదస్సులో వివిధ దేశాధినేతలతో సమావేశమవుతారు. ఇందుకోసం న్యూఢిల్లీ ఎయిర్‌పోర్ట్ నుంచి శనివారం ప్రధాని ప్రత్యేక విమానంలో బయల్దేరి వెళ్లారు. 1993 తర్వాత భారత ప్రధాని స్లోవేకియాలో పర్యటించనుండటం ఇదే మొదటిసారి. 14, 15 తేదీల్లో మోదీ స్లోవేకియాలో పర్యటిస్తారు. అక్కడి అధ్యక్షుడు పీటర్ పెల్లెగ్రినితోపాటు ప్రధాని రాబర్ట్ ఫికోతో సమావేశమవుతారు. ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలపై చర్చించి, పలు ఒప్పందాలు కుదుర్చుకుంటారు. అనంతరం ఫ్రాన్స్ చేరుకుంటారు. 16, 17 తేదీల్లో ఫ్రాన్స్‌లోని ఈవియన్‌లో ఉంటారు. అక్కడ జరిగే జీ7 దేశాల సదస్సుకు హాజరవుతారు. ఈ సదస్సుకు విదేశీ నేతలు, ప్రతినిధులు హాజరవుతారు. వారితో దక్షిణాది ప్రపంచం గురించి చర్చిస్తామని మోదీ తెలిపారు. అనంతరం 18వ తేదీన ఫ్రాన్స్‌లోని ప్యారిస్‌లో జరిగే వివాటెక్ 2026 సదస్సులో పాల్గొంటారు.

## తృణమూల్ పార్టీలో కొనసాగుతున్న సంక్షోభం

మొదటిపేజీ తరువాయి..

అనంతరం మరో అసమ్మతి ఎంపీ శతాబ్ది రాయ్‌తో కలిసి కేంద్ర మంత్రి భూపేంద్ర యాదవ్‌ను ఆయన నివాసంలో కలిశారు. 19 మంది ఎంపీలతో కలిసి తమను ప్రత్యేక గ్రూపుగా గుర్తించాలని కోరేందుకు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను సోమవారంనాడు కలుసుకోనున్నట్టు రెబల్స్ గ్రూప్ ప్రకటించిన నేపథ్యంలో సుదీప్ బందోపాధ్యాయ్ ఆ గ్రూపులో కలవడం ప్రాధాన్యం సంతరించుకుంది. జూన్ 8 నుంచి టీఎంసీ అసమ్మతి ఎంపీల సంతకాల సేకరణ చేపట్టామని, 19 ఎంపీలు సంతకాలు చేశారని రెబల్ ఎంపీ చంద్ర బర్మ బసునియా వెల్లడించారు. ఇప్పటికే ఒకసారి స్పీకర్‌ను కలిసిన తాము ఈనెల 15న మరోసారి కలిసి తమ గ్రూపునే నిజమైన టీఎంసీగా గుర్తించాలని కోరనున్నట్టు చెప్పారు. ఓంబిర్లాను కలవడానికి ముందు టీఎంసీ రెబల్స్ న్యూఢిల్లీలో సమావేశం అవుతారని,



అందులో పాల్గొనేందుకు 20 మంది ఎంపీలు న్యూఢిల్లీ చేరుకుంటారని అసమ్మతి వర్గ నేత ఒకరు చెప్పారు. కాగా, తిరుగుబాటు వర్గం వాదనను టీఎంసీ తోసిపుచ్చింది. వారి వాదనకు ఎలాంటి చట్టబద్ధత లేదని పార్టీ ఎంపీ మహువా మొయిత్ర తెలిపారు. పార్టీలో చీలిక ప్రొవిజన్‌ను రాజ్యాంగంలోని 91వ సవరణ తొలగించినట్టు చెప్పారు. 19 మంది 'ద్రోహులు' పార్టీకి రాజీనామా చేసి, బీజేపీ టిక్కెట్‌పై పోటీ చేయాలని సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో మహువా మొయిత్ర పేర్కొన్నారు. 'ఆపరేషన్ లోటస్' పేరుతో ఫిరాయింపులకు బీజేపీ వ్యూహరచన చేసిందని, పార్టీని చీల్చాలనే ప్రయత్నం ఏమాత్రం సఫలం కాదని టీఎంసీ మరో ఎంపీ కీర్తి ఆజాద్ అన్నారు. ఇదిలావుంటే టీఎంసీ ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీ ఎవరికీ గౌరవం ఇవ్వడం లేదని, ఆయన కావాలో, తాను కావాలో తేల్చుకోండంటూ పార్టీ అధినేత్రి మమతా బెనర్జీకి అల్టిమేటం ఇచ్చిన ఆ పార్టీ ఎంపీ కల్యాణ్ బెనర్జీ శనివారంనాడు యూటర్న్ తీసుకున్నారు. 'అభిషేక్ నా కొడుకుతో సమానం. పిల్లలు ఏదైనా తప్పు చేస్తే క్షమించే గుణం తండ్రికి ఉంటుంది' అని అన్నారు. సంతకాల ఫోర్జరీ కేసులో అభిషేక్ తరపున కల్యాణ్ బెనర్జీ వాదిస్తున్నారు. ఈ కేసులో అరెస్టు నుంచి అభిషేక్ బెనర్జీకి హైకోర్టు తాత్కాలిక రక్షణ ఇచ్చింది. అయితే ఈ కేసులో కల్యాణ్ బెనర్జీ స్థానంలో మరొక లాయర్ వచ్చి చేరడం ఆయన ఆగ్రహానికి కారణమైంది. అభిషేక్ అహంకారిగా మారిపోయాడని, ఎవరినీ గౌరవించడం లేదని, అభిషేక్ లేకుండా పార్టీ నడవదని మమతా బెనర్జీ భావిస్తే తాను పార్టీ నుంచి తప్పుకుంటానని ఆయన హెచ్చరించారు. దీనిపై అభిషేక్ ఆచితూచి స్పందించారు. కల్యాణ్ బెనర్జీ తనకంటే పెద్దవారని, ఆయన తన అభిప్రాయాలను చెప్పడంలో తప్పులేదని, చిన్నప్పటి నుంచి తనను ఆయన చూశారని, ఆయన గురించి తాను ఏమీ మాట్లాడలేనని అన్నారు. ఈ క్రమంలో అభిషేక్ తన కుమారుడి లాంటివాడని కల్యాణ్ బెనర్జీ ప్రకటించడంతో టీఎంసీ అధినాయకత్వం ఊపిరి పీల్చుకుంది. కాగా, కాంగ్రెస్‌లో టీఎంసీ విలీనం కానుందంటూ కొందరు చేస్తున్న ఊహాగానాలను కల్యాణ్ బెనర్జీ శనివారంనాడు తోసిపుచ్చారు. కాంగ్రెస్‌లో టీఎంసీ కలవబోవడం లేదని చెప్పారు. రెబల్ ఎంపీలు లోక్‌సభ స్పీకర్‌ను కలుస్తారంటూ వస్తున్న వార్తలపై సూచిగా స్పందించారు. 'వాళ్లు ఏమి చేయాలనుకుంటే అది చేయవచ్చు. బీజేపీ గొడుకు కింద పనిచేయాలను కుంటున్నారు. ఇదంతా ఓ కుట్ర. నియోజకవర్గాల అభివృద్ధి కోసమే బీజేపీతో పనిచేయాలనుకుంటున్నట్టు చెబుతున్నారు. తమ నియోజకవర్గాలకు ఒక్కసారి కూడా వెళ్లని వాళ్లు ప్రజలకు చేసేదేముంటుంది? బెంగాల్‌లో ప్రజాస్వామ్యం పీకనొక్కేసారు. గత నెలరోజుల్లో ఎలాంటి అభివృద్ధి చేశారు? మమ్మల్ని బీజేపీ వేధిస్తోంది, పోలీసులు వేధిస్తున్నారు. ఇలాంటి పరిస్థితి గతంలో ఏ విపక్షానికి రాలేదు. 19 మంది ఎంపీలు వెళ్లిపోవాలనుకున్నా వాళ్లను బీజేపీ చేర్చుకోదని కల్యాణ్ బెనర్జీ అన్నారు.

## పాస్ పోర్ట్ సేవల్లో తెలంగాణ పోలీస్ భేష్

### 19న ఢిల్లీలో జైశంకర్ చేతుల మీదుగా అవార్డు

హైదరాబాద్,జూన్13(సాక్ష్యం): పాస్‌పోర్ట్ సేవల్లో తెలంగాణ పోలీసులకు జాతీయ స్థాయి గుర్తింపు లభించింది. దేశంలోనే ఉత్తమ పోలీసు ధ్రువీకరణ సేవలకు గాను 'ఇన్‌స్టిట్యూషనల్ పెర్ఫార్మెన్స్ అవార్డు' వరించింది. 2025-26 సంవత్సరంలో పాస్‌పోర్ట్ వెరిఫికేషన్‌లో అత్యుత్తమ పనితీరుకు గాను తెలంగాణ




పోలీస్ శాఖకు ఈ అవార్డు లభించింది. ఈ మేరకు తెలంగాణ పోలీస్ శాఖను కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖ ఎంపిక చేసింది. ఈ అవార్డును అందుకోవాల్సిందిగా డీజీపీ సీవీ ఆనంద్‌కు విదేశాంగ మంత్రిత్వ శాఖ అధికారిక ఆహ్వానం పంపింది. జూన్ 19న న్యూఢిల్లీలో డీజీపీ ఈ అవార్డును అందుకోనున్నారు. కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్.జయశంకర్ చేతుల మీదుగా పురస్కార ప్రదానం జరుగనుంది. వేగవంతమైన, పారదర్శకమైన పోలీసు ధ్రువీకరణ సేవలకే ఈ గుర్తింపు లభించింది. సాంకేతిక ఆధారిత వెరిఫికేషన్ విధానం.. తెలంగాణ పోలీసులకు జాతీయ ఖ్యాతిని తెచ్చిపెట్టింది. ప్రజా కేంద్రిత సేవలు, సమర్థవంతమైన పనితీరుకు మరో నిదర్శనంగా ఈ అవార్డు నిలిచింది. ఈ ఘనత దేశవ్యాప్తంగా తెలంగాణ పోలీస్ శాఖ ప్రతిష్ఠను మరింత పెంచింది. భవిష్యత్తులో మరింత మెరుగైన సేవలకు ఈ అవార్డు ప్రేరణగా నిలవనుంది.

## ఆర్టీసీ డిపో అభివృద్ధికి ఉద్యోగులందరూ సహకరించాలి

**– ఆర్టీసీ డిపో మేనేజర్ సరస్వతి**

**నర్సంపేట జులై 13 (సాక్ష్యం న్యూస్) :** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ నర్సంపేట డిపోలో నూతనంగా పదవి బాధ్యతలు చేపట్టిన డిపో మేనేజర్ మామిడాల సరస్వతి డిపో ఆవరణలో గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈసందర్భంగా ఉద్యోగులకు పలు సూచనలు చేశారు. నర్సంపేట డిపో అభివృద్ధి, ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించడం మరియు డిపో ఆదాయాన్ని పెంపొందించేందుకు ప్రతి ఉద్యోగి బాధ్యతాయుతంగా పనిచేయాలని ఆర్టీసీ కార్మికులను ఉద్యోగస్తులను కోరారు. డిపో పురోగతికి అందరూ సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం ఉద్యోగులకు వేసవి తాపాన్ని దృష్టిలో ఉంచుకొని మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డిపో అసిస్టెంట్ మేనేజర్ అమృత పాల్గొనగా, డిపో ఉద్యోగులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

### ఖమ్మం ఘటన బాధితురాలిని

## పరామర్శించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



**సికింద్రాబాద్, జూన్ 13 (సాక్ష్యం) :** ఇటీవల ఖమ్మం జిల్లాలో చోటుచేసుకున్న ఘటనలో బాధితురాలిని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పరామర్శించి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చిన ఆయన, తక్షణ సాయంగా రూ.50 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ, అమాయక బాలికపై జరిగిన ఘటన అత్యంత దారుణమైందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి ఘటనలు సమాజంలో పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. నిందితుడిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. బాధితురాలు, ఆమె కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని, ఈ విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి అవసరమైన సహాయ సహకారాలు అందేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేతో పాటు రజక సంఘం స్టేట్ కన్వీనర్ కొన్నె సంపత్ రజక, ముదిగొండ మురళి, ఎం.ఎం. రావు, రేవల్లి నరేష్, నిమ్స్ రాజు తదితరులు బాధితురాలిని పరామర్శించారు.



## చెరువు సుందరీకరణ సంబరాలకు ఘన ఏర్పాట్లు

**– ఏర్పాట్లను పరిశీలించిన బండారి లక్ష్మారెడ్డి**



**ఉప్పల్, జూన్ 13 (సాక్ష్యం),:** హెచ్‌ఎంటీ నగర్ పెద్ద చెరువు కట్టపై ఆదివారం నిర్వహించనున్న చెరువు సుందరీకరణ సంబరాల ఏర్పాట్లను ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి శనివారం పరిశీలించారు. దశాబ్దాలుగా ప్రజలు ఎదురుచూస్తున్న సమస్యకు పరిష్కారం లభిస్తున్న నేపథ్యంలో ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించేందుకు అధికారులు, నాయకులతో కలిసి ఏర్పాట్లను సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చెరువు సుందరీకరణతో స్థానిక ప్రాంతాల అభివృద్ధికి కొత్త ఊపు లభిస్తుందని పేర్కొన్నారు. దశాబ్దాల సమస్య పరిష్కారమవుతున్న ఈ చారిత్రాత్మక సందర్భాన్ని పురస్కరించుకుని నాచారం, హెచ్‌ఎంటీ నగర్ డివిజన్ల ప్రజలు పెద్ద సంఖ్యలో ఆదివారం ఉదయం జరిగే కార్యక్రమానికి హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సాయిజెన్ శేఖర్, విట్టల్ యాదవ్, కట్ట బుచ్చన్న గౌడ్, వేముల మారయ్య, భూపాల్ రెడ్డి, ఎర్రం శ్రీనివాస్ రెడ్డి, చంద్రశేఖర్, ఖాదర్, లడ్డు శివ తదితరులు పాల్గొన్నారు.

## మహాముత్తారం పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన అడిషనల్ ఎస్పీ




**(సాక్ష్యం) జయశంకర్ – భూపాలపల్లి, జూన్ 13 :** మహాముత్తారం పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన అడిషనల్ ఎస్పీ. భూపాలపల్లి జిల్లా అడిషనల్ ఎస్పీ నరేష్ కుమార్ మహాముత్తారం పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్ రికార్డులు, పెండింగ్ కేసుల దర్యాప్తు, సీసీ కెమెరాల పనితీరు, పరిశుభ్రత తదితర అంశాలను పరిశీలించారు. ప్రజల ఫిర్యాదులను సత్వరంగా పరిష్కరించాలని, కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలని, నేరాల నియంత్రణకు సమర్థవంతమైన చర్యలు చేపట్టాలని పోలీసు అధికారులకు సూచించారు. ప్రజలకు నాణ్యమైన, పారదర్శక పోలీసు సేవలు అందించేందుకు కృషి చేయాలని ఆదేశించారు.

## అకాల గాలి వానతో, కూలిన ఇండ్లు గోడలు

**– 11 బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయం**

**– నిరుపేదలకు అండగా నిలువడమే లక్ష్యం – ఎస్ఆర్ఆర్ ఛైర్మెన్ పరుపాటి శ్రీనివాస్ రెడ్డి**



**రాయపర్తి, జూన్ 13(సాక్ష్యం):** వరంగల్ జిల్లా రాయపర్తి మండలం తిర్మాలాయపల్లి గ్రామంలో శుక్రవారం సాయంత్రం సంభవించిన అకాల గాలి వానతో, కొందరి ఇండ్లు గోడలు కూలి, నష్టబోయిన బాధిత కుటుంబలకు భరోసా నిచ్చేందుకు ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ ముందుకు వచ్చింది. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఆదేశాల మేరకు ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ పరుపాటి శ్రీనివాస్ రెడ్డి సహకారం తో తిర్మాలాయపల్లి గ్రామంలో గుడికందుల మణెమ్మ, ఉప్పాల ఎల్లయ్య, భాషబోయిన బుచ్చేల్లయ్య, గడ్డం ఎల్లమ్మ, గజవెల్లి భాగ్యమ్మ, గాజు రమాదేవి, రాచకొండ పురుషోత్తం, వశపాక యకమ్మ, వశపాక లావణ్య, వశపాక కేతమ్మ, గజవెల్లి ప్రమీల అనే 11 బాధిత కుటుంబ లకు అండగా నిలిచి వారికీ మనోధైర్యం కలిపించి ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ తరపున ఒక్కో కుటుంబనికి ఆర్థిక సహాయం చేసిఆడుకున్నారు. ఈ సహాయంను వారి కుటుంబ సభ్యులకు అందించిన రాయపర్తి మండల మాజీ ఎంపీపీ జినుగు అనిమి రెడ్డి, స్థానిక సర్పంచ్ బరిగేలా బాబు, మండల పార్టీ నాయకులు లేతకుల రంగా రెడ్డి, సంకినేని ఎల్లస్వామి, స్థానిక నాయకులు అయిన దోకుడు దేవేందర్, గుడి యుగేందర్ రెడ్డి, దోకుడు సొమెందర్, గజావెల్లి రాజు, దోమల కుమార్, వశపాక రాజు, వశపాక బాబు, వశపాక విజయ్, తదితరులు పాల్గొన్నారు.



## 21 ఏండ్లుగా రక్తదాన చైతన్య యుద్ధంలో " స్విమ్మర్ రాజు "

**– ప్రపంచ రక్తదాతల దినోత్సవం**




**నర్సంపేట జూన్ 13 (సాక్ష్యంన్యూస్):** రక్తదాన చైతన్య యుద్ధంలో నేను సైతం అంటూ వరంగల్ పోలీస్ కానిస్టేబుల్, బ్లడ్ డోనర్ అండ్ బ్లడ్ మోటివేటర్ కన్నె రాజు (స్విమ్మర్ రాజు) గత 21 సంవత్సరాలుగా రక్తదానం పై యువతకు అవగాహన కల్పిస్తూ పలుమార్లు రక్తదానం ,రక్తదాన శిబిరాలు నిర్వహిస్తూ ఆదర్శంగా నిలిచాడు.వరంగల్ జిల్లా, ఖానాపురం మండలం, రాగంపేట గ్రామానికి చెందిన కన్నె కుమారస్వామి – రమనీల దంపతుల పెద్ద కుమారుడు బ్లడ్ డోనర్ అండ్ బ్లడ్ మోటివేటర్ కన్నె రాజు (స్విమ్మర్ రాజు). తెలంగాణ రాష్ట్ర పోలీస్ శాఖలో, వరంగల్ పోలీస్ కమిషనరేట్ లో సిటీ ఆర్మ్డ్ రిజర్వు ఏ.ఆర్ 2009 బ్యాచ్ (వరంగల్ సిటీ గార్డ్)లో పోలీస్ కానిస్టేబుల్ గా విధులు నిర్వహిస్తున్నాడు. 2005వ సంవత్సరం లో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఖానాపురం లో ఇంటర్మీడియట్ సెకండ్ ఇయర్ చదువుకుంటున్న రోజులలో తేదీ. 28/08/2005 రోజున ఎన్.ఎస్.ఎస్ ఆధ్వర్యంలో కాకతీయ విశ్వవిద్యాలయం వరంగల్ లో మొట్ట మొదటి సారి రక్తదానం చేయడం జరిగింది. రక్తం దొరకకుండా ఎవరు ఇబ్బంది పడొద్దు. ఎవరు కూడా రక్తం దొరకకుండా చనిపోకూడదు అనే ముఖ్య ఉద్దేశంతో " రక్తదాన చైతన్య యుద్ధంలో నేను సైతం అంటూ" నేను ఈ రక్తదాన చైతన్య కార్యక్రమాలు ప్రారంభించడం జరిగిందని కన్నె రాజు (స్విమ్మర్ రాజు) తెలిపారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2005 సంవత్సరం నుండి నేను ఇప్పటి వరకు 37సార్లు (ఓ పాజిటివ్) రక్తదానం చేయడం జరిగింది. 2005 సంవత్సరం నుండి యువతకు ప్రత్యక్షంగా మరియు పరోక్షంగా నేను 5 రాష్ట్రాలు (తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, ఢిల్లీ, హర్యానా) రాష్ట్రాలలో (వాట్సప్, ఫేస్బుక్, ట్విట్టర్, టెలిగ్రామ్, ఇన్స్టాగ్రామ్ లాంటి సామాజిక మాధ్యమాల ద్వారా) 1,00,000 మందికి పైగా యువత కు రక్తదానం పై అవగాహన కల్పించడం జరిగింది. గత 21 సంవత్సరాలుగా వివిధ అత్యవసర సమయంలో ఉన్నవారికి 18,469 మందికి, రక్తదాతల సహకారంతో ఉచితంగా రక్తాన్ని అందించడం జరిగింది. అత్యవసరం లో ఉన్న వారికోసం మరియు తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారుల కోసం ఇప్పటి వరకు 78 రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయడం జరిగింది. కరోన (కోవిడ్ – 19) అత్యవసర సమయంలో ప్లాస్మాదానం పై అవగాహన కల్పించి 235 మందికి ప్లాస్మా అందించడం జరిగింది. జూన్ 14, 2026 ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా 18 సంవత్సరాలు పూర్తయిన యువతి ,యువకులు స్వచ్ఛందంగా రక్తదానం చేసి సమాజానికి ఆదర్శంగా ఉండాలని కోరుచున్నాను. ఎవరికైనా అత్యవసర సమయంలో రక్తం అవసరం ఉన్నవారు, స్వచ్ఛందంగా రక్తదానం చేయాలనుకునేవారు వరంగల్ పోలీస్ కానిస్టేబుల్, బ్లడ్ డోనర్ అండ్ బ్లడ్ మోటివేటర్కన్నె రాజు (స్విమ్మర్ రాజు). 9490115105 సెల్ ఫోన్ నెంబర్ కు సంప్రదించగలరు. అదేవిధంగా ఈ సందర్భంగా నాకు అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తూ నన్ను ప్రోత్సహిస్తున్న నా యొక్క కుటుంబ సభ్యులకు, బంధుమిత్రులకు, వరంగల్ పోలీస్ శాఖకు, యువ నేతాజీ ఫౌండేషన్ వరంగల్ సభ్యులకు, రక్తదాతలకు నా యొక్క ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.

## కొండెక్కిన ఎరువుల ధరలు..ఉక్కిరి బిక్కిరౌతున్న రైతన్నలు..

ఈ సారి సాగయ్యేదెట్ల...?
నియంత్రణకు చర్యలు చేపట్టని ప్రభుత్వం
ఆర్థిక ఇబ్బందులతో రైతుల సతమతం
పెరగనున్న సాగు పెట్టుబడులు
ఈ సారి ఖరీఫ్ సాగు ప్రశ్నార్థకమేనా..?
అయినా సాగుకు సిద్ధమౌతున్న రైతన్నలు

ఎరువులు పై ప్రైవేట్ 50 కిలోల బస్తా ధర (రూ.పాయల్లో)

| ఎరువు | పాత ధర (రూ.) | కొత్త ధర (రూ.) | పెరిగిన ధర (రూ.) |
|---|---|---|---|
| కాంప్లెక్స్ (14-35-14) | 1,900 | 2,350 | +450 ↑ |
| కాంప్లెక్స్ (24-24-0) | 2,000 | 2,300 | +300 ↑ |
| కాంప్లెక్స్ (10-26-26) | 1,950 | 2,250 | +300 ↑ |
| కాంప్లెక్స్ (20-20-013) | 1,800 | 2,150 | +350 ↑ |
| కాంప్లెక్స్ (16-16-16) | 1,675 | 2,050 | +375 ↑ |
| కాంప్లెక్స్ (15-15-15-09) | 1,650 | 1,950 | +300 ↑ |
| కాంప్లెక్స్ (16-20-0-13) | 1,400 | 1,750 | +350 ↑ |
| ఎసోపీ | 1,850 | 1,975 | +125 ↑ |
| ఎస్.యస్.పి | 615 | 775 | +160 ↑ |
| డీఏపీ | 1,350 | 1,350 | 0 – |
| యూరియా | 266 | 266 | 0 – |

**రాయపర్తి, జూన్ 13(సాక్ష్యం):** రైతులకు వానాకాలం ఆరంభంలోనే విత్తనాలు ఎరువుల ధరలు అమాంతంగా పెరగడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. రోహిణి కార్తె ముగిసి మృగశిర కార్తె ప్రారంభమై నాలుగు రోజులైంది. దీంతో వానాకాలం ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడం తో దుక్కులు దున్ని రైతన్నలు సిద్ధం చేసుకుంటున్నారు. పెరిగిన ధరలు రైతన్నలకు గుది బండగా మారింది. తొలకరి వర్షం పడగానే రైతులు పంటలు వేసేందుకు సిద్ద మవుతున్నా, విత్తనాల సరఫరాలో ప్రైవేటులదే హవా ఉండటంతో వేస్తున్నా కేంద్ర ప్రభుత్వం నామమాత్రం మద్దతు ధరలు పెంచు తుండగా యూరియా, డీఏపీ, కాంప్లెక్స్ ఎరువులకు ఒక్కోక్క బస్తాకు 100 నుంచి 350 వరకు ధరలు పెరగడంతో రైతుపై అదనపు భారం పడనుంది. డీఏపీ బస్తాకు 400 నుంచి 450కి పైగా పెరగడం వల్ల ఈయేడు వ్యవసాయం పెట్టుబడి తడిసి మోపెడవు



తుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. వానాకాలం ఆరంభం ముందే అన్నీ ఒకేసారి పెరగడం వల్ల రైతులపై ఎక్కువ భారం పడుతుందని వారు వాపోతున్నారు. ప్రతియేడు పంటల సాగు తప్పదు కాబట్టి రైతులు సిద్ధమవుతున్నారు. వానాకాలం ఆరంభంలో రైతులకు ప్రతిసారి బ్యాంకుల నుంచి రుణాలను అందిస్తారు. జిల్లాలో వేసే పంటల ఆధారంగా స్కేల్ ఆఫ్ పైనాన్స్ ప్రకారం బ్యాంకుల నుంచి రైతులకు రుణాలను మంజూరు చేస్తారు. ప్రతీ సంవత్సరం లక్ష్యాలను నిర్ణయిస్తున్నా వంద శాతం బ్యాంకులు రుణాలను అందించడం లేదు. ప్రతి సంవత్సరం లక్ష్యాలకు అనుగు ణంగా రుణాలు అందకపోవడం వల్ల రైతులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఉమ్మడి జిల్లా పరిధిలో వానాకాలం కోసం రైతులకు కావాల్సిన విత్తనాలు, ఎరువులు అందే విధంగా అన్ని చర్యలు చేపట్టామని ఉమ్మడి జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. రైతులకు ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామని వారు తెలిపారు.

రైతులు కొనుగోలుకు ఇబ్బందులు పడుతున్నారు. విత్తనాలు, ఎరువుల కోసం రైతులు ఇప్పటి నుండే పడరాని పాట్లు పడుతున్నారు. ఇటీవలనే పెట్రోల్, డీజిల్ ధరలు పెరగడం ఎరువుల ధరలు ఒకేసారి పెరగడంతో ఈ ఏడు పెట్టుబడి కూడా భారీగా పెరుగుతుందని రైతులు అంచనాకు వస్తున్నారు. పంట రుణాలకు బ్యాంకుల చుట్టు వ్యవసాయ రైతులు ప్రయత్నాలు ప్రారంభించారు. ప్రతియేడు ఉమ్మడి జిల్లాలో వాణిజ్య పంటలతో పాటు సాంప్రదాయ పంటలను కూడా సాగు చేస్తారు. వరంగల్ ఉమ్మడి జిల్లాలో అత్యధికంగా వానాకాలం సీజన్ లో పత్తి పంటను వేస్తారు. రాష్ట్రంలోనే అత్యధికంగా వరంగల్ జిల్లాలో పత్తి సాగు ఎక్కువగా సాగు చేస్తారు. దీంతో పాటు వరి, మొక్కజొన్న, పల్లి, పెసర, పసుపుతో పాటు ఇతర పంటలను సాగు చేస్తారు. వానాకాలం చివరన ఉమ్మడి జిల్లా పరిధిలో భారీగా మిర్చీ సాగును రైతులు చేస్తారు. యాసంగిలోనూ వరి, మిర్చి, మొక్క జొన్నతో పాటు ఇతర పంటలు వేస్తారు. వానాకాలంతో పాటు యాసంగిలో అత్యధికంగా చెరువులు, బావులు, కుంటలు, ఎస్సారెస్పీ కాలువల కింద వరి సాగును ఎక్కువగా చేస్తారు. ముందస్తుగా పత్తి, మొక్కజొన్న, వరి ఇతర పంటలకు సంబంధించిన విత్తనాలను కొనుగోలు చేస్తున్నారు. వీటితో పాటు పప్పుదినుసులు సాగు చేసేందుకు సిద్ధమవుతు న్నారు. ఈయేడు వానాకాలం ఆరంభం ముందే రైతులపై ధరల భారం పడడంతో విత్తనాలకు భారీగా ధరలు పెరిగాయి. గతంతో పోలిస్తే ఎకరాకు 500 నుంచి 1000వరకు అధిక భారం పడుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పత్తి, మొక్కజొన్న, ఇతర విత్తనాల ధరలు ఎక్కువగా పెరిగాయి. వానాకాలం ఆరంభానికి ముందే పెట్రోల్, డీజిల్ ధరలు, ఎరువుల ధరలు పెరగడం వల్ల గత సంవత్సరంతో పోలిస్తే రైతులపై ఈ దఫా ఎకరాకు 4వేల నుంచి 6వేల వరకు అదనపు భారం పడనుందని రైతులు అంటున్నారు. రైతులు ప్రతియేడు పంటలు

**కాలం నెత్తి మీదికొచ్చింది – సాగేట్ల చెయ్యాలి**
**రాంపెల్లి యాకయ్య**
**కాట్రపల్లి రైతు**



కాలం నెత్తి మీదికి వచ్చింది, వాన మబ్బులు వస్తున్నాయి , నాగలి దున్నడానికి రెడీగా ఉంది, కానీ రైతు చేతిలో డబ్బు లేదు. సాగేట్ల చెయ్యాలి. ఎందుకంటే ఈ సారి ఎరువుల ధరలు, విత్తనాల ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. ఈ సారి సాగు పైసలుంటే చెయ్యాలి.

**రాయితీతో ఎరువులు ఇవ్వాలి**
**గుగులోత్ అరుణ్ నాయక్**



**ఎంసీపీఐ మండల కార్యదర్శి**

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వెతిరేక విధానాలు అవాలంబిస్తూ రైతులతో దొబుచు లాడుతుందని. ప్రభుత్వం రాయితీతో రైతులకు ఎరువులు అందించాలి లేదా ధరల నియంత్రణకు చర్యలు చేపట్టాలి. ఖరీఫ్ సీజన్ కావడంతో అధికంగా రైతులు పంటలు సాగు చేస్తుంటారు. ఎరువుల పై స్పష్టమైన ప్రకటన చేయాలని ఎంసీపీఐ మండల కార్యదర్శి గుగులోత్ అరుణ్ నాయక్అన్నారు.

**పాత ధరలకే అమ్మాలి**
**గుమ్మడి వీరభద్రం**
**వ్యసాయ అధికారి రాయపర్తి**
**రైతులు కూడా బస్తాపై ఉన్న ధరనే చెల్లించాలి**



కేంద్ర ప్రభుత్వం ఇటీవల కాంప్లెక్స్ ఎరువుల ధరలను పెంచిందని, ఈ విషయాన్ని ప్రతి రైతు గమనించాలని అయితే పాత స్టాక్ మాత్రం పాత ధరలకు అమ్మాలని డీలర్లకు, వ్యాపారులకు సూచించారు. రైతులు కూడా బస్తాపై ఉన్న రేట్లను మాత్రమే చెల్లించాలని తెలిపారు. అలాగే కొత్త స్టాక్ మాత్రం పెంచిన ధరలను అమ్మాలని డీలర్లకు సూచించారు. ఈ అంశంపై నిరంతరం పర్యవేక్షించమని ఏడీఏలు, వ్యవసాయ అధికారులకు స్పష్టమైన ఆదేశాలను జారీ చేసినట్లు రాయపర్తి ఏ ఓ గుమ్మడి వీరభద్రం తెలిపారు.


## పెరిగిన హమాలీ రేట్ల జీవోను విడుదల చేయాలి

– సివిల్ సప్లై హమాలి యూనియన్ జిల్లా అధ్యక్షులు జలగం బిక్షపతి



రాయపర్తి, జూన్ 13(సాక్ష్యం): తెలంగాణ స్టేట్ సివిల్ సప్లై హమాలీలకు పెరిగిన హమాలీ రేట్ల జీవో ను వెంటనే విడుదల చేయాలని వరంగల్ జిల్లా అధ్యక్షుడు జలగం బిక్షపతి డిమాండ్ చేశారు. శనివారం వర్ధన్నపేటలో ఆయన మాట్లాడుతూ రెండు రోజుల్లోనే పెంచిన అమలి రేట్లకు సంబందించిన జీవోను విడుదల చేస్తామన్నాఅధికారులు చేయడం లేదని అయన ఆవేదన వ్యక్తం చేశారు. సివిల్ సప్లైహమాలి బిల్లులు చెల్లిస్తామని ఇంతవరకు చెల్లించలేదు కావున హమాలీలు చాలా ఇబ్బందుల పాలవుతున్నారు. ఇచ్చే కొద్ది జీతాన్ని రాష్ట్రం కొంత అని కేంద్రం కొంత అని హమాలి బిల్లును కొంచెం కొంచెంగా వేయడం వల్ల హమాలీ కార్మికులు ఇబ్బందుల గురవుతున్నారు. సివిల్ సప్లై కావున కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సివిల్ సప్లై కార్పొరేషన్ అధికారులు సివిల్ సప్లై కార్పొరేషన్ అమలీలను దృష్టిలో ఉంచుకొని హమాలీల సమస్యలను పరిష్కరించాలని, 2026 జనవరి నెల నుంచి జూన్ నెల వరకు పెరిగిన బకాయిలను చెల్లించాలని, డిమాండ్ చేశారు. కార్యక్రమంలో స్టేట్ సివిల్ సప్లై జిల్లా కార్యవర్గ సభ్యులు కొండేటి శ్రీనివాస్, జలగం రవి, జలగం మోహన్, గోదాము అధ్యక్షులు కొండూరు రవి, ఉపాధ్యక్షులు ఎమాకంటి వేణు యు శీను, ఎలమాకంటి భుజంగం, తదితరులు పాల్గొన్నారు.

## పాలకుర్తి పోలీస్ స్టేషన్‌లో డీసీపీ ఆకస్మిక తనిఖీ




పాలకుర్తి జూన్ 13(సాక్ష్యం): డీజీపీ మరియు వరంగల్ పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు శనివారం రోజు వెస్ట్ జోన్ డీసీపీ రాజా మహేంద్ర నాయక్ పాలకుర్తి పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా సందర్శించి తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లోని నేర కేసుల ఫైళ్లు, రికార్డులు, స్టేషన్ నిర్వహణ, పెండింగ్ కేసుల పురోగతి తదితర అంశాలను పరిశీలించారు. అనంతరం పోలీస్ సిబ్బందితో సమావేశమై డీజీపీ ఆదేశాలను సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించడం, ఫిర్యాదులను సత్వరంగా స్వీకరించి పరిష్కరించడం, ప్రజా అనుకూల పోలీసింగ్‌కు ప్రాధాన్యత ఇవ్వడం, పోలీస్ శాఖపై ప్రజలకు మరింత విశ్వాసం కలిగే విధంగా విధులు నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో పాలకుర్తి సీఐ శ్రీ జానకిరామ్ రెడ్డి, ఎస్సై డి పవన్ కుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఉపాధి కూలీలకు భోజనాలు ఏర్పాటు



తుర్కపల్లి సాక్ష్యం న్యూస్... తుర్కపల్లి మండలం వెంకటాపురం గ్రామంలో శనివారం ఉపాధి హామీ కూలీలకు ఆప్యాయతతో భోజనాలు ఏర్పాటు చేసి, వారితో కలిసి భోజనం చేసిన గ్రామ సర్పంచ్ కర్రే మాధవి కరుణాకర్ గౌడ్, ఉప సర్పంచ్ ఉదయ్ రెడ్డి, వార్డు సభ్యులు కొడపాక అక్షిత మహేష్, పల్లెపాటి అనిల్, గుంటి నాగరాజు, ఫీల్డ్ అసిస్టెంట్ పోతరాజు మాధవి దశరథ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ కూలీలు పాలక వర్గం చూపిన ఆదరణకు కృతజ్ఞతగా సర్పంచ్, ఉప సర్పంచ్, ఇతర ప్రజాప్రతినిధులను ఘనంగా సన్మానించారు. గ్రామాభివృద్ధి, కూలీల సంక్షేమం కోసం పాలక వర్గం చేస్తున్న కృషిని వారు అభినందించారు.

## చౌటుప్పల్ మండల ఉప సర్పంచుల ఫోరం అధ్యక్షుడిగా బొమ్మకంటి కిషోర్ కుమార్



చౌటుప్పల్ జూన్ 13 (సాక్ష్యం) చౌటుప్పల్ మండలం ఉప సర్పంచుల ఫోరం సమావేశం శనివారం మండలం పరిధిలోగల కొయ్యలగూడెం గ్రామంలోని రెక్కల సత్తిరెడ్డి ఫంక్షన్ హాల్ లో నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా అధ్యక్షుడు సుర్కంటి శ్రీధర్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. వారి సమక్షంలో మండలంలోని వివిధ గ్రామాల ఉపసర్పంచులు అధ్యక్షుడిగా బొమ్మకంటి కిషోర్ కుమార్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వారితోపాటు గౌరవ అధ్యక్షులుగా మీసాల నరసింహ, ఉపాధ్యక్షులుగా జెల్ల పవన్ కుమార్, బాతరాజు ధనుంజయ్, పల్చం జయమ్మ, ప్రధాన కార్యదర్శిగా బోయ సదానందం, కార్యదర్శిగా శ్యామల చిరంజీవి, కార్యనిర్వహణ అధ్యక్షులుగా కందగట్ల సురేందర్ రెడ్డి, సహాయ కార్యదర్శులుగా నిమ్మల సత్యనారాయణ, ముద్దం రమేష్ యాదవ్, కోశాధికారిగా వలం దాసు మహేష్ గౌడ్, గౌరవ సలహాదారులుగా పిన్నింటి శ్రీనివాసరెడ్డి, ఉప్పునూతల నరసింహ, సుర్కంటి ప్రభాకర్ రెడ్డి, ఫకీరు శ్రీనివాస్ రెడ్డి, కమిటీ సభ్యులుగా బోయిని లింగస్వామి యాదవ్, గడ్డం సత్తయ్య, పెరుమాండ్ల లింగస్వామి, బక్కన్న గారి శ్రవణ్ కుమార్, సామిడి శ్రీనివాస్ రెడ్డి, సుర్కంటి అనుపు రెడ్డి,డి రాజు ను ఎన్నుకున్నారు. ఈ జిల్లా అధ్యక్షుడు శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ.. నూతనంగా ఎన్నికైన ఉపసర్పంచుల ఫోరం కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రభుత్వం వెంటనే ఉప సర్పంచుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఉప సర్పంచులకు చెక్ పవర్ రద్దు నిర్ణయాన్ని ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని లేనిచో ఉద్యమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. అనంతరం నూతనంగా ఎన్నుకోబడిన కార్యవర్గానికి పలువురు ప్రజా ప్రతినిధులు శుభాకాంక్షలు తెలియజేస్తూ వారిని ఘనంగా సన్మానించారు.

## బిఆర్ఎస్ మండల సర్పంచుల ఫోరం నూతన కమిటీ ఎన్నిక

పాలకుర్తి జూన్ 13(సాక్ష్యం): పాలకుర్తి మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సర్పంచుల ఫోరం సమావేశం ఉత్సాహ భరితంగా జరిగింది. మండల సర్పంచులు ఏకగ్రీవంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గడ్డం కిరణ్, ఉపాధ్యక్షురాలు గా చింతకింది అనిత,ప్రధాన కార్యదర్శిగా భోడిగ ప్రదీప్, కోశాధికారిగా భానోత్ రవీందర్ నాయక్ లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిఆర్ఎస్ పార్టీ సిద్ధాంతాలకు అంకితభావంతో పనిచేస్తూ, గ్రామాల అభివృద్ధి కోసం సర్పంచులందరినీ ఒకే వేదికపై నడిపిస్తూ పార్టీని మరింత బలోపేతం చేస్తామని నూతన కమిటీ స్పష్టం చేసింది.



## సింగరేణి సర్వ నాశనం చేసి సింగరేణి నిధులను హైదరాబాద్ సిద్దిపేట లాంటి ప్రాంతాల్లో వినియోగించారు

భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



(సాక్ష్యం) జయశంకర్ - భూపాలపల్లి, జూన్ 13 : సింగరేణి సర్వ నాశనం చేసి సింగరేణి నిధులను హైదరాబాద్ సిద్దిపేట లాంటి ప్రాంతాల్లో వినియోగించారు భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం నాడు నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ,గత బీఆర్ఎస్ ప్రభుత్వం సింగరేణిని ఆదాయ వనరుగా కాకుండా దోపిడీ కేంద్రంగా మార్చిందని ఆరోపించారు. అందినకాడికి దోచుకుని, ఇప్పుడు సింగరేణి కోసం ఆవేదన వ్యక్తం చేస్తున్నట్లు మాట్లాడటం ప్రజలను మోసం చేసే ప్రయత్నమేనన్నారు. భూపాలపల్లికి రావాల్సిన 800 మెగావాట్ల విద్యుత్ ప్లాంటును రాజకీయ ప్రయోజనాల కోసం యాదాద్రికి తరలించారని ఆరోపించారు. ప్రాజెక్టు వ్యయాలను అమాంతం పెంచి వేల కోట్ల రూపాయల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని విమర్శించారు. నాసిరకం సామగ్రి, అవినీతి నిర్మాణాలతో ప్లాంటును పనికిరాని స్థితికి చేర్చారని అన్నారు.అలాగే సింగరేణి పరిధిలోని ప్రజల అభివృద్ధికి ఖర్చు చేయాల్సిన డీఎంఎఫ్‌టీ, సీఎస్ఆర్ నిధులను సిద్ధిపేట, హైదరాబాద్ వంటి ఇతర ప్రాంతాలకు తరలించింది బీఆర్ఎస్ ప్రభుత్వమే కాదా అని ప్రశ్నించారు. గనుల వల్ల ఇబ్బందులు పడుతున్న భూపాలపల్లి ప్రజలకు న్యాయం చేయకుండా, రాజకీయ ప్రయోజనాల కోసం నిధులను మళ్లించారని ఆరోపించారు.మాజీ మంత్రి హరీష్ రావు భూపాలపల్లి పర్యటనలో సింగరేణిపై మాట్లాడడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. సింగరేణిని బలహీనపరిచిన వారే ఇప్పుడు దాని గురించి నీతులు చెప్పడం ప్రజలు గమనిస్తున్నారు అని వ్యాఖ్యానించారు.

## విభీజి రాంజీ చట్టాన్ని రద్దు చేయాలి

– యం యన్ ఆర్ ఇజి పథకం అమలు చేయాలి – తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం మండల కమిటీ డిమాండ్
– ఈనెల 16న వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా మూడవ మహాసభలను జయప్రదం చేయండి



పాలకుర్తి,జూన్ 13(సాక్ష్యం): కేంద్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాలలో వ్యవసాయ కూలీలు గా పని చేస్తూ, ఉపాధి హామీ పనులకు వెళ్తూ వ్యవసాయ కార్మికులు జీవనోపాధి పొందుతున్నారు. జాతీయ ఉపాధి హామీ చట్టాన్ని రద్దుచేసి కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన విబిజి రాంజీ చట్టాన్ని రద్దుచేసి, పాత చట్టాము మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్నీ కొనసాగించాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులు కాకర్ల బాబు, కాకర్ల పద్మ డిమాండ్ చేశారు. శనివారం పాలకుర్తి మండలములోనీ మంచుప్పుల గ్రామంలో ఉపాధి హామీ పనులను వారు పరిశీలించారు. అనంతరం స్థానిక కూలీల తో వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ముఖ్య అతిథిగా వారు పాల్గొని మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆచరణ లోకి తీసుకు వచ్చిన విబిజి రాంజీ చట్టాన్ని అమలు చేయడం వల్ల గ్రామీణ ప్రాంతాల్లో భవిష్యత్తులో కూలి పనులు దొరకని పరిస్థితి నెలకొనే ప్రమాదం ఉందని అన్నారు . ప్రస్తుత పరిస్థితుల్లో నీ మార్కెట్ ధరలకు అనుగుణంగా వ్యవసాయ కూలీలకు రోజువారిగా ఏడు వందల రూపాయలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం అమలు చేయబోతున్న నూతన చట్టాన్ని రద్దు చేయాలని కేంద్ర ప్రభుత్వమే ఉపాధి హామీ అమలుకు నేరుగా గత విధానం ప్రకారం 90 శాతం నిధులు విడుదల చేయాలని కోరారు . ప్రతిరోజు కార్మికులను ఇబ్బంది పెట్టే రెండు విడతల ఐరిష్ ఫోటోలు తీసే విధానాన్ని రద్దు చేయాలని వారు తెలిపారు. ఉపాధి హామీ పనుల బకాయి పడిన పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని పునరుద్ధరించాలని కోరారు . కూలీలు పనిచేసే స్థలంలో కనీస సౌకర్యాలు మంచినీరు , ప్రధమ చికిత్స కిట్టు వంటి వసతులు కల్పించాలని తెలిపారు . ఈ నెల 16న లింగాల గణపురం మండల కేంద్రంలో జరగనున్న వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా మూడవ మహాసభలను నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. వ్యవసాయ కూలీలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు . ఈ కార్యక్రమంలో గోవుల సోమ నరసయ్య, గోగుల లక్ష్మి, కాకర్ల రమేష్, దాసరి సోమలక్ష్మి, బొమ్మగాని పద్మ, వక్కాల మంజుల, జోగు ఆరుణమ్మ, ఎండి రహీం, ఊదరి సప్న, జోగు కలమ్మ, జోగు యాదయ్య, మద్దయ్య, మల్లేష్, యాకన్న తదితరులు పాల్గొన్నారు.

## గాలి బీభత్సవానికి ఎగిరిపోయినా ఇంటి రేకులు

– తప్పిన భారీ ప్రమాదం – అండగా నిలిచిన సర్పంచ్ తనయుడు





రాయపర్తి, జూన్ 13(సాక్ష్యం): రాయపర్తి మండలం లోని కాట్రపల్లి గ్రామం లో నిన్న రాత్రి సమయంలో వచ్చిన గాలి వాన ప్రభావానికి గ్రామానికి చెందిన సిరికొండ కాంతయ్య ఇంటి పైకప్పు కొట్టుకుపోవడం జరిగింది. సమాచారం తెలుసుకున్న గ్రామ సర్పంచ్ రాపాక పద్మ బ్రహ్మచారి తనయుడు రాపాక ప్రశాంత్ బాధితుల వద్దకు వెళ్లి వారితో మాట్లాడి వివరాలు అడిగి ఆర్థిక సహాయం అందించారు. జరిగిన సంఘటన ను మండల అధికారులకు సమాచారం అందించారు. నిరాశ్రులైన బాధిత కుటుంబానికి సహాయం అందించాలనిఅధికారులను ప్రశాంత్ కోరారు. కార్యక్రమంలో గ్రామ ప్రజలు గ్రామ యువకులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులను

## పరిశీలించిన సర్పంచ్ మందుల నాగయ్య



కోదాడ జూన్ 13,(సాక్ష్యం) గుడిబండ గ్రామం లో విబ్ జీ రామ్ జి ఉపాధి హామీ పథకం లో భాగంగా పనులను సర్పంచ్ మందుల నాగయ్య శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఫస్ట్ ఎయిడ్ కిట్లు ఉన్నాయా లేవా అని వివరాలడిగి తెలుసుకున్నారు. కూలీలను పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఇట్టి కార్యక్రమం లో ఫీల్డ్ అసిస్టెంట్ బిక్షం, కూలీలు పాల్గొన్నారు

## సీసీ రోడ్ల పనులకు శంకుస్థాపన

సర్పంచ్ బల్గూరి స్నేహ దుర్గయ్య




కోదాడ జూన్ 13 (సాక్ష్యం) గణపవరం గ్రామంలో సర్పంచ్ బల్గూరి స్నేహ దుర్గయ్య ఆధ్వర్యంలో ఆంజనేయస్వామి పక్కన బజారు, పలు వీధుల్లో సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శనివారం శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఎమ్మెల్యే నలమాద ఉత్తమ్ పద్మావతి రెడ్డి సహాయ సహకారాలతో గణపవరం గ్రామానికి ఎన్ ఆర్ జి ఎస్ నిధులు 10లక్షలు. మంజూరు కావడంతో ఈ రోడ్ల నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. ఎమ్మెల్యే నలమాద ఉత్తమ్ పద్మావతి రెడ్డి కి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్. చిట్ట వెంకటవమ్మ రాంరెడ్డి , మాజీ ఎంపిటిసి సింగారెడ్డి హిమబిందు సుమన్ రెడ్డి . వార్డ్ మెంబర్లు. మదూరి కృష్ణారావు. బండి చిన కోటయ్య. పెదమర్తి సురి నారాయణ. ఇర్ల వరహాల్ రెడ్డి దేవాలయ చైర్మన్. ఇర్ల శ్రీనివాసరెడ్డి. కాసాని శ్రీను. ఆదిరెడ్డి. లక్ష్మయ్య. నాగస్వరూప్. వీరయ్య. చెన్నారెడ్డి. నాగరాజు. రవి. గాంధీ. సతీష్. జైపాల్. పుల్లయ్య. మదర్. సిద్దు. అజయ్ పాల్గొన్నారు

## గుప్త నిధుల పేరిట మోసాలకు పాల్పడుతున్న మహిళ ముఠా పై విచారణ

– ఎస్సై మహేష్

ఏటూరునాగారం, జూన్ 13, (సాక్ష్యం) గుప్త నిధుల త్రవ్వకాల్లో భారీ మొత్తంలో బంగారం బయటపడిందని ఒంటి పై ఉన్న పాత బంగారంతో పూజలు చేస్తే ఎలాంటి చెడు జరగకుండా సొంతమౌతుందని మోసాలకు పాల్పడుతున్న ముఠా పై విచారణ చేపట్టామని ఎస్సై మహేష్ శనివారం ప్రెస్ నోట్ విడుదల చేశారు. ఎస్సై తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి మండల కేంద్రానికి చెందిన ఓ దంపతులకు మంగపేట మండలం కమలాపురంకు చెందిన షమీన, భర్త రబ్బానీలు, ఏటూరునాగారం మండలంలోని ఐటీడీఏ క్రాస్ రోడ్డుకు చెందిన తస్లీంభాను ఏ రజియాలు గుప్త నిధులు దొరికాయని మూడు తులాల పుస్తెల్ తాడుకు రెండు కిలోల బంగారం ఇస్తామని మాయ మాటలు చెప్పి పూజల పేరుతో మూడు తులాల బంగారం, ఖర్చుల పేరిట 14 లక్షల నగదు తీసుకున్నారని నెలలు గడుస్తున్న ఇవ్వకపోవడంతో న్యాయం కోసం పోలీసులను ఆశ్రయించారని తెలిపారు. బాదితులు ఇచ్చిన పిర్యాదును పరిశీలించిన పోలీసులు షమీన, భర్త రబ్బానీ, రజియాల పై విచారణ చేపట్టామని తెలిపారు. అంతేకాకుండా బంగారం మెరుగు పెడతామని, నగదు తీసుకుని రెండింతలు కల్పిస్తామని ఎవరైన మీకు మాయమాటలు చెపితే మోసపోకండి పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.




పుష్కరకాల పాలనను ఎలాంటి మచ్చ

## లేకుండా భారత జాతి గర్వపడేలా పూర్తి చేశారు

భారతీయ జనతా పార్టీ నాయకులు




(సాక్ష్యం) జయశంకర్ - భూపాలపల్లి, జూన్ 13 : పుష్కరకాల పాలనను ఎలాంటి మచ్చ లేకుండా భారత జాతి గర్వపడేలా పూర్తి చేశారని, భారతీయ జనతా పార్టీ నాయకులు పేర్కొన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో శనివారం నాడు భారతీయ జనతా పార్టీ జిల్లా కార్యాలయంలో దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ 12 సంవత్సరాల పాలన పూర్తయిన సందర్భంగా జిల్లా అధ్యక్షులు ఏడునూతుల నిషిధర్ రెడ్డి అధ్యక్షతన విలేకరుల సమావేశం నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు మూగ జయశ్రీ , రాష్ట్ర అధికార ప్రతినిధి వన్నాల వెంకటరమణ హాజరై మోడీ ప్రభుత్వ విజయాలను వివరించారు. వారు మాట్లాడుతూ, నరేంద్ర మోడీ పుష్కరకాల పాలనను ఎలాంటి మచ్చ లేకుండా భారత జాతి గర్వపడేలా పూర్తి చేశారని, భారతీయ జనతా పార్టీ ఆయన నాయకత్వంలో దేశానికి సుస్థిరమైన, ప్రజాకేంద్రిత పాలన అందించిందని పేర్కొన్నారు. దేశ చరిత్రను, సంస్కృతిని, విశ్వాసాలను ప్రపంచానికి చాటి చెప్పిన నాయకుడిగా మోడీ గారు నిలిచారని అన్నారు. ఒకప్పుడు ఆర్థిక సంక్షోభంలో ఉన్న భారత్ నేడు ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న దేశంగా ఎదిగిందని, కాపిటల్ ఎక్స్‌పెండిచర్ భారీగా పెరిగి మౌలిక సదుపాయాల అభివృద్ధి వేగవంతమైందని తెలిపారు. మహిళల గౌరవాన్ని కాపాడేందుకు కోట్లాది మరుగుదొడ్లు నిర్మించడం, నాలుగు కోట్లకు పైగా ఇళ్లను నిర్మించి పేదల సొంతింటి కలను సాకారం చేయడం, కరోనా సమయంలో 80 కోట్ల మందికి ఉచిత ఆహార ధాన్యాలు అందించడం వంటి కార్యక్రమాలు చారిత్రాత్మకమని పేర్కొన్నారు. ప్రతి రైతుకు సంవత్సరానికి రూ.6,000 ఆర్థిక సహాయం, ఎరువులపై భారీ సబ్సిడీలు, గ్రామీణ రహదారుల అభివృద్ధి, జాతీయ రహదారుల విస్తరణ, విమానాశ్ర.

## రామాలయంలో స్వామివారికి
# వాయినాలు సమర్పించిన మహిళలు

చౌటుప్పల్ జూన్ 13 (సాక్ష్యం)
పురుషోత్తమ అధికమాసం సందర్భంగా శనివారం చౌటుప్పల్ మండల కేంద్రంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయంలో స్థానిక ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారికి అమ్మవారికి వాయినాలు అందించారు. అనంతరం ఒడిబియ్యం కార్యక్రమంతోపాటు సామూహిక లలితసహస్రనామ పారాయణం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..లోక కల్యాణం కోరకు,పాడి పంటలతో దేశం సుభిక్షంగా ఉండాలనే సంకల్పముతో ఇట్టి కార్యక్రమం నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఇట్టి కార్యక్రమంలో వుప్పల కుసుమ,దీపిక, సింగిరికొండ శైలజ, దాచేపల్లి నాగమని,





రమాదేవి, లక్ష్మీ, యమున, ప్రసన్న,తెలుకుంట్ల వసంత,బూరుగు నాగరాని,కామిశెట్టి శ్రీదేవి, సముద్రాల పుష్పమ్మ, వాణీ,వనపర్తి పావని,నీలా పద్మ,ఉష,పెద్ది స్వాతి, ఆలయ పూజారి పెద్ది క్రిష్ణ కిషోర్ శర్మ ,రోహిత్ మిశ్రా తదితరులు పాల్గొన్నారు.

## నీటి విడుదల లోపు ప్రధాన కాలువ పూడిక తీయాలి మరమతులు చేయాలి: సిపిఐ నాయకులు తూం బుచ్చిరెడ్డి

డిండి. సాక్షం న్యూస్ :
డిండి ప్రాజెక్ట్ ఆయకట్టు రైతుల పొలాలకు త్వరలో నీటి విడుదల నేపథ్యంలో శనివారం సిపిఐ,కాంగ్రెస్ నాయకులు ప్రాజెక్ట్ మెయిన్ కెనాల్ ను పరిశీలించారు. ఇటీవల డిండిలో నిర్వహించిన అఖిలపక్ష పార్టీల నాయకులు, రైతుల సమావేశంలో, డిండి ప్రాజెక్టు నీటి విడుదలకు తేదీనీ నిర్ణంచారు. దానికి ముందు మెయిన్ కెనాల్ లో పేరుకుపోయిన మట్టినీ పూడిక తీసేందుకు తీర్మానించిన నేపథ్యంలో ఎక్కడెక్కడ అయితే పూర్తిస్థాయిలో మెయిన్ కెనాల్ ధ్వంసం అయిందో తక్షణ పనులు చేపట్టాలని సిపిఐ జిల్లా నాయకులు బుచ్చిరెడ్డి, అధికారులను కోరారు. పనులు చేయాల్సిన అవసరం మెయిన్ కెనాల్ డీప్ కర్ట్ తలుపులు మరమ్మతులు చేయాలని, అధికారులకు సూచించారు. నీటి విడుదల లోగా ప్రాజెక్ట్



మెయిన్ కెనాల్ లో (షిల్ట్)పూడిక తీసి సిద్ధం చేయాలన్నారు. పరిశీలించిన వారిలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తూం బుచ్చిరెడ్డి,డిండి మండలం బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు దొంతినేని వెంకటేశ్వరరావు,రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎండి మైనొద్దీన్,కాంగ్రెస్ నాయకులు శశిధర్ రెడ్డి,వర్క్ ఇన్స్పెక్టర్ కర్ణాకర్ తదితరులు పాల్గొన్నారు.

## విజయ సంకల్ప యాత్ర పోస్టర్ ఆవిష్కరణ

తాడ్వాయి జూన్ 13,(సాక్ష్యం):
ఈనెల 29న తెలంగాణ ఉద్యమకారుల ఫోరమ్ ఆధ్వర్యంలో జరగబోయే విజయ సంకల్ప యాత్ర గోడ పత్రికను శనివారం మేడారం పుణ్యక్షేత్రంలో మహిళ ఉద్యమకారులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు మేకల, మాధవి,స్థానిక మహిళా ఉద్యమకారులు మాట్లాడుతూ ఈనెల 29వ జరిగే విజయ సంకల్ప యాత్రను (జోగులాంబ) విజయవంతం చేయాలని సమ్మక్క సారక్క అమ్మవారిని దర్శించుకోవడం జరిగిందన్నారు, ప్రాంతంలో ఉన్నటువంటి ఉద్యమకారులు తప్పకుండా ఈ యాత్రకు హాజరై తెలంగాణ ఉద్యమకారుల ఐక్యతను చాటాలని కోరారు. ఈ కార్యక్రమంలో వనజ, సత్యలక్ష్మి, సంధ్య, రూపాదేవి,సుజాత రెడ్డి, దేవేంద్రారెడ్డి ,ములుగు జిల్లా మహిళా అధ్యక్షురాలు యాసపూలమ్మ, మండల మహిళా అధ్యక్షురాలు యాస కళావతి, ఉపాధ్యక్షులు యానాల ఉపేంద్ర ,సామ సరోజన తదితరులు పాల్గొన్నారు.



## తెలంగాణలో అక్కడి మట్టి బంగారమే..
## అరుదైన, విలువైన ఖనిజ నిక్షేపాలు.. కేంద్ర సంస్థకు గనులు..

హైదరాబాద్ జూన్ 13,(సాక్ష్యం):
సంగారెడ్డి జిల్లా పర్వతపూర్ బ్లాక్‌లో ఉన్న వెనేడియం, టైటానియం గనులను కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని ఎన్ఎల్‌సీ ఇండియా లిమిటెడ్ సంస్థ దక్కించుకుంది. ఈ గనులకు ప్రాధాన్య బిడ్డర్‌గా కేంద్ర గనుల మంత్రిత్వ శాఖ తమను ప్రకటించిందంటూ.. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ ఇండియాకు ఈ సంస్థ సమాచారం అందించింది. మరోవైపు ఈ అరుదైన, విలువైన ఖనిజాలు రక్షణ రంగ పరికరాల తయారీలో ఉపయోగపడతాయని నిపుణులు చెప్తున్నారు.తెలంగాణలోని సంగారెడ్డి జిల్లాలో అరుదైన ఖనిజ నిక్షేపాలు ఉన్నట్లు జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా ఇటీవల గుర్తించిన సంగతి తెలిసిందే. ఈ అరుదైన ఖనిజాలు ఉన్న గనులను కేంద్ర ప్రభుత్వం అధీనంలోని చీూజ ఇండియా లిమిటెడ్ సంస్థ దక్కించుకుంది. తెలంగాణలోని వెనాడియం, టైటానియం వంటి విలువైన ఖనిజాల గనులను ఈ సంస్థ దక్కించుకుంది. ఈ విషయాన్ని నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ ఇండియాకు సమాచారం అందించింది. గనుల మంత్రిత్వ శాఖ నిర్వహించిన ఖనిజాల గనుల వేలంపాటలకు తమను ప్రాధాన్య బిడ్డర్‌గా ప్రకటించారని స్టాక్ ఎక్స్ఛేంజ్ ఫైలింగ్‌లో ఎన్ఎల్‌సీ కంపెనీ తెలిపింది. సంగారెడ్డిలోని పర్వతపూర్ వెనేడియం, టైటానియం, అల్యూమినియస్ లాటరైట్ గనులకు తమను ప్రాధాన్య బిడ్డర్‌గా ప్రకటించారని సమాచారం అందించింది. జూన్ 11వ తేదీ ఈ వేలంపాట నిర్వహించారు.మరోవైపు జహీరాబాద్‌కు 15 కిలోమీటర్ల దూరంలో ఉండే పర్వతపూర్ ప్రాంతంలో అరుదైన వెనేడియం, అల్యూమినియస్ లాటరైట్, టైటానియం ఖనిజాల నిక్షేపాలు ఉన్నట్లు జియోగ్రాఫికల్ సర్వే ఆఫ్ ఇండియా సర్వేలో గుర్తించారు. వీటిని వెలికితీసే ప్రక్రియలో భాగంగా ఈ- వేలంపాట నిర్వహించారు. మరోవైపు జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా ప్రకారం.. పర్వతపూర్ బ్లాక్‌లో 15.25 మిలియన్ టన్నుల మేరకు వెనేడియం నిక్షేపాలు ఉన్నాయి. ఈ బ్లాక్ మొత్తం విస్తీర్ణం సుమారు 335.50 హెక్టార్లు.

**వెనేడియం.. ఎందుకు ఉపయోగిస్తారు.?**

మరోవైపు వెనేడియమనేది అత్యంత అరుదుగా దొరికే ఖనిజం. దీనిని స్టీల్ తయారీలో ఉపయోగిస్తారు. ఉక్కు బలాన్ని పెంచేందుకు, బ్యాటరీల తయారీలో ఈ వెనేడియం ఉపయోగపడుతుంది. వెనేడియంతో పాటుగా పర్వతపూర్ బ్లాక్‌లో 87 మిలియన్ టన్నుల మేరకు అల్యూమినస్ ల్యాటరైట్ నిక్షేపాలు కూడా ఉన్నట్లు అధ్యయనంలో గుర్తించారు. ఈ ఖనిజాలను డిఫెన్స్ రంగంలో ఉపయోగిస్తారు. ఎయిర్‌క్రాఫ్ట్ తయారీలోనూ ఈ ఖనిజాలు ఉపయోగపడతాయని నిపుణులు చెప్తున్నారు. మిలిటరీ ఆయుధాలు, రాకెట్ల తయారీలోనూ ఈ ఖనిజాలు చాలా అవసరమని అభిప్రాయపడుతున్నారు.



## భారతీయ జీవిత బీమా ఏజెంట్ల సమైక్య సమావేశాన్ని జయప్రదం చేయండి: కౌటికే విటల్

చౌటుప్పల్ జూన్ 13 (సాక్ష్యం )
జూన్ 17, 18 వ తేదీలలో భారతీయ జీవిత బీమా ఏజెంట్ల సమైక్య జనరల్ బాడీ సమావేశం నాగోల్ లోని శుభం కన్వెన్షన్ హాల్ లో నిర్వహించడం జరుగుతుందని కావున ఏజెంట్లు పాలసీదారులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆ సంస్థ అడ్వైజర్ బోర్డు కో చైర్మన్ కౌటికే విటల్ పిలుపునిచ్చారు. శనివారం చౌటుప్పల్ మండల కేంద్రంలో వారు సమావేశం నిర్వహించి మాట్లాడుతూ.. జూన్17,18 న జరిగే సమావేశం లో మూడు వేల మందికి పైగా సాధారణ మండలి సభ్యులు, జాతీయ కార్యవర్గ సభ్యులు, రాష్ట్ర నాయకులు, ప్రతినిధులు పాల్గొంటారు అని తెలిపారు.ఈ సమావేశం లో ఏజెంట్లు,పాలసి దారులకు సంబందించిన కీలక అంశాలు, వారు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించనున్నామని




తెలిపారు. ఏజెన్సీ బలగాన్ని మరింత బలోపేతం చేయడానికి, పాలసీ దారుల ప్రయోజనాలను పరిరక్షించడానికి ఇది దోహదపడుతుందని తెలిపారు. నైతిక భీమా విధానలను ప్రోత్సహించడం, భారతదేశ బీమా రంగ అభివృద్ధికి తోడ్పడటం పట్ల తన నిభద్దతను పునరుద్ఘాటిస్తుంది అని పేర్కొన్నారు. పాలసీదారులకు సంబంధించిన అంశాలపై సంబంధితఅధికారులకు వినతులు సమర్పిస్తామని తెలిపారు. ఈ సమాఖ్య భవిష్యత్తు కార్యాచరణను రూపొందించడానికి ప్రతి ఒక్క ఏజెంటు పాలసీదారుడు పాల్గొని జయప్రదం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సమాఖ్య ప్రధాన కార్యదర్శి ఎస్ బి శ్రీనివాసచారి,రాజ్యాంగ కమిటీ చైర్మన్,అడ్వైజరీ పోటీ చైర్మన్ బి ఎన్ చారి, స్వాగత కమిటీ చైర్మన్ సింగారపు శ్రీనివాస్, ప్రెస్ అండ్ పబ్లిసిటీ చైర్మన్ షేక్ షాజహాన్, వైస్ ప్రెసిడెంట్ ఎమ్మెస్ మూర్తి, కోశాధికారి బి శ్రీరామ్ మహిళా ప్రతినిధి హేమలత, సికింద్రాబాద్ డివిజన్ కార్యదర్శి సునీల్ కుమార్, హైదరాబాద్ డివిజన్ కార్యదర్శి సీనయ్య, పబ్లిసిటీ కో చైర్మన్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా నిత్య కళ్యాణం: క్యూ లైన్లలో భక్తులు

యాదగిరి కొండ సాక్ష్యం న్యూస్..
ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన యాదాద్రి శ్రీలక్ష్మి నరసింహ స్వామి వారి సన్నిధిలో వీకెండ్ సెలవులు రావటంతో యాదాద్రి ఆలయ సన్నిధిలో భక్తులరద్దీ పెరిగింది.వేకువ జామున ఉదయాన్నే స్వామివారి దర్శనానికి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఆలయానికి భక్తుల రద్దీ పెరగడంతో స్వామి వారి ధర్మ దర్శనంకు 2గంటల సమయం ప్రత్యేక ప్రవేశ దర్శనంకి ఒక





గంట సమయంపడుతోంది.క్షేత్ర పరిసరాలు భక్తుల సందడి కనిపిస్తుంది. దర్శన క్యూలైన్లు,ఆలయ మాఢ వీధుల్లు,కళ్యాణకట్ట, పుష్కరిణి,కొండపైబస్టాండ్, వ్రత మండపం ఘాట్ రోడ్డు వెంట భక్తులతో కిటకిటలాడుతున్నవి.. ఆలయంలో స్వామివారి నిత్య కళ్యాణం పర్వంలో సువర్ణ పుష్పార్చన, వేద ఆశీర్వచనం భక్తులు పాల్గొని మొక్కులు చెల్లించుకుంటున్నారు. శనివారం వివిధ కైంకర్యాలలో వచ్చిన ఆదాయం. 45,30,856/-

## పురోహితంలో
# భరతుడికి దక్కిన నంది



పాలకుర్తి,జూన్ 13(సాక్ష్యం):
పాలకుర్తి మండల కేంద్రానికి చెందిన భరత్ పురోహితులు గా అందరికీ సుపరిచితుడు. తెలుగు వెలుగు సాహితీ వేదిక ఆధ్వర్యంలో వరంగల్ లో జరిగిన తెలంగాణ అవతరణ దినోత్సవంలో భాగంగా పురోహితంలో గత 15 సంవత్సరాలుగా రానిస్తున్నశీదుకు , ప్రజలకు సేవలు అందిస్తున్నందుకు నంది పురస్కారంతో సన్మానిచడం జరిగింది.

# జర్నలిస్టు సతీష్ కుమార్‌కు పితృవియోగం
## పరామర్శించిన పలువురు జర్నలిస్టులు, ప్రముఖులు

భూపాలపల్లి జూన్ 13 (సాక్ష్యం) :
భూపాలపల్లి జిల్లా సీనియర్ జర్నలిస్ట్, తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు, నవతెలంగాణ స్టాఫ్ రిపోర్టర్ ఎర్రం సతీష్ కుమార్ కు పితృవియోగం జరిగింది. తన తండ్రి ఎర్రం సమ్మయ్య వడదెబ్బ తగలడంతో శుక్రవారం భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని 100 పడకల ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతి చెందారు. కాగా భూపాలపల్లి మండలం పెద్దాపూర్ గ్రామంలో అంత్యక్రియలు జరిగాయి. అంత్యక్రియల్లో పలువురు జర్నలిస్టులు, ప్రముఖులు పాల్గొని నివాళులర్పించారు. మృతికి గల కారణాలను తెలుసుకొని వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

**పరామర్శించిన నవతెలంగాణ బృందం**

నవతెలంగాణ స్టాఫ్ రిపోర్టర్ ఎర్రం సతీష్ కుమార్ తండ్రి సమ్మయ్య మృతి చెందడంతో ఆయన కుటుంబాన్ని నవతెలంగాణ ఉమ్మడివరం జిల్లా రీజినల్ మేనేజర్ దేవేందర్ రావు వరంగల్, హనుమకొండ, భూపాలపల్లి





ములుగు జిల్లాల ఏడివిటీలు బాబు,ప్రశాంత్, గౌస్ పాషా,ప్రభాకర్ తోపాటు జిల్లాలోని ఆయా మండలాల నవతెలంగాణ విలేకరులు దూలం కుమారస్వామి, రహీం పాషా, రాజేందర్, సమ్మయ్య మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

**పరామర్శించిన టిడబ్ల్యూజేఎఫ్ నాయకులు**

తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు ఎర్రం సతీష్ కుమార్ ను టిడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.దయాసాగర్, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ చింతల కుమార్ యాదవ్, హనుమకొండ జిల్లా అధ్యక్షులు టివి రాజు, ములుగు జిల్లా అధ్యక్షులు పిట్టల మధుసూదన్, భూపాలపల్లి జిల్లా నాయకులు లక్ష్మారెడ్డి, రాంబాబు, ప్రవీణ్, భాస్కర్, జోవర్ధన్, హనుమకొండ జిల్లా నాయకులు అనిల్ రెడ్డి, వెంకట్ సీనియర్ జర్నలిస్ట్ చెరుకు సుధా

# ఏ పనికైనా ఒక పద్ధతి ఉంటుంది
## రోడ్లపై దయచేసి ఇలా చేయకండి: సజ్జనార్


హైదరాబాద్ జూన్ 13,(సాక్ష్యం):
రోడ్డుపై బైక్ నడుపుతూ పెట్రోల్ ట్యాంకుపై ల్యాప్‌టాప్ పెట్టుకుని ఆఫీస్ పనులు చక్కబెడుతున్న ఒక సాఫ్ట్‌వేర్ ఉద్యోగి వీడియో సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతోంది. ఈ ప్రమాదకరమైన వర్క్ ఫ్రమ్ బైక్ వెర్రితనంపై హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్ ఎక్స్ ట్విట్టర్ వేదికగా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్పొరేట్ ఒత్తిళ్లు ఎన్ని ఉన్నప్పటికీ ఇలా ప్రాణాలను పణంగా పెట్టడం బాధ్యతారాహిత్యమని, కడుపు నింపుకోవడానికి చేసే ఉద్యోగం ప్రాణాలు తీసేలా ఉండకూడదని ఆయన హితవు పలికారు. సాఫ్ట్‌వేర్ రంగంలో వర్క్ ఫ్రమ్ హోమ్, వర్క్ ఫ్రమ్ ఎనీవేర్ అనే మాటలు మనం వినే ఉంటాం. కానీ హైదరాబాద్ ఐటీ కారిడార్ పరిధిలో ఓ వ్యక్తి ఏకంగా వర్క్ ఫ్రమ్ బైక్ అంటూ నడిరోడ్డుపై ప్రాణాంతక విన్యాసానికి తెరలేపాడు. బైక్ నడుపుతూ.. దానికి ముందు భాగంలో ల్యాప్‌టాప్‌ను అమర్చుకుని, రోడ్డుపై వెళ్తూనే ఆఫీస్ పనులు, కోడింగ్ చేసుకుంటూ వెళ్తున్న దృశ్యాలు ప్రస్తుతం సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తున్నాయి. లైకులు, వ్యూస్ కోసమో లేదా ఆఫీస్ డెడ్‌లైన్ల ఒత్తిడి వల్లో తెలియదు కానీ అత్యంత ప్రమాదకరమైన రీతిలో చేసిన ఈ నిర్వాకంపై హైదరాబాద్ సీపీ సజ్జనార్ ట్విట్టర్ ఎక్స్ వేదికగా తీవ్రస్థాయిలో మండిపడ్డారు.'ఆత్రం ఎక్కువైతే ప్రాణం మీదికి వస్తుంది' అనే పాత సామెతను ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. రోడ్డుపై ప్రయాణించేటప్పుడు వాహనదారుడి ఏకాగ్రత ఒక్క క్షణం తప్పినా.. అది కేవలం సదరు వాహనదారుడి ప్రాణాలకే కాకుండా పక్కన వెళ్లే ఇతర అమాయక ప్రయాణికుల భద్రతకు కూడా పెను ముప్పని ఆయన హెచ్చరించారు. ఏ పనికైనా ఒక పద్ధతి, సమయం ఉంటాయని, కానీ ప్రాణాలను పణంగా పెట్టి ఇలా వర్క్ ఫ్రమ్ బైక్ చేయడం చూస్తుంటే సామెతలు అక్షరాలా నిజమనిపిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. కడుపు నింపుకోవడానికి చేసే ఉద్యోగం, కడతేర్చేలా ఉండకూడదని ఉద్యోగులకు హితవు పలికారు.కార్పొరేట్ కంపెనీలలో డెడ్‌లైన్లు, విపరీతమైన పని ఒత్తిళ్లు ఉన్నాయనే సాకుతో ఇలాంటి పిచ్చి పనులకు పాల్పడటం ముమ్మాటికీ నేరమేనని సజ్జనార్ పేర్కొన్నారు. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఈ తరహా దృశ్యాలు యువతను తప్పుదోవ పట్టించేలా ఉన్నాయన్నారు. దయచేసి బైక్‌లపై లేదా కార్లలో ప్రయాణించేటప్పుడు ల్యాప్‌టాప్‌లు ఓపెన్ చేయడం, ఇయర్‌ఫోన్స్ పెట్టుకుని ఫోన్లు మాట్లాడటం వంటి పనులు పూర్తిగా మానేయాలని పిలుపునిచ్చారు. 'మీరు క్షేమంగా ఇళ్లకు తిరిగి వస్తారని మీ కోసం ఇంట్లో మీ కుటుంబ సభ్యులు, పిల్లలు ఎంతో ఆశగా ఎదురుచూస్తుంటారు. దాన్ని గుర్తుంచుకొని, ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలి' అని సజ్జనార్ సూచించారు. ఈ వీడియో చూసిన నెటిజన్లు సైతం సదరు బైకర్‌పై ట్రాఫిక్ పోలీసులు కఠినమైన జరిమానాలు విధించాలని డిమాండ్ చేస్తున్నారు.



# రిపోర్టర్‌పై దాడి అత్యంత దురదృష్టకరం
## బీజేపీ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోగుల రాణా ప్రతాప్ రెడ్డి

నర్సంపేట జూన్ 13 (సాక్ష్యం న్యూస్ ) :
ప్రజాస్వామ్యంలో నాలుగో స్థంభంగా ఉన్న మీడియా ప్రతినిధులపై దాడులు జరగడం అత్యంత దురదృష్టకరమని బీజేపీ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోగుల రాణా ప్రతాప్ రెడ్డి అన్నారు. బాధిత రిపోర్టర్ ను పరామర్శించిన ఆయన మాట్లాడుతూ వార్తా సేకరణ కోసం విధులు నిర్వహిస్తున్న నర్సంపేట రిపోర్టర్ సత్యనారయణపై శుక్రవారం దాడి జరగడం నర్సంపేటలో శాంతిభద్రతల పరిస్థితికి అద్దం పడుతోందన్నారు. దాడికి పాల్పడిన వారిని వెంటనే గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని, బాధిత రిపోర్టర్‌కు న్యాయం చేయాలని పోలీసు అధికారులను డిమాండ్ చేశారు. జర్నలిస్టుల భద్రతకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని, భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని ఆయన కోరారు. ప్రశ్నించే గొంతులను అణచివేయాలనే ప్రయత్నాలను ప్రజాస్వామ్యవాదులు ఎప్పటికీ సహించరని డాక్టర్ గోగుల రాణా ప్రతాప్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నర్సంపేట పట్టణ అధ్యక్షులు గూడూరు సందీప్,మాజీ కౌన్సిలర్ జుర్రు రాజు,ఉపాధ్యక్షులు ఠాకూర్ విజయ్ సింగ్,కాసుల నాగేంద్ర బాబు, బిజెవైఎం జిల్లాఉపాధ్యక్షులు కొంకిస విఘ్నేష్ ,పులిపాక అశోక్,శోభన్,సామల ప్రవీణ్,చిలువేరు అన్వేష్ ,గోస్కుల సందీప్ ,చందు,యశ్వంత్ మరియు తదితరులు పాల్గొన్నారు.





# పరాగ్వేను 4-1 తేడాతో చిత్తు చేసిన అమెరికా

ప్రపంచంలోనే అతిపెద్ద ఫుట్‌బాల్ టోర్నమెంట్ 2026 ఫిఫా వరల్డ్ కప్‌లో ఆతిథ్య అమెరికా జట్టు అద్భుతమైన బోణీ కొట్టింది. శుక్రవారం జరిగిన తొలి మ్యాచ్‌లోనే పరాగ్వే జట్టును 4-1 తేడాతో చిత్తుచేసి టోర్నీలో మొదటి విజయాన్ని తన ఖాతాలో వేసుకుంది. సదరన్ కాలిఫోర్నియాలోని సోఫీ స్టేడియం వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌కు అభిమానులు భారీగా తరలివచ్చారు. 1994 తర్వాత మళ్లీ అమెరికా గడ్డపై ఫిఫా వరల్డ్ కప్ మ్యాచ్ జరగడంతో ఫ్యాన్స్ స్టేడియంను హోరెత్తించారు. ఆ అంచనాలకు తగ్గట్టుగానే అమెరికా ఆటగాళ్లు మైదానంలో చెలరేగిపోయారు. మ్యాచ్ మొదలైన ఏడో నిమిషంలోనే అమెరికా గోల్స్ ఖాతా తెరిచింది. అమెరికా స్టార్ ఆటగాడు పులిసిక్ ఇచ్చిన అద్భుతమైన పాస్‌ను వెస్టన్ మెక్కెన్నీ అందుకోగా పరాగ్వే ఆటగాడు డామియన్ బొబాడిల్లా పొరపాటున చేసిన సెల్ఫ్ గోల్‌తో అమెరికాకు 1-0 లీడ్ దక్కింది. ఆ తర్వాత 31వ నిమిషంలో ఫోలారిన్ బలోగున్ అమెరికాకు రెండో గోల్ అందించాడు. హాఫ్ టైమ్ ముగిసే సమయానికి బలోగున్ మరోసారి పరాగ్వే డిఫెండర్లను ఏమార్చి అద్భుతమైన గోల్ చేశాడు. దీంతో ఫస్ట్ హాఫ్ పూర్తయ్యే సరికి అమెరికా 3-0 ఆధిక్యంలోకి వెళ్లిపోయి మ్యాచ్‌ను తమ కంట్రోల్‌లోకి తీసుకుంది. సెకెండ్ హాఫ్‌లో 73వ నిమిషంలో పరాగ్వే ఆటగాడు మౌరిసియో గోల్ కొట్టాడు. దీంతో అమెరికా లీడ్ 3-1కి తగ్గింది. ఆట అదనపు సమయంలో అమెరికా (90ం8 నిమిషాల వద్ద) ప్లేయర్ గివోన్ని రీనా అదిరిపోయే గోల్ కొట్టి 4-1 తేడాతో తన జట్టును గెలిపించాడు. పరాగ్వే (37 శాతం)తో పోలిస్తే బంతిపై నియంత్రణ యూఎస్‌కే (63 శాతం) ఎక్కువగా ఉంది. ఈ మ్యాచ్‌లో అమెరికా విన్నింగ్ గోల్స్ వెనుక కీ రోల్ ప్లే చేసిన పులిసిక్ ఫస్ట్ హాఫ్ చివర్లో గాయపడ్డాడు. పరాగ్వే ఆటగాళ్లు బంతిని లాక్కునే క్రమంలో అతని కాలిపై గట్టిగా తన్నడంతో కోచ్ మారిసియో పోచెట్టినో వెంటనే అలర్ట్ అయ్యాడు. టోర్నీ ఇంకా చాలా రోజులు ఉండటంతో ఎలాంటి రిస్క్ తీసుకోకుండా హాఫ్ టైమ్‌లోనే పులిసిక్‌ను మైదానం నుంచి బయటకు పిలిపించి అతని స్థానంలో సెబాస్టియన్ బెర్హాల్టర్‌ను గ్రౌండ్ లోకి దించాడు. తన గాయం పెద్దదేమీ కాదని ముందు జాగ్రత్తగానే బయటకు వచ్చానని నెక్స్ట్ మ్యాచ్‌కు కచ్చితంగా అందుబాటులో ఉంటానని పులిసిక్ చెప్పాడు. సెకండ్ హాఫ్‌లో పరాగ్వే కాస్త పుంజుకునే ప్రయత్నం చేసింది. మ్యాచ్ 73వ నిమిషంలో ఆ జట్టు ఆటగాడు మారిసియో ఒక గోల్ చేసి స్కోరును 3-1 కి చేర్చాడు. కానీ ఆ తర్వాత అమెరికా డిఫెన్స్ ను దాటి పరాగ్వే ఆటగాళ్లు ముందుకు రాలేకపోయారు. ఇక మ్యాచ్ అదనపు సమయంలో అమెరికా ఆటగాడు జియో రేనా పెనాల్టీ బాక్స్ బయట నుంచి కళ్లుచెదిరే షాట్‌తో బంతిని డైరెక్ట్‌గా నెట్‌లోకి పంపి స్కోరును 4-1గా మార్చాడు. ఇది ఈ మ్యాచ్‌కే హైలైట్‌గా నిలిచింది. దీంతో పరాగ్వే ఆట పూర్తిగా ముగిసిపోయింది. ఇక ఇదే వరల్డ్ కప్‌లో భాగంగా ఆతిథ్య దేశాల్లో ఒకటైన కెనడా జట్టు కూడా తమ తొలి మ్యాచ్ ఆడింది. టొరంటోలో జరిగిన ఈ మ్యాచ్‌లో కెనడా జట్టు బోస్నియాతో 1-1 తో డ్రా చేసుకుంది. 78వ నిమిషంలో కెనడా ఆటగాడు కైల్ లారిన్ గోల్ చేసి జట్టును ఓటమి నుంచి కాపాడాడు. ఈ టోర్నీలో అమెరికా తమ తదుపరి మ్యాచ్‌ను వచ్చే శుక్రవారం సియాటెల్‌లో ఆడనుంది. అలాగే కెనడా జట్టు గురువారం వాంకోవర్‌లో ఖతార్‌తో తలపడనుంది. ఓవరాల్‌గా ఫస్ట్ మ్యాచ్ విజయంతో అమెరికా టీమ్ ఫుల్ కాన్ఫిడెన్స్‌తో కనిపిస్తోంది.

# సరికొత్త రికార్డు సృష్టించిన రోహిత్ శర్మ

టీమిండియా స్టార్ బ్యాటర్ రోహిత్ శర్మ భారత వన్డే క్రికెట్ చరిత్రలోనే అత్యంత అరుదైన మైలురాయిని అధిగమించి సరికొత్త రికార్డు సృష్టించాడు. అఫ్ఘానిస్థాన్‌తో ధర్మశాలలో జరుగుతున్న తొలి వన్డేలో బరిలోకి దిగడం ద్వారా.. భారతదేశం తరఫున అత్యధిక వయసులో వన్డే మ్యాచ్ ఆడిన క్రికెటర్‌గా రోహిత్ నిలిచాడు. ఈ క్రమంలో 39 ఏళ్ల



44 రోజుల వయసున్న రోహిత్.. 1989 నాటి మొహిందర్ అమర్‌నాథ్ (39 ఏళ్ల 36 రోజులు) ఆల్‌టైమ్ రికార్డును బద్దలు కొట్టాడు. టీమిండియా స్టార్ బ్యాటర్, మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ అరుదైన రికార్డు సాధించాడు. టీమిండియా తరఫున వన్డే మ్యాచ్ ఆడిన అత్యధిక వయస్కుడిగా రికార్డు క్రియేట్ చేశాడు. అఫ్ఘానిస్థాన్‌తో ధర్మశాల వేదికగా జరుగుతున్న తొలి వన్డేలో బరిలోకి దిగిన రోహిత్ శర్మ.. భారత క్రికెట్ చరిత్రలో అత్యధిక వయసులో వన్డే మ్యాచ్ ఆడిన ఆటగాడిగా రికార్డు సృష్టించాడు. ఈ క్రమంలోనే మోహిందర్ అమర్‌నాథ్‌ను అధిగమించాడు. గతంలో ఈ రికార్డు టీమిండియా మాజీ ప్లేయర్, 1983 వన్డే ప్రపంచకప్ విజేత జట్టు సభ్యుడు మొహిందర్ అమర్‌నాథ్ పేరిట ఉంది. ఆయన 39 ఏళ్ల 36 రోజుల వయసులో 1989లో తన కెరీర్‌లో చివరి వన్డే మ్యాచ్ ఆడారు. తాజాగా ఈ రికార్డును హిట్‌మ్యాన్ అధిగమించాడు. అఫ్ఘానిస్థాన్‌తో ధర్మశాలలో జరుగుతున్న తొలి వన్డేలో రోహిత్.. 39 ఏళ్ల 44 రోజుల వయస్సుతో బరిలోకి దిగాడు. 2007లో టీమిండియా తరఫున తొలి మ్యాచ్ ఆడిన రోహిత్.. 19 ఏళ్లుగా జట్టులో కొనసాగుతున్నాడు. 2007లో రోహిత్ శర్మ అంతర్జాతీయ క్రికెట్ అరంగేట్రం చేశాడు. కెరీర్‌లో తొలి నాలుగైదేళ్లు తీవ్ర ఒడిదొడుకులు ఎదుర్కొన్నాడు. టీ20 ప్రపంచకప్ 2007 విన్నింగ్ టీమ్‌లో సభ్యుడిగా ఉన్న అతడు.. ఆ తర్వాత అవకాశాలు కోల్పోయాడు. ముఖ్యంగా వన్డే ప్రపంచకప్ 2011లో జట్టులో చోటు దక్కించుకోలేక నిరాశకు లోనయ్యాడు. ఈ సమయంలో ధోనీ నిర్ణయం రోహిత్ కెరీర్‌ను మలుపుతిప్పింది. అప్పటివరకూ మిడిల్ ఆర్డర్‌లో బ్యాటింగ్‌కు వచ్చే.. హిట్‌మ్యాన్‌ను.. ధోనీ ఓపెనర్‌గా బరిలోకి దించాడు. ఇక అప్పటి నుంచి అతడు వెనక్కి తిరిగి చూసుకోలేదు. కీలక ఆటగాడిగా మారడంతో పాటు.. టీమిండియా మేటి కెప్టెన్‌లలో ఒకడిగా రికార్డు క్రియేట్ చేశాడు. వన్డే ప్రపంచకప్ 2023 భారత్ రన్నరప్‌తో సరిపెట్టుకున్నా రోహిత్ మాత్రం తన నాయకత్వ లక్షణాలతో అదరగొట్టాడు. తన సారథ్యంలో టీమిండియాకు టీ20 ప్రపంచకప్ 2024 టైటిల్ అందించాడు. టీ20, టెస్టులకు గుడ్‌బై చెప్పిన రోహిత్ శర్మ.. ప్రస్తుతం కేవలం వన్డేల్లో మాత్రమే ఆడుతున్నాడు. వన్డే ప్రపంచకప్ 2027లో ఆడటమే లక్ష్యంగా ముందుకెళ్తున్నాడు. వన్డే ప్రపంచకప్ టైటిల్ కల నెరవేరాలంటే రోహిత్ శర్మకు.. వచ్చే 18 నెలలు కీలకం కానుంది.



## కెనడా- బోస్నియా మ్యాచ్ డ్రా

### చివరి నిమిషాల్లో కైల్ లారిన్ అద్భుతమైన గోల్

ఫిఫా ప్రపంచ కప్ 2026 గ్రూప్-బీ ప్రారంభ మ్యాచ్ ఫుట్‌బాల్ అభిమానుల్లో తీవ్ర ఉత్కంఠను రేపింది. టొరంటోలోని బీఎమ్ఓ స్టేడియం వేదికగా జరిగిన పోరులో సహ ఆతిథ్య దేశమైన కెనడా, బోస్నియా-హెర్జెగోవినా జట్ల మధ్య జరిగిన మ్యాచ్ 1-1 గోల్స్‌తో డ్రాగా ముగిసింది. మ్యాచ్ చివరి వరకు బోస్నియా ఆధిక్యంలో ఉంది. అందరూ ఆ జట్టే గెలుస్తుందని అనుకున్నారు. కానీ, చివరి నిమిషాల్లో కెనడా స్టార్ స్ట్రైకర్ కైల్ లారిన్ సబ్‌స్టిట్యూట్‌గా వచ్చి అద్భుతమైన గోల్ చేశాడు. దీంతో జట్టును పరాజయం నుంచి రక్షించాడు. దీంతో ఈ టోర్నీలో ఇరు జట్లు చెరో పాయింట్‌తో తమ ఖాతాలను తెరిచాయి. ఇదిలా ఉండగా, అంతర్జాతీయ ఫుట్‌బాల్‌లో కెనడా ఇప్పటివరకు ఆడిన ఏడు ప్రపంచకప్ మ్యాచ్‌ల్లో ఒక్క దాంట్లో కూడా గెలవకపోవడం గమనార్హం. మ్యాచ్ ప్రారంభమైన రెండో నిమిషంలోనే కెనడాకు గోల్ ఖాతా తెరవడానికి అవకాశం లభించింది. లూక్ డి ఫౌగెరోల్స్‌కు గోల్ పోస్ట్ సమీపంలో బంతి అందింది. కానీ, అతను గోల్ కొట్టడంలో విఫలమయ్యాడు. ఆ మరుసటి నిమిషంలోనే బోస్నియా కూడా ఎదురుదాడికి దిగింది. లభించిన ఫ్రీ కిక్‌ను గోల్‌గా మార్చడంలో బోస్నియా ఆటగాడు మెమిచ్ తడబడ్డాడు. మ్యాచ్ 10వ నిమిషంలో కెనడాకు గట్టి షాక్ తగిలింది. బోస్నియా ఆటగాడు మెమిచ్‌ను ప్రమాదకరంగా కింద పడేసినందుకు కెనడా డిఫెండర్ అలిస్టెర్ జాన్‌స్టన్‌కు అంపైర్ పసుపు కార్డు చూపించారు. మ్యాచ్ 21వ నిమిషంలో బోస్నియాకు లభించిన కార్నర్ కిక్‌ను ఆ దేశ ఆటగాడు ఇవాన్ బేసిక్ అత్యంత చాకచక్యంగా డి-బాక్స్ లోకి పంపాడు. అక్కడ సిద్ధంగా ఉన్న సీద్ కొలాసినాక్ ఆ బంతిని ఫ్లిక్ చేయగా, కేవలం రెండు గజాల దూరం నుంచి జోవో లుకిచ్ అద్భుతమైన హెడర్‌తో బంతిని గోల్ పోస్ట్‌లోకి పంపాడు. జోవో లుకిచ్‌కు ఇది అంతర్జాతీయ కెరీర్‌లో మొదటి గోల్ కావడం విశేషం. అంతేకాకుండా, 2014 తర్వాత ప్రపంచకప్‌లో బోస్నియా సాధించిన తొలి గోల్ ఇదే. ఈ గోల్‌తో బోస్నియా 1-0 తో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. బోస్నియా ఖాతాలో గోల్ పడటంతో కెనడా ఒత్తిడిలో పడింది. స్టార్ ఆటగాడు జోనాథన్ డేవిడ్ గోల్ కోసం కొన్ని మంచి అవకాశాలను సృష్టించినప్పటికీ, బోస్నియా డిఫెండర్లు వాటిని తిప్పికొట్టారు. అయితే, సెకండాఫ్‌లో కెనడా చాకచక్యంగా ఆడింది. 53వ నిమిషంలో కెనడాకు మంచిఅవకాశం లభించింది. స్టీఫెన్ యుస్టాకియో అందించిన అద్భుతమైన పాస్‌ను రిచీ లార్యా అందుకుని గోల్ కీపర్‌ను దాటించి షాట్ కొట్టాడు. అది గోల్ కావడం ఖాయమనుకున్న సమయంలో, బోస్నియా డిఫెండర్ కొలాసినాక్ అద్భుతమైన రీతుల్లో గాల్లోకి లేచి బంతిని నెట్టి గోల్ కాకుండా కాపాడాడు. టైమ్ దగ్గరపడుతున్న నేపథ్యంలో ఓటమి ఖాయమనిపిస్తున్న తరుణంలో కెనడా కోచ్ జెస్సీ మార్ష్ ఒక కీలక మార్పు చేశారు. 76వ నిమిషంలో బెంచ్‌పై ఉన్న స్టార్ స్ట్రైకర్ కైల్ లారిన్‌ను మైదానంలోకి దించారు. కోచ్ నమ్మకాన్ని లారిన్ వమ్ము చేయలేదు. మైదానంలోకి వచ్చిన కేవలం మూడు నిమిషాల్లోనే ప్రామిస్ డేవిడ్ అందించిన పాస్‌ను లారిన్ అందుకున్నాడు. ఒక క్విక్ టర్న్‌తో బంతిని నెట్‌లోకి పంపాడు. ఈ గోల్‌తో స్టేడియంలోని కెనడా అభిమానుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. స్కోరు 1-1 తో సమమైంది. ఆ తర్వాత లారిన్ మరో గోల్ ప్రయత్నం చేసినప్పటికీ బోస్నియా డిఫెండర్ తారిక్ ముహారెమోవిచ్ అడ్డుకోవడంతో మ్యాచ్ డ్రాగా ముగిసింది.

## జీ5లో ఫిఫా వరల్డ్ కప్..

ఫిఫా వరల్డ్ కప్ 2026 ప్రారంభానికి కొన్ని రోజుల ముందే ఇండియాలోని ఫుట్‌బాల్ ఫ్యాన్స్‌కు ఒక బిగ్ గుడ్ న్యూస్ అందింది. ఇండియాకు చెందిన ప్రముఖ బ్రాడ్‌కాస్టర్లు ఫిఫా సంస్థతో రేట్ల విషయంలో చర్చల లూప్‌లో




ఇరుక్కుపోయిన వేళ, జీ ఎంటర్‌టైన్‌మెంట్ ఈ అవకాశాన్ని అందిపుచ్చుకుంది. తన సరికొత్త స్పోర్ట్స్ ఛానెల్ 'యునైట్8'), డిజిటల్ ప్లాట్‌ఫామ్ జీ5 ల ద్వారా ఈ మెగా టోర్నీని ఇండియాలో టెలికాస్ట్ చేయనుంది. ఈ బిగ్ డెసిషన్ వెనుక ఉన్న లాంగ్ టర్మ్ విజన్ గురించి యునైట్8 స్పోర్ట్స్ చీఫ్ బిజినెస్ ఆఫీసర్ భవేష్ జనవ్లేకర్ తాజాగా ఒక ఇంటర్వ్యూలో పలు ఆసక్తికర విషయాలు వెల్లడించారు. ఫిఫా వరల్డ్ కప్ రైట్స్ కోసం ఇతర పెద్ద నెట్‌వర్క్‌లు వెనకడుగు వేసినా జీ గ్రూప్ ఎందుకు ముందుకు వచ్చిందనే దానికి భవేష్ క్లారిటీ ఇచ్చారు. స్పోర్ట్స్ అనేది తమకు షార్ట్ టర్మ్ గేమ్ కాదని, మార్కెట్ శబ్దాలను పట్టించుకోకుండా లాంగ్ టర్మ్ స్ట్రాటజిక్ నమ్మకంతోనే ఈ డెసిషన్ తీసుకున్నట్లు స్పష్టం చేశారు. ఫిఫా వరల్డ్ కప్ అనేది కేవలం ఒక టోర్నమెంట్ మాత్రమే కాదని, గ్లోబల్ స్పోర్ట్స్ ఇండస్ట్రీలో ఒక స్ట్రాంగ్ ఫౌండేషన్ క్రియేట్ చేయడానికి ఇది హెల్ప్ అవుతుందని చెప్పారు. ఇండియాలో యంగ్ అండ్ డిజిటల్ వ్యూయర్స్ ఇంట్రెస్ట్స్ మారుతున్నాయని, అందువల్ల మల్టీలింగ్వల్ కవరేజ్, రీజనల్ లాంగ్వేజెస్ సపోర్ట్‌తో ఈ మ్యాచ్‌లను అందరికీ అందుబాటులోకి తెస్తున్నట్లు వివరించారు. ఇండియాలో కేవలం క్రికెట్ మాత్రమే కాకుండా ఫుట్‌బాల్, కబడ్డీ లాంటి ఆటలకు కూడా విపరీతమైన క్రేజ్ పెరుగుతోందని భవేష్ అన్నారు. వెస్ట్ బెంగాల్, కేరళ, గోవా, నార్త్ ఈస్ట్ రాష్ట్రాల్లో ఫుట్‌బాల్‌కు ఒక కల్చరల్ కనెక్ట్ ఉందని గుర్తు చేశారు. ఆల్రెడీ జీ5 ద్వారా కలకత్తా ఫుట్‌బాల్ లీగ్, బెంగాల్ సూపర్ లీగ్ లను ప్రసారం చేసి సక్సెస్ అయ్యామని చెప్పారు. ఐఎల్‌టి20, యూపీ కబడ్డీ లీగ్ లాంటి ప్రాపర్టీస్ ద్వారా ఇండియా అంతటా అన్ని ప్రాంతాల ఆడియన్స్‌కు రీచ్ అవ్వడమే తమ టార్గెట్ అని వెల్లడించారు. టైమ్ జోన్ తేడాల వల్ల రాత్రి పూట మ్యాచ్‌లు ఉన్నప్పటికీ, ఇండియాలోని క్రేజీ ఫుట్‌బాల్ లవర్స్ ఖచ్చితంగా లైవ్ చూస్తారనే నమ్మకాన్ని వ్యక్తం చేశారు. ఈ డీల్‌లో కేవలం ఈ ఏడాది వరల్డ్ కప్ మాత్రమే కాకుండా ఇతర చిన్న ఫిఫా ఈవెంట్స్ కూడా భాగమయ్యాయి. దీనివల్ల ఫ్యాన్స్‌తో కంటిన్యూయస్ కనెక్టివిటీ ఉంటుందని భవేష్ ఆశాభావం వ్యక్తం చేశారు. స్పెయిన్ కో-హోస్ట్ చేయబోయే 2030 వరల్డ్ కప్ వరకు తమ స్పోర్ట్స్ గ్రోత్ ప్లాన్స్ విస్తరించి ఉన్నాయని హింట్ ఇచ్చారు. ఫుట్‌బాల్‌తో పాటు ఇండియాస్ టూర్ ఆఫ్ జింబాబ్వే క్రికెట్ సిరీస్ బ్రాడ్‌కాస్టింగ్ రైట్స్‌ను కూడా యునైట్8 స్పోర్ట్స్ సొంతం చేసుకుందని, టీమిండియా మ్యాచ్‌ల ద్వారా తమ ఛానెల్ రేటింగ్స్ మరింత పెరుగుతాయని స్పష్టం చేశారు. గ్లోబల్ స్కేల్, రీజనల్ అఫినిటీలను బ్యాలెన్స్ చేస్తూ ఒక ఫ్యూచర్ రెడీ స్పోర్ట్స్ ఎకోసిస్టమ్‌ను బిల్డ్ చేయడమే తమ ఫైనల్ గోల్ అని వివరించారు.

## టీమిండియా తరఫున డెబ్యూ చేసిన హర్ష్ దూబె, గుర్నూర్ బ్రార్

భారత్, అఫ్ఘానిస్థాన్ మధ్య ధర్మశాల వేదికగా జరగాల్సిన తొలి వన్డే ఎట్టకేలకు ప్రారంభమైంది. వర్షం కారణంగా టాస్ ఆలస్యం కావడంతో మ్యాచ్‌ను ఇరు జట్లకు 25 ఓవర్ల చొప్పున కుదించారు. టాస్ గెలిచిన భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ తొలుత బౌలింగ్ ఎంచుకున్నాడు. ఈ మ్యాచ్ ద్వారా టీమిండియా తరఫున హర్ష్ దూబె, గుర్నూర్ బ్రార్ వన్డేల్లోకి అరంగేట్రం చేయగా.. గాయం తర్వాత రోహిత్ శర్మ రీఎంట్రీ ఇస్తున్నాడు.భారత్, అఫ్ఘానిస్థాన్ జట్ల మధ్య తొలి వన్డే మ్యాచ్ ఎట్టకేలకు ప్రారంభమైంది. నిజానికి ధర్మశాల వేదికగా



మధ్యాహ్నం 1.30 గంటలకు ఈ మ్యాచ్ ప్రారంభం కావాల్సింది. కానీ వర్షం అంతరాయం కలిగించడంతో టాస్ ఆలస్యమైంది. చివరకు వరుణుడు కరుణించడంతో అంపైర్లు టాస్ వేశారు. టాస్ గెలిచిన భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ తొలుత బౌలింగ్ ఎంచుకున్నాడు. వర్షం కారణంగా మ్యాచ్‌ను 25 ఓవర్ల చొప్పున కుదించారు.ఈ మ్యాచ్‌లో టీమిండియా తరఫున ఇద్దరు ప్లేయర్లు డెబ్యూ చేశారు. ఐపీఎల్‌లో సత్తాచాటిన హర్ష్ దూబె , గుర్నూర్ బ్రార్.. భారత జట్టు తరఫున తొలి మ్యాచ్ ఆడుతున్నారు. హర్ష్ దూబె ఐపీఎల్ 2026లో సన్ రైజర్స్ తరఫున ఆడాడు. 8 మ్యాచులలో 8 వికెట్లు తీశాడు. యశస్వి జైశ్వాల్, ప్రిన్స్ యాదవ్, కుల్‌దీప్ యాదవ్‌కు తుది జట్టులో చోటు దక్కలేదు. రోహిత్ శర్మతో కలిసి శుభ్‌మన్ గిల్ ఇన్నింగ్స్ ప్రారంభించనుండగా.. విరాట్ కోహ్లీ 3వ స్థానంలో ఇషాన్ కిషన్ బ్యాటింగ్‌కు దిగనున్నాడు. మరోవైపు తాము టాస్ గెలిచినా.. తొలుత బౌలింగ్ ఎంచుకునే వాళ్లమని అఫ్ఘానిస్థాన్ కెప్టెన్ హష్మతుల్లా షాహిదీ చెప్పాడు. ఇద్దరు పేసర్లు, ఒక ఆల్‌రౌండర్, ముగ్గురు స్పిన్నర్లతో తాము బరిలోకి దిగుతున్నట్లు వెల్లడించాడు. కాగా గాయం కారణంగా ఐపీఎల్ 2026లో కొన్ని మ్యాచ్‌లకు దూరమైన రోహిత్ శర్మ.. ఈ సిరీస్‌తో రీఎంట్రీ ఇస్తున్నాడు. దీంతో అతడు ఎలాంటి ప్రదర్శన చేస్తాడనేది ఆసక్తికరంగా మారింది. ఈ సిరీస్‌లో ఆడితేనే అతడు వన్డే ప్రపంచకప్ 2027 రేసులో ఉండే అవకాశం ఉంది.

## సెమీఫైనల్‌లో సింధుకు ఓటమి

### యమగుచి చేతిలో పరాజయం టోర్నమెంట్ నుంచి నిష్క్రమణ

భారత బ్యాడ్మింటన్ స్టార్ పీవీ సింధుకు మరో ఎదురుదెబ్బ తగిలింది. 2026 ఆస్ట్రేలియా ఓపెన్ సెమీఫైనల్ మ్యాచ్‌లో ఓడిపోయింది. శనివారం జరిగిన సెమీస్‌లో జపాన్ క్రీడాకారిణి అకానె యమగుచిని ఢీకొట్టిన సింధు 22-20, 21-12 తేడాతో ఓడిపోయి టోర్నమెంట్ నుంచి నిష్క్రమించింది. దీంతో 2026లో




తొలి టైటిల్ కోసం సింధు ఎదురుచూపులు కొనసాగుతూనే ఉన్నాయి. ఈ మ్యాచ్‌లో తొలి సెట్ హోరాహోరీగానే సాగింది. యమగుచికి సింధు అద్భుతంగా బదులిచ్చింది. బ్రేక్ టైమ్ దాకా సింధునే ఆధిక్యంలో ఉంది. అయితే విరామం తర్వాత యమగుచి పుంజుకుంది. వరుసగా ఆరు పాయింట్లు గెలుచుకుని మ్యాచ్‌పై పట్టు సాధించింది. సింధు కూడా తిరిగి పుంజుకుని మళ్లీ లీడ్ లోకి వచ్చింది. ఇలా ఈ సెట్ చివరిదాకా ఉత్కంఠభరితంగా సాగింది. ఆఖరికి సింధు 22- 20 తేడాతో మొదటి సెట్‌ను కోల్పోయింది. ఇక రెండో సెట్ దాదాపు వన్‌సైడ్‌గా మారింది. యమగుచి ఆరంభం నుంచే ఆధిపత్యం చెలాయించింది. వరుసగా ఏడు పాయింట్లు రాబట్టి 13- 6తో మ్యాచ్‌పై పట్టు నిలుపుకుంది. ఆ తర్వాతా జోరు కొనసాగించిన యమగుచి రెండో సెట్‌ను 12- 21 భారీ తేడాతో నెగ్గి మ్యాచ్‌లో విజయం సాధించింది. వరసగా రెండు సెట్లలో నెగ్గిన యమగుచి ఫైనల్‌కు దూసుకెళ్లింది. ఇక రేపు జరగనున్న ఫైనల్‌లో యమగుచి, థాయ్‌లాండ్‌కు చెందిన పోర్న్‌పావి చోచువాంగ్‌తో తలపడనుంది.కాగా, ఈ ఏడాది సింధు ఇప్పటిదాకా ఒక్క టైటిల్ కూడా నెగ్గలేదు. ఆమె ఈ టోర్నీకి ముందు సింగపూర్, థాయ్ లాండ్, ఇండోనేసియా ఓపెన్ సూపర్ టోర్నీల్లో క్వార్టర్ ఫైనల్ దాకా వెళ్లింది. కానీ క్వార్టర్స్‌లో ఓడిపోయింది. ఇక మలేసియా ఓపెన్ 500లోనూ సెమీఫైనల్ దాకా చేరుకుంది. సెమీస్‌లో చైనాకు చెందిన వాంగ్ జియితో 21-16, 21-15 తేడాతో సింధు ఓడింది. ఓవరాల్‌గా ఈ ఏడాది సింధుకు మలేసియా, ఆస్ట్రేలియా ఓపెన్ టోర్నీలు అత్యుత్తమ ప్రదర్శనలుగా చెప్పవచ్చు! రెండుసార్లు ఒలింపిక్ పతక విజేత అయిన సింధు 2024లో లఖ్‌నవూలో జరిగిన సయ్యద్ మోదీ ఇంటర్నేషనల్‌లో దీటైన సర్క్యూట్‌లో చివరిసారిగా టైటిల్ గెలుచుకుంది. మరోవైపు ఇదే టోర్నమెంట్‌లో మరో యువ భారత క్రీడాకారిణి తన్వి శర్మ కూడా క్వార్టర్ ఫైనల్స్‌లోనే నిష్క్రమించింది. ఆమెను కూడా యమగుచినే ఓడించింది. అంతేకాకుండా, పురుషుల సింగిల్స్‌లో భారత స్టార్లు కిరణ్ జార్జ్, తరుణ్ మనేపల్లి అనూహ్య ఓటములను చవిచూశారు. ఇక మహిళల సింగిల్స్‌లో సింధు, తన్వి శర్మ కూడా ఇంటి బాట పట్టడంతో భారత అభిమానులు నిరాశకు గురవుతున్నారు.

# యశస్వి జైస్వాల్ ఆల్‌ఫార్మాట్ ప్లేయర్

### యశస్వికి వన్డేల్లో అవకాశం కల్పించాలి: మాజీ డాషింగ్ ఓపెనర్ వీరేంద్ర సెహ్వాగ్

టీమిండియా యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్‌పై మాజీ డాషింగ్ ఓపెనర్ వీరేంద్ర సెహ్వాగ్ ప్రశంసల జల్లు



కురిపించాడు. యశస్వి జైస్వాల్ ఆల్‌ఫార్మాట్ ప్లేయర్ అని, అతనికి వన్డేల్లో అవకాశం కల్పించాలని సూచించాడు. వైట్‌బాల్ క్రికెట్ ఆడే సామర్థ్యం యశస్వి జైస్వాల్‌కు ఉందని, కానీ జట్టులో చోటు లేదని తెలిపాడు. టెస్ట్ ఫార్మాట్‌లో రెగ్యులర్ ఓపెనర్‌గా కొనసాగుతున్న యశస్వి జైస్వాల్‌కు వన్డే ఫార్మాట్‌లో మాత్రం అవకాశం దక్కడం లేదు. రోహిత్ శర్మ, శుభ్‌మన్ గిల్ ఓపెనర్‌గా బరిలోకి దిగుతుండటంతో యశస్వికి వన్డే టీమ్‌లో చోటు లేకుండా పోయింది. ఒకవేళ వచ్చినా ఎక్కువగా బెంచ్‌కే పరిమితం కావాల్సి వస్తోంది. తాజాగా విరాట్ కోహ్లీ గాయంతో యశస్వి జైస్వాల్‌కు అఫ్గాన్‌తో మూడు వన్డేల సిరీస్ ఆడే అవకాశం వచ్చింది. కానీ తుది జట్టులో అవకాశం దక్కుతుందా? అంటే అవునని చెప్పలేని పరిస్థితి నెలకొంది. ఈ క్రమంలోనే వీరేంద్ర సెహ్వాగ్.. భవిష్యత్తులో యశస్వి జైస్వాల్ మూడు ఫార్మాట్లలో ఆడుతాడని జోస్యం చెప్పాడు. 'యశస్వి జైస్వాల్ ఇప్పటివరకు కేవలం నాలుగు వన్డేలు మాత్రమే ఆడాడు. అందులో ఒక సెంచరీ నమోదు చేశాడు. కానీ తర్వాత అతనికి అవకాశాలు రాలేదు. ఎందుకంటే కెప్టెన్ శుభ్‌మన్ గిల్ ఓపెనర్‌గా బరిలోకి దిగుతున్నాడు. రోహిత్ శర్మ ఇంకా వన్డేల్లోనూ కొనసాగుతున్నాడు. దాంతో ఓపెనర్ స్లాట్ ఖాళీగా లేదు. త్వరలోనే రోహిత్ వన్డేలకు వీడ్కోలు పలికే అవకాశం ఉంది.అప్పుడు యశస్వి జైస్వాల్‌కు ఓపెనర్‌గా అవకాశం దక్కుతుంది. అయితే అతనికి రుతురాజ్ గైక్వాడ్ నుంచి పోటీ తప్పదు. జట్టులోకి ముగ్గురు ఓపెనర్లను తీసుకుంటే మాత్రం యశస్వి జైస్వాల్ తప్పకుండా ఉంటాడు. ఇప్పుడు కూడా రోహిత్, గిల్ ఇతర క్రికెటర్ ఎవరైనా అందుబాటులో లేకుంటే యశస్వి జైస్వాల్‌కే తుది జట్టులో చోటు దక్కుతుంది. అంతేకానీ, సరిగ్గా ఆడకపోవడం వల్ల యశస్విని పక్కన పెట్ట లేదు. ఛాన్స్ వచ్చినప్పుడు చక్కగా ఆడాడని మాత్రం మరవకూడదు. మరో ప్లేయర్ ఇషాన్ కిషన్‌కు కూడా ఎక్కువగా వన్డే ఫార్మాట్‌లో అవకాశాలు దక్కడం లేదు. అతను ఈ ఫార్మాట్‌లో ఫాస్టెస్ట్ డబుల్ సెంచరీ చేశాడు. అతను పరిగణనలోకి తీసుకోవాల్సిన క్రికెటర్. అయితే యశస్వి జైస్వాల్‌కు రాబోయే కాలంలో అన్ని ఫార్మాట్లలోనూ చోటు కల్పించాల్సిన అవసరం ఉంది.'అని సెహ్వాగ్ చెప్పుకొచ్చాడు. వీరేంద్ర సెహ్వాగ్ వ్యాఖ్యలతో మాజీ క్రికెటర్ మనోజ్ తివారి కూడా ఏకీభవించాడు. యశస్వి జైస్వాల్‌ను తప్పకుండా జట్టులోకి తీసుకోవాలని సూచించాడు. వన్డే ప్రపంచకప్ 2027 తర్వాత ఇద్దరూ క్రికెటర్లు రిటైర్మెంట్ తీసుకుంటారని, వారి స్థానాలను భర్తీ చేసే ఆటగాళ్లలో యశస్వికే తొలి ప్రాధాన్యత ఇవ్వాలని తివారి అభిప్రాయపడ్డాడు.

# జూన్ 14 నుండి ఈటీవీ విన్ లో స్ట్రీమింగ్ కానున్న "ఇల్లు"

## ప్రమోషన్స్ లో గెస్ట్ గా పాల్గొన్న రాహుల్ రవీంద్రన్



మనోహర ఆర్ట్స్, ఈటీవీ విన్ సంయుక్తంగా సమర్పిస్తూ కిషోర్ మారిశెట్టి నిర్మాతగా రోహిత్, శశి దర్శకత్వంలో ఈటీవీ విన్ ద్వారా ప్రేక్షకుల ముందుకు రానున్న కథ సుధ చిత్రం ఇల్లు. వివేక్ సాగర్ సంగీతాన్ని అందించిన ఈ కథ సుధకు శశాంక్ రాఘవుల సినిమాటోగ్రఫీ చేయగా అవంతి రుయా ఎడిటింగ్ చేశారు. హర్షవర్ధన్, బిందు చంద్రమౌళి ప్రముఖ పాత్రలో కనిపించిన చిత్రంలో అనీష్ కురువిల్ల, పవన్ రమేష్, క్యాంప్ శశి తదితరులు కీలక పాత్రలు పోషించారు. జూన్ 14వ తేదీ నుండి ఈటీవీ విన్ ద్వారా ప్రేక్షకుల ముందుకు రానున్న సందర్భంగా ఈ కథ సుధ చిత్ర బృందం మీడియా వారికి ఎక్స్క్లూజివ్ స్ట్రీమింగ్ తో పాటు ప్రెస్ మీట్ పెట్టడం జరిగింది. ఈ స్ట్రీమింగ్ కు హాజరైన నటుడు, దర్శకుడు రాహుల్ రవీంద్రన్ మాట్లాడుతూ... "ఒక సాధారణ కథను సహజ సిద్దంగా అదేవిధంగా చాలా అందంగా ప్రేక్షకులు ముందుకు తీసుకుని రావడం అనేది ఎంతో క్లిష్టమైన విషయం. జూన్ 14 నుండి స్ట్రీమింగ్ కానున్న ఇల్లు మీ మనసులో ఎంతో ప్రశాంతతను తెలుపుతుంది" అన్నారు. నటి బిందు చంద్రమౌళి మాట్లాడుతూ... "నాకు ఈ చిత్ర దర్శకులు రోహిత్, శశిలు ఎంతో కాలం నుండి తెలుసు. నాకు ఇల్లులో నటించేందుకు అవకాశం ఇచ్చిన వారి ఇద్దరికీ ధన్యవాదాలు అనుకుంటున్నాను. మేము రెగ్యులర్గా చేసే నటన నుండి ఇది కాస్త భిన్నంగా ఉంటుంది. మొదటిసారి నేను ఇల్లు చూసినప్పుడు నాకు ఎలా చెప్పాలో కూడా మాటలు రాలేదు, అంత బాగుంది, నాకు అంతగా నచ్చేసింది. వివేక్ సాగర్ సంగీతం చాలా అద్భుతంగా అనిపించింది. కిషోర్ గారికి, ఈటీవీ వారికి థాంక్స్. హర్ష గారితో గతంలో కూడా కొన్ని చిత్రాలలో కలిసి నటించాను. మరోసారి బృందం అందరికీ ధన్యవాదాలు తెలుపుకుంటున్నాను" అన్నారు. నటుడు అనీష్ కురువిల్ల మాట్లాడుతూ... "నాకు దర్శకులు శశి, రోహిత్ ఎంతో కాలం నుండి తెలుసు. వారి కష్టాన్ని, వారి ఆలోచనలను నేను గమనించాను. ఇటువంటి ప్రతిభ ఉన్న వారిని ఎంకరేజ్ చేసినందుకు ఈటీవీ విన్ వారికి థ్యాంక్స్. ఇటువంటి సహజ సిద్ధమైన పాత్రలో నటించడం ఒక అదృష్టంగా భావిస్తున్నాను. ఇటువంటి దర్శకుల ప్రతిభను గుర్తించి, ప్రోత్సహిస్తున్న ఈటీవీ విన్ వారికి థాంక్స్. ఇటువంటి కథలకు ఇది ఆరంభం మాత్రమే. ఈ చిత్రంలో భాగమైనందుకు ఆనందంగా ఉంది" అన్నారు. దర్శకుడు రోహిత్ మాట్లాడుతూ... "ఈ సినిమా చాలా పద్ధతిగా చేశాము. ఈ రోజుల్లో ఒక చిన్న కథను చూపించడం, దానికి సంగీతం తోడుగా ఉండి ప్రేక్షకులకు చేరడం ఒక ప్రత్యేకమైన విషయం. మరో మూడు రోజుల్లో ఈ చిత్ర షూటింగ్ చేయాలి అనగా నాకు కాస్త సందేహంగా ఉన్న సమయంలో పర్ఫెక్ట్ డేస్ అనే చిత్రం నా ఆలోచన మార్చేసింది" అన్నారు. నిర్మాత కిషోర్ మారిశెట్టి మాట్లాడుతూ... "నేను మనోహరి ఆర్ట్స్ ద్వారా ముందుగా రాణి అని ఆహాలో ఒక ప్రాజెక్ట్ చేశాము. సినిమాలు కూడా చేశాను. ఇప్పుడు నిర్మాతగా రావడానికి కారణం రామానాయుడు గారు, రామోజీ గారు. ఒక ఆర్టిస్టుగా నేను ఇండస్ట్రీకి వచ్చినప్పటికీ ప్రొడక్షన్ ఎలా చేయాలి అనేది నేర్చుకున్నాను. కొత్త కంటెంట్ తీసుకునే రావడం నాకు సంతోషాన్నిస్తోంది. ఈ ప్రాజెక్ట్ నా దగ్గరకి వచ్చినప్పుడు నాకు దర్శకుల పై మంచి నమ్మకం వచ్చింది. వీరి విభిన్నమైన దర్శనత్వ శైలి ప్రత్యేకంగా ఉంటుంది. ఇద్దరు దర్శకులను తెలిసిన పుడు నేను కాస్త ఆలోచించాను, కాని వారి ఆలోచన చూసి నేను ఆశ్చర్యపోయాను. హర్షవర్ధన్ గారి లాంటి సీనియర్ నటుడు ఈ పాత్రను చేయడం ఒక పెద్ద విషయం. నాకు నిర్మాణం పట్ల ఒక అవగాహన ఉండటంతో నా పరిధిలో నేను ఉండి ఈ ప్రాజెక్టు చేశాను. హర్ష గారి సహకారం, వివేక్ సాగర్ సంగీతం అందించడం మాకు బాగా బలాన్ని ఇచ్చింది. ఈ చిత్ర బృందం అందరికీ థాంక్స్" అన్నారు.



# ఘనంగా 'పోలీస్ కంప్లైంట్' మూవీ సక్సెస్ సెలబ్రేషన్స్

### హీరోయిన్ వరలక్ష్మి శరత్‌కుమార్‌తో వివాదంతో సతమతం అయ్యాం

### ఇప్పుడు సినిమా విజయంతో సంతోషంగా ఉన్నాం

### విజయానికి కారణమైన ప్రేక్షకులకు కృతజ్ఞతలు: డైరెక్టర్ సంజీవ్ మేగోటి

### ప్రేక్షకుల ఆదరణతో రెండో రోజు నుంచే పెరిగిన థియేటర్లు

### పాజిటివ్ టాక్‌తో విజయవంతంగా దూసుకుపోతున్న 'పోలీస్ కంప్లైంట్'

వరలక్ష్మి శరత్‌కుమార్, నవీన్ చంద్ర, కృష్ణసాయి, రాగిణి ద్వివేది ప్రధాన పాత్రల్లో ఎంఎస్‌కే ప్రమిద శ్రీ ఫిలిమ్స్ బ్యానర్‌పై బాలకృష్ణ మహారాణా నిర్మించిన హారర్–యాక్షన్ థ్రిల్లర్ 'పోలీస్ కంప్లైంట్' జూన్ 12న ప్రేక్షకుల ముందుకు వచ్చి పాజిటివ్ టాక్‌ను సొంతం చేసుకుంది. క్రియేటివ్ డైరెక్టర్ సంజీవ్ మేగోటి దర్శకత్వంలో



రూపొందిన ఈ చిత్రం ప్రేక్షకులను ఆకట్టుకుంటూ విజయవంతంగా ప్రదర్శితమవుతోంది. సినిమాకు అన్ని వర్గాల ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభిస్తున్న నేపథ్యంలో హైదరాబాద్ ఫిల్మ్ ఛాంబర్‌లో చిత్రబృందం ఘనంగా సక్సెస్ సెలబ్రేషన్స్ నిర్వహించింది. కేక్ కట్ చేసి చిత్ర విజయాన్ని ఆనందంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా నిర్మాతల మండలి కార్యదర్శి ప్రసన్న కుమార్ మాట్లాడుతూ, ఈ సినిమా హీరోయిన్ వరలక్ష్మి శరత్‌కుమార్ సినిమా ప్రమోషన్‌లో పాల్గొనలేదని చిత్రయూనిట్ ఆరోపణల నేపథ్యంలో ఆమె ప్రొడ్యూసర్ కౌన్సిల్ ను సంప్రదించారు. ఈ వివాదాన్ని పెద్దల జోక్యంతో సానుకూలంగా పరిష్కరించుకున్నామని చెప్పాను. దీంతో దర్శకుడు సంజీవ్ మేగోటి గారు తన తప్పు లేకపోయినా వరలక్ష్మి కి సారీ చెప్పారు. ఆయన ప్రదర్శించిన వినయం, సహనమే ఈ విజయానికి మరో కారణమని పేర్కొన్నారు. సినిమా మంచి కలెక్షన్లతో ముందుకు సాగడం ఇండస్ట్రీకి కూడా శుభపరిణామమని అన్నారు. దర్శకుడు సంజీవ్ మేగోటి మాట్లాడుతూ, "మా చిత్ర హీరోయిన్ వరలక్ష్మి శరత్ కుమార్ నాలెడ్జ్ కంటే మా నాలెడ్జ్ లక్ష రెట్లు ఎక్కువ ఉంది. అందుకే ప్రసన్న కుమార్ వంటి పెద్దల సూచన మేరకే ఆమెకు సారీ చెప్పడం జరిగింది. అంతేకానీ, సమస్య పూర్తి సర్దుమణిగిందని కూడా చెప్పలేను. మొత్తానికి ఒక వివాదంతో సతమతం అయ్యాం.. చివరికి విజయంతో శుభం కార్డు పడిందని భావిస్తున్నాం. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లో విడుదలైన 'పోలీస్ కంప్లైంట్'కు అద్భుతమైన స్పందన వస్తోంది. విడుదలైన రెండవ రోజు నుంచే థియేటర్లు పెరుగుతున్నాయి. దర్శకుడిగా, రచయితగా, సంగీత దర్శకుడిగా ఈ సినిమా నాకు ఎంతో ప్రత్యేకం. చిత్రబృందంలోని ప్రతి ఒక్కరి కృషి వల్లే ఈ విజయం సాధ్యమైంది. సూపర్ స్టార్ కృష్ణగారికి నివాళిగా రూపొందించిన ప్రత్యేక గీతానికి ప్రేక్షకుల నుంచి విశేష ఆదరణ లభించింది. థియేటర్ల నుంచి బయటకు వచ్చే ప్రేక్షకులు సంతృప్తిగా స్పందించడం మాకు ఎంతో ఆనందాన్ని ఇస్తోంది" అని అన్నారు. అలాగే, "52 మంది సీనియర్ ఆర్టిస్టులతో కేవలం 45 రోజుల్లో చిత్రీకరణ పూర్తి చేశాం. 'చైన్ రియాక్షన్ ఆఫ్ కర్మ' అనే విభిన్న కాన్సెప్ట్ ఆధారంగా రూపొందిన ఈ కథలో హారర్, థ్రిల్లర్, యాక్షన్ అంశాలను సమన్వయం చేశాం. ఈ చిత్రాన్ని విజయవంతం చేసిన ప్రతి ప్రేక్షకుడికి హృదయపూర్వక కృతజ్ఞతలు" అని తెలిపారు. హీరో కృష్ణసాయి మాట్లాడుతూ, "సినిమాకు ప్రేక్షకుల నుంచి వస్తున్న ఆదరణ ఎంతో ఆనందాన్ని కలిగిస్తోంది. దర్శకుడు సంజీవ్ మేగోటి ఈ చిత్రాన్ని అద్భుతంగా తెరకెక్కించారు. నా అభిమాన నటుడు సూపర్ స్టార్ కృష్ణగారిని గుర్తు చేసే పాటలో నటించడం నాకు ప్రత్యేక అనుభూతిని ఇచ్చింది. కుటుంబ సమేతంగా చూసే మంచి వినోదాత్మక చిత్రం ఇది" అన్నారు.

# ఓ..! సుకుమారి' పర్ఫెక్ట్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్

## ఖచ్చితంగా ఆడియన్స్ ఎంజాయ్ చేస్తారు: టీజర్ లాంచ్ ఈవెంట్ లో హీరో తిరువీర్

తిరువీర్, ఐశ్వర్య రాజేష్, భరత్ దర్శన్, మహేశ్వర రెడ్డి మూలి, గంగా ఎంటర్‌టైన్‌మెంట్స్ 'ఓ..! సుకుమారి' హిలేరియస్ టీజర్ లాంచ్ యంగ్ ట్యాలెంట్ తిరువీర్, వెర్సటైల్ ఐశ్వర్య రాజేష్ తొలిసారిగా 'ఓ..! సుకుమారి' అనే గ్రామీణ నేపథ్యంలో సాగే రొమాంటిక్ కామెడీ చిత్రంలో కలిసి నటిస్తున్నారు. ఈ సినిమాతో భరత్ దర్శన్ దర్శకుడిగా పరిచయమవుతున్నారు. విమర్శకుల ప్రశంసలు పొందిన 'శివం భజే' చిత్రాన్ని నిర్మించిన గంగా ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై మహేశ్వర రెడ్డి మూలి దీనిని నిర్మిస్తున్నారు. ప్రధాన నటీనటుల ఫస్ట్ లుక్‌ను విడుదల చేసిన తర్వాత, చిత్ర బృందం ఇప్పుడు సినిమా టీజర్‌ను ప్రేక్షకుల ముందుకు తెచ్చింది. స్థానిక రాజకీయాల్లో చురుకుగా పాల్గొంటూ, మంచి మనసున్న అమ్మాయిని పెళ్లి చేసుకోవాలని కలలు కంటుంటాడు తిరువీర్ . అలాంటి సమయంలో దామిని అనే అమ్మాయిని చూసిన వెంటనే ఆమెనే తన జీవిత భాగస్వామిగా భావించి పెళ్లి ఏర్పాట్లు మొదలుపెడతాడు. అయితే ఆమె కుటుంబం ఆమెను తాకిన ఎవరికైనా విద్యుత్ షాక్ కొడుతుందనే ఒక విచిత్రమైన రహస్యాన్ని దాచిపెడుతుంది. దర్శకుడు భరత్ ధర్శన్ గ్రామీణ వాతావరణం, స్థానిక రాజకీయాలు, వినూత్నమైన ట్విస్ట్‌ను తో వినోదభరితమైన కథను తెరకెక్కించారు. గ్రామీణ నేపథ్యాన్ని సినిమాటోగ్రాఫర్ సీహెచ్ కుషేందర్ అందమైన విజువల్స్‌తో ఆకట్టుకునేలా చూపించారు. భరత్ మంచిరాజు అందించిన సంగీతం టీజర్‌కు ఉత్సాహభరితమైన



అనుభూతిని తీసుకొచ్చింది. బలగం ఫేమ్ తిరుమల ఎం. తిరుపతి ఆర్ట్ డైరెక్టర్‌గా, క ఫేమ్ శ్రీ వరప్రసాద్ ఎడిటర్‌గా, స్వయంభు ఫేమ్ అను రెడ్డి అక్కటి కాస్ట్యూమ్ డిజైనర్‌గా పని చేస్తున్నారు. పూర్ణాచారి పాటలు రాశారు. తిరు వీర్ తన పాత్రలో సహజంగా ఒదిగిపోయి, అద్భుతమైన కామెడీ టైమింగ్‌తో ఆకట్టుకున్నారు. ఐశ్వర్య రాజేష్ గ్రామీణ యువతిగా కనిపిస్తూ, తన పాత్రలో ఒక ఆసక్తి కరమైన మలుపును తీసుకువచ్చారు. మురళీధర్ గౌడ్, మ్యాడ్ ఫేమ్ విష్ణు ఓయ్, ఝాన్సీ, ఆమని, ఆనంద్‌కోట జయరామ్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. మొత్తంగా టీజర్ వినోదం, ఆసక్తికరమైన కాన్సెప్ట్, హాస్యభరితమైన సన్నివేశాలతో ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. తెలుగు, తమిళ, మలయాళ, కన్నడ భాషల్లో ఈ చిత్రం విడుదల కానుంది.

# 'హిట్ అండ్ రన్' చిత్రంలో రిపోర్టర్ సాక్షి పాత్రలో నటాషా సింగ్.. ఫస్ట్ లుక్ పోస్టర్ రిలీజ్ చేసిన రకుల్ ప్రీత్

సంజయ్ రావ్, నటాషా సింగ్ ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న చిత్రం 'హిట్ అండ్ రన్'. క్రైమ్, థ్రిల్లర్ జానర్‌లో రాబోతోన్న ఈ సినిమాను శ్రీ ఉరుకుంద ఈరణ్ణ స్వామి సమర్పణలో సతీష్ రెడ్డి అల్లం ఎంటర్టైన్మెంట్, శ్రీలక్ష్మీ నరసింహస్వామి క్రియేషన్స్ బ్యానర్‌ల మీద సతీష్ రెడ్డి అల్లం, కె. శేఖర్ నిర్మిస్తున్నారు. ఈ మూవీకి సాయి కృష్ణ సాగర్ దర్శకత్వం వహిస్తున్నారు. రీసెంట్‌గా రిలీజ్ చేసిన సంజయ్ రావ్ పాత్ర, ఫస్ట్ లుక్ పోస్టర్ అందరినీ ఆకట్టుకున్నాయి. 'హిట్ అండ్ రన్' కాన్సెప్ట్ తెలిసేలా రిలీజ్ చేసిన ఫస్ట్ లుక్ అందరిలోనూ అంచనాలు పెంచేసింది. తాజాగా ఇప్పుడు రకుల్ ప్రీత్ సింగ్ 'హిట్ అండ్ రన్' సినిమాలోని హీరోయిన్ పాత్రకు సంబంధించిన లుక్‌ను రివీల్ చేశారు. నటాషా సింగ్ ఈ సినిమాలో రిపోర్టర్ సాక్షి అనే పాత్రలో కనిపించనున్నారు. పోస్టర్‌లో కనిపిస్తున్న కారు, వెనకాల ఉన్న డీటైల్స్ అన్నీ కూడా ఇంట్రెస్టింగ్‌గా ఉన్నాయి. ఇక హీరోయిన్ లుక్ కూడా చాలా డిఫరెంట్‌గా కనిపిస్తోంది. త్వరలోనే 'హిట్ అండ్ రన్' టీజర్‌తో అందరినీ మెస్మరైజ్ చేయనున్నారు. ఈ సినిమాకి ప్రిన్స్ హెన్రీ సంగీతాన్ని అందిస్తున్నారు. డి. వెంకట్ ప్రభు ఎడిటర్‌గా వ్యవహరిస్తున్నారు.

# 'ట్రాన్స్‌ఫర్ త్రిమూర్తులు' చిత్రం పెద్ద హిట్ అవ్వాలని మనస్పూర్తిగా కోరుకుంటున్నాను

## ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో వి. వి. వినాయక్


వడ్డే జిష్ణు సమర్పణలో వడ్డే క్రియేషన్స్ బ్యానర్ మీద వడ్డే నవీన్ హీరోగా, నిర్మాతగా రూపొందించిన చిత్రం 'ట్రాన్స్‌ఫర్ త్రిమూర్తులు'. కమల్ తేజ నార్ల దర్శకుడిగా పరిచయమవుతు



న్నారు. ఈ సినిమాలో వడ్డే నవీన్, రాశి సింగ్, శిల్పా తులస్కర్, వివేక్ రఘువంశీ, రఘుబాబు, శివన్నారాయణ, వడ్లమాని శ్రీనివాస్, జ్వాలా కోటి, దేవి ప్రసాద్, సూర్య, బాబా బాస్కర్, ప్రమోదిని, సాత్విక్ రాజు, అంజలి ప్రియ, గాయత్రి చాగంటి తదితరులు ముఖ్య పాత్రల్ని పోషించారు. ఈ మూవీని జూన్ 19న విడుదల చేయనున్నారు. ఈ క్రమంలో శుక్రవారం మూవీ ట్రైలర్‌ను రిలీజ్ చేశారు. ఈ మేరకు నిర్వహించిన ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌కు ప్రముఖ దర్శకుడు వి.వి. వినాయక్ ముఖ్య అతిథిగా విచ్చేసి ట్రైలర్‌ను లాంచ్ చేశారు. ఈ కార్యక్రమంలో.. వి.వి. వినాయక్ మాట్లాడుతూ .. "వడ్డే నవీన్ గారు ఈ కార్యక్రమానికి నన్ను పిలిచినందుకు థాంక్స్. నేను ఆయన చిత్రానికి అసిస్టెంట్, కో డైరెక్టర్‌గా పని చేశాను. నవీన్ గారితో సినిమా చేస్తున్న టైంలోనే 'ఆది'కి నాంది పలికినట్టు అయింది. నవీన్ గారు నన్నెంతో ఇష్టంగా చూసుకునేవారు. ఆయన కెరీర్‌లోని 90 శాతం సినిమాలు మనస్పూర్తిగా ఇష్టంతో చేయలేదు. ఆ విషయం నాకు తెలుసు. సినిమాల పట్ల ఆయనెప్పుడూ తృప్తిగా ఉండరు. ఓ సందర్భంలో ఆయన పరపతి చూసి షాక్ అయ్యాను. ఇకపై ఆయన తన మనసుకు నచ్చిన చిత్రాలే చేయాలని కోరుకుంటు న్నాను. 'ట్రాన్స్‌ఫర్ త్రిమూర్తులు' చిత్రం పెద్ద హిట్ అవ్వాలని మనస్పూర్తిగా కోరుకుంటున్నాను' అని అన్నారు. వడ్డే నవీన్ మాట్లాడుతూ .. "వినయ్ అప్పుడూ, ఇప్పుడూ వినయంగానే ఉన్నారు. ఆయన జర్నీ నాకెంతో గర్వంగా అనిపిస్తుంది. మా కోసం వచ్చిన వినయ్‌కి థాంక్స్. సినిమా కోసం టీం అంతా ఇష్టపడి చేశారు. ఈ పదేళ్లలో టెక్నికల్ పరంగా ఎన్నో మార్పులు వచ్చాయి. ఈ మూవీలో కోర్ట్ డ్రామాతో పాటు సస్పెన్స్ బాగుంటుంది. ఏ ఫ్రైడే అయినా కూడా సింగిల్‌గా సినిమా రాలేదు. ఒకరితో పోటీ అని కాదు.. మూవీ బాగుంటేనే ఆడియెన్స్ చూస్తారు. ఈ చిత్రాన్ని సహజత్వానికి దగ్గరగా ఉండేలానే చూసుకున్నాం. ఇందులోని కంటెంట్ స్ట్రాంగ్‌గా ఉంటుంది. మాకు జీ టీం కూడా సపోర్ట్ చేస్తోంది. జూన్ 19న మా చిత్రం రాబోతోంది. అందరికీ నచ్చుతుందని ఆశిస్తున్నాను' అని అన్నారు.

# కలెక్షన్లలో దూసుకెళ్తున్న పెద్ది

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ కథానాయకుడిగా నటించిన 'పెద్ది' బాక్సాఫీస్ వద్ద విజయవంతమైన ప్రస్థానాన్ని కొనసాగిస్తోంది. దర్శకుడు బుచ్చిబాబు సన తెరకెక్కించిన ఈ ఎమోషనల్ స్పోర్ట్స్ డ్రామా ప్రేక్షకుల నుంచి విశేష ఆదరణ పొందుతూ భారీ వసూళ్లతో దూసుకుపోతోంది. విడుదలైన తొలి రోజు నుంచే పాజిటివ్ రెస్పాన్స్ అందుకున్న ఈ చిత్రం ఇప్పుడు రామ్ చరణ్ కెరీర్‌లో అత్యధిక వసూళ్లు సాధించిన సోలో చిత్రంగా నిలిచే దిశగా అడుగులు వేస్తోంది. ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా సంచలన వసూళ్లు నమోదు చేసిన 'పెద్ది' తాజాగా మరో కీలక మైలురాయిని అందుకుంది. సినిమా విడుదలై తొమ్మిది రోజులు పూర్తయిన సందర్భంగా చిత్ర నిర్మాణ సంస్థ అధికారికంగా కలెక్షన్ల వివరాలను ప్రకటించింది. మేకర్స్ వెల్లడించిన సమాచారం ప్రకారం, 'పెద్ది' ప్రపంచవ్యాప్తంగా తొలి తొమ్మిది రోజుల్లో ఏకంగా రూ. 366 కోట్ల గ్రాస్ వసూళ్లు సాధించింది. ఈ భారీ వసూళ్లతో రామ్ చరణ్ కెరీర్‌లో 'పెద్ది' రెండో అతిపెద్ద గ్రాసర్‌గా నిలిచింది. ముఖ్యంగా సోలో హీరోగా చరణ్ నటించిన చిత్రాల్లో అత్యధిక వసూళ్లు రాబట్టిన సినిమాగా ఇది రికార్డు సృష్టించింది. గ్రామీణ నేపథ్యం, క్రీడా అంశాలు, భావోద్వేగాలతో కూడిన కథ ప్రేక్షకులను ఆకట్టుకోవడంతో అన్ని వర్గాల ప్రేక్షకుల నుంచి సినిమాకు




మంచి ఆదరణ లభిస్తోంది. ప్రస్తుతం వీకెండ్ బుకింగ్స్ కూడా ఆశాజనకంగా ఉన్నట్లు ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. 'పెద్ది' త్వరలోనే రూ. 400 కోట్ల గ్రాస్ క్లబ్‌లోకి చేరడం ఖాయమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. వీకెండ్ ముగిసే నాటికి ఈ చిత్రం 400 కోట్ల మార్కును అందుకుంటుందా లేదా అనే అంశంపై సినీ వర్గాల్లో ఆసక్తికర చర్చ సాగుతోంది. ప్రస్తుతం మార్కెట్‌లో పెద్ద సినిమాల పోటీ లేకపోవడం, కుటుంబ ప్రేక్షకుల మద్దతు కొనసాగుతుండటం 'పెద్ది'కి అదనపు బలంగా మారింది. ఈ చిత్రంలో రామ్ చరణ్ నటనకు ప్రేక్షకులతో పాటు విమర్శకుల నుంచి కూడా ప్రశంసలు లభిస్తున్నాయి. పాత్రలో ఆయన చూపించిన భావోద్వేగాలు, క్రీడాకారుడిగా చేసిన పరివర్తన సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. దర్శకుడు బుచ్చిబాబు సానా కథను తెరకెక్కించిన తీరు కూడా ప్రత్యేక ప్రశంసలు అందుకుంటోంది.

Published ,printed and owend by Sudheer Kumar Katepally printed at Sree sesha Sai enterprises , plot no .98/part 1,co-operative industrial estate phase-II, Gandhi nagar Hyderabad,Medchal Malkajgiri , Telangana-500037. Published at 6-3-553,Flat no .G2, CLassic Court Ane A, opp:NKM Grand hotel, Erramanzil Colony, Somajiguda, Hyderabad, Telangana-500082.Editor : Sudheer kumar katepally ph: 9000657700 PRGI NO: TGTEL/26/A2380